
ఆంధ్ర సచిత్ర వారపత్రిక

18-2-83
150 పైసలు







ఎంత బహుళ ప్రయోజనమైనదంటే, ఇది లేకుండా ఇన్నాళ్ళు ఎలా వంట చేయగలిగామని మీకే ఆశ్చర్యం కలుగుతుంది.

ప్రెస్టీజ్ వారి ప్రెషర్ పాన్



నకిలీలుంటాయి జాగ్రత్త! అవి ప్రమాదకరమైనవి.

వేపుడు	హెచ్చు వేపుడు	సాట్	ప్రెషర్ కుక్

మీరు ఇందులో వేపుడు, హెచ్చు వేపుడు వేసుకోవచ్చు అవసరమైన అన్నిరకాల మేరకు వేపుడు వేసుకోవచ్చు మూత ఉంచి వండాలి అంతే.ప్రెస్టీజ్ ప్రెషర్ పాన్ వెంటనే మీకు సిద్ధం చేస్తుంది బహుళ ప్రయోజనమైనది మరియు ఎంతో ముచ్చటైనది మీ కుటుంబానికి నోరూరించే రుచికరమైన వంటకాలు క్షణాలలో సిద్ధం చేయడంలో మీకు తోడ్పడేందుకు అనువుగా రూపొందించబడింది

మూత వేయకుంటే దళసరి గేజ్ కలిగిన ఈ పాన్‌పై కొద్ది నూనెతో ఉల్లిపాయలు, కూరగాయలు, మసాలాలు, మాంసాన్ని, కోడి మాంసాన్ని వేపుడు వేసుకోవచ్చు ప్రెస్టీజ్ మూతతో దీనిని మూస్తే, మీ వంటకాన్ని వెంటనే సిద్ధం చేస్తుంది కోడి బుర్రా? 20 నిమిషాలు. మటన్ దోపియాజీ? 25 నిమిషాలు

దమ్ ఆలూ? ఇంకా తక్కువ వ్యవధిలో మంచి పనులకోసం మీ సమయాన్ని ఆదా చేసుకోండి మరియు మీ ఇంధనం చిరకాలం నిలువడానికి తోడ్పడుతుంది

ఒక్క వంటకానికి రకరకాల పాకాలు ఉపయోగించి చివరకు కుక్కర్‌లో వండే శ్రమ ఇక మీకు ఉండదు బహు పాత్రల పనికి అనుకూలమైన ఏకైక పాత్రను ప్రెస్టీజ్ ప్రెషర్ పాన్ మీకు అందిస్తున్నది

ప్రెస్టీజ్ వారే ఈ ప్రెషర్ పాన్‌ను ఉత్పత్తి చేస్తున్నారు మిక్కిలి ప్రజాదరణ కలిగిన ప్రెషర్ కుక్కర్‌ను భారతదేశంలో మొట్టమొదటగా ప్రవేశపెట్టి, అద్వితీయమైన గేస్కెట్ రిలీజ్ సిస్టమ్ ద్వారా ప్రెషర్ వంటను నిరపాయకరంగా తీర్చిదిద్దినది ప్రెస్టీజ్ వారే ప్రెస్టీజ్ ప్రెషర్ పాన్ మీ వంటగదిలో మీకు ఇతోధికంగా ఉపయోగపడుతుంది

<u>దీని ధరలో సగానికంటె తక్కువకే మీరు దీనిని పొందాలంటే ఇదిగో....</u>

మీకు ఇప్పటికే ప్రెస్టీజ్ ప్రెషర్ కుక్కర్ ఉంటే మిమ్మ మీరు అభినందించుకోండి, భారీ గేజ్ కలిగిన పాన్ ధరకే ప్రెస్టీజ్ ప్రెషర్ పాన్ మీదవుతుంది ఒక్క పెనం కొంటే చాలు మీ ప్రెస్టీజ్ కుక్కర్ మూత దీనికి సరిగ్గా సరిపోతుంది అంత సరసమైన ధరకు ప్రెస్టీజ్ ప్రెషర్ పాన్ మీకు లభింపజేస్తోంది ఎందుకంటే, మీ కష్టార్జితమైన సొమ్ముకు విలువైన, నాణ్యమైన ఉత్పత్తులను మీకు సమకూర్చడానికి ప్రెస్టీజ్ కంపెనీ కృషి చేస్తున్నది

ప్రెస్టీజ్ ప్రెషర్ కుక్కర్ ఇంకా మీవద్ద లేకుంటే....

ఒకేసారి బహుళ ప్రయోజనాలు పొందడానికి నిజంగా ఇది మీకు మహదవకాశము వంటగదిలో మీకు ఫలేగా, ఉపయోగపడగల రెండు పాత్రలు ఇప్పుడు మేము మీకు అందిస్తున్నాము—అద్వితీయమైన గేస్కెట్ రిలీజ్ సిస్టమ్ కలిగి భారతదేశంలోకెల్ల నిరపాయకరమైన ప్రెషర్ కుక్కర్ మరియు అద్భుతమైన ప్రెషర్ పాన్—ఒకే ధరకు కొంచెం ఎక్కువలో రెండు పాత్రలు లభిస్తాయి.

ఒకే మూత రెండింటికి సరిపోతుంది మరియు మీకు రూ 150/-లు ఆదా


Prestige

PRESSURE PAN


TTK తయారీ.

maa(S) PP 1 Tel b 82


డిటర్జెంట్
వలన దుస్తులు కేవలం స్వచ్ఛమవుతాయి



రానిపాల్
వలన అవే దుస్తులు ధగధగ తెల్లగా అవుతాయి



అందువలన ప్రతి సారి డిటర్జెంట్‌తో ఉతికిన తరువాత దుస్తులను రానిపాల్ కలిపిన నీటిలో ముంచండి




Shilpi SGCD 4/82 Te

రానిపాల్-సర్వోత్తమ తెలుపు కోసం



రానిపాల్
నూలు దుస్తులకు



రానిపాల్-ఎస్
సింథెటిక్ మరియు మిశ్రమ దుస్తులకు

ఈ సైజులలో లభించును : రానిపాల్-1 గ్రామ్, 25 గ్రామ్‌లు, 100 గ్రామ్‌లు, రానిపాల్-ఎస్-20 గ్రామ్‌లు

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938–1972]
శుక్రవారం : 18–2–'83
దుందుభినామ సం. అధిక ఫాల్గుణ శు. పంచమి
సంపుటము 75 : సంచిక 25
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

విడి ప్రతి వెల	రు. 1–50
ఆరుమాసాల చందా	రు. 42–90
పోస్టులో ఏడాది చందా	రు. 85–80

ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం

'బాబు' గారి కార్టూన్ ముఖచిత్రంతో వెలువడిన 'ఆంధ్రపత్రిక' మమ్మలనెంతో అలరించింది. కథలు చాలా ఎక్కువ ప్రచురించి, ఎంతో కాలానికి మంచి కథలు చదివిన తృప్తి కలిగించారు.

కొమ్మినేని శ్రీనివాసరావు (గుంటూరు)

రచయిత కర్తవ్యం

నూతిలో కప్పల్లా ఆలోచనలు కొనసాగిస్తున్న నేటి రచయిత(త్రు)ల అహంభావాన్ని సూటిగా చక్కగా విమర్శించారు డాక్టరు జయదుబాషిగారు, 'న్యూఢిల్లీ లేఖ'అనే శీర్షికలో. చరిత్రకారులుచెప్పిందే వేదముసుకొని చర్విత చరణంగా చరిత్రను ఏకరువు పెట్టడమేకాదు, ఈ నాటి చరిత్రలో వచ్చిన (వస్తున్న) పరిణామాల పరిధుల్ని కనుక్కొని పరిస్థితుల ప్రభావం వాస్తవవిషయాలపై ఎలాకేంద్రీకృతమవుతూన్నదన్న సత్యాన్ని కూడా చెప్పగలిగినప్పుడే రచయిత గొప్పవాడవుతాడు. అందుకు అవసరమైన సాధన సంపత్తి సామాజిక జీవనంలో చైతన్య రహితంగా జీవితం గడుపుతూన్న ఏ వర్గం ప్రజల నుండైనా రాబట్టాలి. 'అహం' ముసుగులో దాగొని, అవాస్తవిక దృక్కుల్లోంచి రచనలు చేస్తే 'సాహిత్యం' సమాజం మేలుకోసం అనుకోవటం వరకే పరిమితం. సామాన్యుడు సాలె గూడులాంటి సమాజంలో, బయటపడలేకపోతున్న బడుగు ప్రాణి. వాడ్నిగురించి తెలుసుకొని,మనకున్న ఆలోచనా పరిధిల్లో ఆ సమస్యల శాశ్వత పరిష్కార మార్గాలను సూచించడం 'రచయిత' అన ఒడే పట్టం కట్టుకున్న ప్రతి ఒక్కడి కర్తవ్యం.

ఎం. భానుమూర్తి (రాజమండ్రి)

ఏ కులము నీదంటే ...

7.1.83 నాటి ఆంధ్ర సచిత్రవారపత్రికలో ప్రచురించిన ఏ కులము నీ దంటే కథ చాలా బాగుంది. ముఖ్యంగా భార్గవి, శీనుల పాత్రలు చాలా చక్కగా చిత్రీకరించారు. చిన్నవాడయినా శీను అనంతశర్మకు చక్కగా కళ్లు తెరిపించాడు. కులాల బేధాభిప్రాయాలు లేకుండా ఉంటేనే ఈ సమాజం బాగుపడుతుంది. రచయిత్రి శంఖువరం సరోజా సింధూరి గారికి నా హృదయపూర్వక వందనములు.

ఎం. వి. శ్యామకుమారి (బిలాస్‌పూర్, మ. ప్ర.)

కొత్త గొంతులు

14—1—83 నాటి ఆంధ్ర సచిత్ర వార పత్రిక ముఖచిత్రం నటి స్వప్న శోభయమానంగా వుండి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ మమ్మల్ని ఎంతగానో అలరించింది. కొత్తగొంతులు సరికొత్త ఈ శీర్షిక ఆంతర్యం ఎంతో ఆహ్లాదకరంగానూ, సాహితీ అభిమానులమైన మాకు ఈ శీర్షిక ఎంతో నచ్చింది. టి. యల్. కాంతారావుగార్కి నా అభినందనలు.

హేమసుందర్‌రావు, ప్రియా, హేమబిందు (డోర్నకల్)



ఇది సంధ్యాసమయం

14.1.83 నాటి స్వప్న ముఖచిత్రంతో వెలువడిన పత్రిక చాలా ఆకర్షనీయంగా వుంది. ఇది సంధ్యా సమయం (పెద్దకథ) ముగింపు మాకు అంతగా నచ్చలేదు. మధ్యపేజీలోని శ్రీదేవి క్యాలెండరు చాలా బావుంది.

సి. మనోహరి (మార్కాపురం)

* * *

'ఇది సంధ్యా సమయం' ముగింపు చదివాక మా కళ్లలో నీళ్లు తిరిగాయి. శ్రీనివాసులు కలయిక ఎలా వుంటుందో, ముఖ్యంగా సుజాత ఎలా వుంటుందో అని ఆత్రంగా ఎదురు చూచిన మాకు నిరాశే మిగిలింది.

తామాడ తారకరామారావు (బాతుపురం)

* * *

14.1.83 నాటి ముఖచిత్రం నా అభిమాన నటి స్వప్న చాలా ఆకర్షనీయంగా ఉంది. పెద్ద కథ 'ఇది సంధ్యాసమయం' ముగింపు చాలాబాగుంది. రాగాగ్ని సీరియల్ ఉత్కంఠతతో సాగుతోంది.

డి. రాజ్యలక్ష్మి (యలమంచిలి)

న్యూఢిల్లీ లేఖ

మీరు వారము వారము ప్రచురించుచున్న 'న్యూఢిల్లీ లేఖ' చాలా ఆసక్తికరముగా, విజ్ఞాన దాయకముగా యున్నది. ఆయన 'గాంధీ' చిత్రం గురించి, ఆసియాడ్ గురించి, నెహ్రూ కుటుంబము గురించి చాలా ఆసక్తికరమయిన విషయములను తెలియ జేశారు.

కృష్ణారావు (వాయల్పాడు)

ఆలోచననీ ...

డాక్టర్ జయదుబాష్‌గారి "న్యూఢిల్లీలేఖ" వ్యాసములు ఎంతో ఆలోచింపజేసేలా ఉంటున్నాయి.

ఎ. కృష్ణమోహన్ (బెల్లంపల్లి)

కాలెండర్

14.1.83 నాటి సంచిక ఆకర్షనీయంగా ఉంది. కేలండర్ అనుపదము 'కేలండరియం'' అనే లాటిన్ పదం నుండి ప్రచారంలోకి వచ్చిన విషయం "క్యాలండరు కథ" ద్వార తెలిసింది. మాసం చూసే ఈ కేలండర్‌కి ఇంత చరిత్ర ఉన్నదంటే నిజంగా ఆశ్చర్యం.

బళ్లారి మహమ్మద్ (గుత్తి)

అతడి పేరు మనిషి

14.1.83 తేదీ సంచికలో మీరు ప్రచురించిన కథ "అతడిపేరు మనిషి" ఎంతో చక్కని రచన. నేటి సమాజ వ్యవస్థలో గడ్డిపోచ కింద పరిగణింపబడి మనుగడ సాగిస్తున్న నిరుపేదల దయనీయ జీవితం, వాళ్లలో మిగిలిన నిజాయితీ అతిసహజంగా వర్ణించారు రచయిత. శైలి, సన్నివేశాలు బాగున్నాయి.

కె. సుబ్రహ్మణ్యం (బెంగుళూరు)

పై వారమే ప్రారంభం!

కొత్త సీరియల్ నవల

అందానికి అవతలివైపు

రచన : కేయస్వీ

*

పెద్ద కథ

అడ్డదారులు

రచన : టి. ఎస్. ఎ. కృష్ణమూర్తి

కాంగ్రెసు సంస్కృతి అంటే ఏమిటి?

ఫ్రాన్సులో 'బోర్బన్' అనే రాజవంశం ఉండేది. ఈ వంశంవాళ్లు తమ అనుభవాల ద్వారా ఏమీ తెలుసుకోలేరనేవాళ్లు. పోనీ మరిచిపోయే వాళ్లా అంటే అదీలేదు. మన కాంగ్రెసు వాళ్లూ అంతే. ఈ పద్ధతి వాళ్లకి బాగా పనికొస్తుంది. ఏమి జరిగినా తమకి ఏదీ పట్టనట్లు పోతూ ఉంటారు. మొన్న మొన్న దక్షిణాదిన తగిలిన చెంపపెట్టు వాళ్ల మొహానికి కాదుగా తగిలింది? ఆ దెబ్బ ప్రతిధ్వని ప్రపంచం అంతా వినపడింది కాని కాంగ్రెసు వాళ్ళు ఏమీ మాటాడటంలేదు. శ్రీమతి గాంధీ మళ్లీ తమ పాత ధోరణిలో అందరినీ తిట్టేస్తున్నారు – భా. జ. పా. నుంచి లోక్‌దళం దాకా – కాని తమని వోటరులు ఎందుకు వద్దన్నారో (ఒక పాత చెప్పని తీసేసినట్లే) ఆమె చెప్పరు. ఒకప్పుడు ఆమెని మించిన వ్యక్తి లేదన్నవాళ్లే ఇప్పుడు ఆమెని కాదన్నారు కదా?!

''కాంగ్రెసు సంస్కృతి'' అంటే ఇదే. గొప్ప నీతులు చెబుతూ సిగ్గు విడిచి ప్రవర్తించటం. అబ్దుల్ రెహమాన్ అంతూలే లాంటి మనిషి తనది కాంగ్రెసు సంస్కృతి అంటే అర్థం ఇదే — డబ్బు, పదవి కోసం మానం వదులుకుని పరిగెత్తటమే; ప్రజాస్వామ్యం అంటే ఎంత నమ్మకం ఉందో మళ్లీ మళ్లీ చెప్పటమే. అసలు ఇది సంస్కృతి కాదు ఒక పద్ధతి. ఈ పద్ధతిని అనుసరించే వాళ్ళు ఒక రకంగా మాట్లాడుతూ ఉంటారు, నడుచుకుంటూ ఉంటారు. దీనిని మొదలు పెట్టినవారు శ్రీమతి గాంధీ కాదు, ఆమె తండ్రి జవహర్‌లాల్ నెహ్రూ. కాంగ్రెసు సంస్కృతి అంటే నెహ్రూ సంస్కృతే. కాని, నెహ్రూ చాలా గడుసు మనిషి. ఆయనకి ఈ సంస్కృతి నప్పింది. జయప్రకాష్ నారాయణ లాంటి వాళ్లు నెహ్రూ విడంబనాన్ని అర్థం చేసుకుని ఆయనకే చెప్పేశారు తమ అభిప్రాయం ఏమిటో. ''విదేశాల వాళ్ళు నీకు ఇచ్చే ప్రశంసా పత్రాలని చూసి మురిసిపోతావు నువ్వు'' అని జయప్రకాష్ ఒకసారి నెహ్రూతో అన్నాడు. నెహ్రూ నిరుత్తరుడుగా ఉండిపోయాడు. విదేశాల వాళ్ళు ఒక ఉక్కు మిల్లునో లేదా ఒక విద్యుచ్ఛక్తి కేంద్రాన్నో అమ్మేఆశతో శ్రీమతి గాంధీకి సర్టిఫికేట్‌లు ఇస్తారు. ఆమె వాటిని సగర్వంగా ప్రదర్శించుకుంటూ ఉంటారు స్వరాజ్యం రాకముందు కొందరు రాయిబహదూర్‌లు తమ మెడ చుట్టూ చవుకబారు యోగ్యతా పత్రాలు తగిలించుకుని తిరిగేవారు సిగ్గు లేకుండా — ప్రపంచంలో ఇంకే నాయకులూ శ్రీమతి గాంధీలాగ వాటిని మెడకి తగిలించుకుని తిరగరు.

అసలు కాంగ్రెసు సంస్కృతి అంటే ఏమిటి? ఒక మాట చెప్పి ఇంకొకటి చెయ్యటమే కాంగ్రెసు సంస్కృతి నెహ్రూ ఈ పద్ధతికి బాగా మెరుగులు దిద్దారు. అది ఆయన తప్పు కాదనుకోండి తన సంగతి

న్యూఢిల్లీ లేఖ

డాక్టర్ జయ్ దుబాషి


తనకే స్పష్టంగా తెలీదు ఆయనకి. ఒకపక్క భారతీయుడు, మరొకపక్క పాశ్చాత్యుడు, ఆయన. ఇది నిజమయిన పరిస్థితో ఆయన వెయ్యదలుచుకున్న వేషమో తెలీదనుకోండి. అది వేరేసంగతి. ఒక ''పోస్'' అని నా అనుమానం రాజకీయ వాదులు ఈ రకం వేషాలు వేస్తూ ఉంటారు. అవి వేషాలని అవతలివాళ్లకి తెలియాలని వాళ్ల ఉద్దేశం. అప్పుడు అవతలి వాళ్లకి వాళ్లని గురించి ఏమనుకోవాలో తెలీదు కదా? నెహ్రూ తను ఒక సోషలిస్టు అనేవారు. అయితే, ఆయన సోషలిస్టులకి దూరంగా ఉండేవారు. తను ప్రజాస్వామ్యవాది అనేవారు ఆయన. కాని, కృష్ణమీనన్ లాంటి వాళతో స్నేహంగా ఉండేవారు. ప్రణాళికలు కిందనుంచి పయికి ఉండాలనేవారు; కేంద్రీకృతమయిన ప్రణాళికలనే తయారు చెయించేవారు.

నెహ్రూది సామ్రాజ్యవాదుల స్వభావం. ఆయన సోషలిజం ఫేబియన్ సోషలిస్టుల ''సరదా సోషలిజమ్''. నేను నెహ్రూని మొదటిసారిగా లండన్‌లో కలిశాను. నాలుగేళ్లపాటు ఆయనతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకున్నాము భారతదేశానికి రాగానే వెళ్లి ఆయనని చూశాను ఎందులో వెళ్లానో తెలుసా? ఒక ప్రభుత్వవాహనంలో! ఎక్కడికి? యూరోపులోని రాజభవనాలని మించిపోయిన తీన్‌మూర్తి భవన్‌లో. తీన్‌మూర్తిభవన్ నెహ్రూ నివాసం కాదు; ఆయన రాజభవనం, సభికులు ఎవరయ్యా అంటే కాంగ్రెసువాళ్లు. నేను ఎందరినో ప్రధానమంత్రులని వాళ ఆఫీసులలో, ఇళ్లలో చూశాను. ఉదాహరణకి బ్రిటిషు ప్రధాని క్లెమెంట్ అట్లీని లండన్‌లోని 10, డవునింగ్ స్ట్రీట్‌లో కలుసుకున్నాను. చూడటానికి ఒక స్కూలు టీచరు లాగ ఉన్నారాయన. ఆయన 'సాక్స్' కి కుట్లు వేసి వున్నాయి. ఆయన బూట్లు అరికాళ్లకి చిల్లులు వున్నాయి. (అవి యుద్ధం తర్వాత రోజులు కాబట్టి కొరతలు ఎన్నో వుండేవనుకోండి.) ఇక నెహ్రూ సంగతి? అప్పుడే సింహాసనం దిగిన చక్రవర్తిలాగ వున్నారు ముభావంగా, గర్వంగా మాట్లాడారు. ఆయనకి జనసామాన్యం చాలా దూరంగా ఉండేది. అటువంటి మనిషి సోషలిస్టు ఏమిటో నాకు ఎప్పుడూ అర్థం అయ్యేది కాదు. ఆయన సోషలిజానికి తగినట్లే భారతదేశంలో ధనవంతులు మరింత ధనవంతులయ్యారు చివరికి ఆయన పార్టీనే కొనేశారు. నేడు కాంగ్రెసు డబ్బున్నవాళ్ల పార్టీ. సంపన్నులకి కాంగ్రెసుని అమ్మినవారు నెహ్రూయే!

రాజభవనాలలో ఉంటూ సోషలిస్టుగా బతకవచ్చుననే అహంభావపు వైఖరి వల్లనే కాంగ్రెసు సంస్కృతి ఇలాగ తయారయింది. అతివైభోగంగా జీవించే వారికి తగిన 5–చుక్కల హోటళ్ల సంస్కృతి. శ్రీమతి గాంధీ ప్రభుత్వవిమానాలలో ప్రయాణాలు చేస్తారు తాము హెలికాప్టర్‌లో వెడతారు ప్రతిపక్షాలవారికి ఆ అవకాశం ఇవ్వరు. ఆమె ఎవరినయితే వోటులకోసం అడుగుతారో వాళ్లకి బస్ టిక్కెట్ కొనుక్కునేందుకు కూడా డబ్బు వుండదు. అంతూలే బీద వాళ్లని గురించి మాట్లాడుతారు. ఆయన

ఉండేది 5–నక్షత్రాల హోటల్‌లలో. వాటిని కట్టినవాళ్ళు నెహ్రూ స్నేహితులు "తాతా"లు. నెహ్రూ ఎప్పుడూ స్వేచ్ఛని గురించి మాట్లాడేవారు. హంగేరి స్వేచ్ఛ యొక్క శవాన్ని రష్యాకి అప్పచెప్పినది ఆయనే. రాజకీయాలలో దగాని పెద్ద ఎత్తున ప్రవేశపెట్టినది నెహ్రూయే. (కాంగ్రెసు సంస్కృతి ఇదేకదా ?) ఆయన అనుచరులూ, శ్రీమతి గాంధీ, అంతులేలూ, గుండురావులూ ఈ దగాని ఒక పద్ధతిగా మార్చేశారు. కాంగ్రెసు సంస్కృతి అంటే లక్ష్యాన్ని సాధించటంకోసం ఏదయినా చెయ్యటమే! దీనిని మొదలుపెట్టిన వారు నెహ్రూయే.

సాధనాలు లక్ష్యాలుగా మారిపోతూ ఉంటాయి. కాంగ్రెసు విషాదగాథని అర్థం చేసుకోవటానికి ఈ యదార్థాన్ని తెలుసుకోవాలి. రాజ్యం సమాజాన్ని బానిసగా మార్చేస్తుంది. పరిపాలనా యంత్రాంగం రాజ్యాన్ని కైవశం చేసుకుంటుంది. పార్లమెంటు ప్రజాస్వామ్యాన్ని అణిచివేస్తుంది. సంస్థలూ, వ్యవస్థలూ న్యాయాన్ని లొంగదీసుకుంటాయి. పార్టీ వాళ్ళు ఉద్యమాన్ని చేజిక్కించుకుంటారు. పనివారి నిరంకుశ పరిపాలనా సోషలిజాన్ని కైవశం చేసుకుంటుంది. రాజకీయాలలో సాధనాలని ఎన్నుకుని వాటిని అదుపులో ఉంచుకొనటం ముఖ్యం. లక్ష్యాలు ఎంత ముఖ్యమో సాధనాలూ అంత ముఖ్యమే. చివరికి సాధనాలే లక్ష్యాలుగా మారిపోతాయి కొందరి చేతులలో. కార్యసాధనకోసం ఏమిచేసినా ఫరవాలేదనటం కాంగ్రెసు సంస్కృతిలో ఒక భాగమే. ఇది అవినీతికరమయిందేకాదు తెలివితక్కువతనాన్ని తెలిపేదే కూడా. అబద్ధం అబద్ధమే, హత్య హత్యే. వైస్‌రాయిలు వాడిన రాజభవనాలలో కూర్చుని సోషలిజాన్ని ఎలాగు తీసుకురాలేమో అలాగే హెలికాప్టర్‌లలో ఎక్కి తిరుగుతూ వోట్లు తీసుకురాలేము. నెహ్రూ ఒక భారతీయ వైస్‌రాయిగా ఉండటానికి ప్రయత్నించి విఫలుడయ్యారు. తమ తండ్రి తలపెట్టిన పనులు పూర్తిచెయ్యటమే తమ ధ్యేయం అని శ్రీమతి గాంధీ అంటారు. ఆవిడ కూడా విఫలులవుతారు. ఎందుకంటే, భారత దేశానికి వైస్‌రాయిలు అనవసరం – వారి రంగు ఏదయినప్పటికీ. ★





ఆ ఉత్తరం చదివిన విశ్వనాథంగారికి ఊసర క్షేత్రంలో బంగారు పంట పండినట్టయింది. ఆయన కళ్ళు ఆనందంతో మిలమిల మెరిసాయి. కాంతి నిండిన ఆ కళ్ళల్లో వర్షభాష్పాలు మొలిచాయి.

ఆ విషయం తన భార్య పార్వతమ్మకు ఎంత త్వరగా చెప్పుదామా అనిపించింది.

అదే సమయంలో పార్వతమ్మ గుడి నుంచి వచ్చింది.

''పార్వతీ! ఈ రోజు ఎంత శుభకరమైన దినమో తెలుసా! ఇన్నాళ్ళుగా మనం ఎదురు చూసినదీ, ఆశించినదీ, దేవుడు మనల్ని కరుణించినదీ యివాళే జరిగింది'' ఆతృతతో అసలు విషయం చెప్పకుండా గుమ్మంలోనే నిలబెట్టేసిన భర్తవంక, అతని చేతిలో చివురుటాకులా వణుకుతున్న ఉత్తరాన్ని ఎగాదిగా చూసి– ''ఇంతకీ ఏమిటైందిట?'' అంది పార్వతమ్మ.

''మన సుజాతకు సంబంధం కుదిరింది. త్వరలో ముహూర్తాలు పెట్టించమని వ్రాసారు. నిజానికి ఎంత సంతోషంగా ఉందో తెలుసా?'' అంటూ ఆనంద ప్రవాహంలో కొట్టుకుపోయారు విశ్వనాథంగారు.

''పోన్లెండి! భగవంతుడు ఇన్నాళ్ళకైనా మనమీద కరుణ చూపించాడు. జీవితంలో మనకి తీరవలసిన అడ్డంకులు, బాధ్యతలు, బరువులు ఈ పెళ్ళితో తీరిపోయినట్లే!'' అంది గతంలో తాము అనుభవించిన కష్టాల పరంపరలను తలచుకుంటూ.

''కాని నేను ఆ రోజు... అదే సుజాత పెళ్ళి చూపులరోజు ఎంత కంగారుపడ్డానో తెలుసా! రంగాచారిగారు లాంఛనాల విషయంలో ఏదో నసుగుడు మొదలెడితే నాకు అనుమానం వేసింది.'' అన్నాడు ముఖాన పట్టిన చెమటలు తుడుచుకుంటూ!!

ఒక్కసారి పెళ్ళిచూపులరోజు తలపు కొచ్చింది పార్వతమ్మకు.

ఆ రోజు సుజాతను కుందనపు బొమ్మలా తయారుచేసి సశాస్త్రీయంగా పెళ్ళిచూపులు జరిపించారు. ఇరుపక్షాలవారు మాట్లాడుకున్నారు.

కానీ ఏ విషయం సరిగ్గా తేల్చకపోవడం– అబ్బాయి రాజేంద్ర ముఖంలో సంతోషఛాయలు ఏ మాత్రం కనిపించక పోవడం చూసే సరికి తను, తన భర్త ఎంత యిద్దైపోయారో!!

ఉత్తరం వ్రాస్తామని చెప్పి నిర్లిప్తంగా వెళ్లిపోతే ఎంత బెదిరిపోయారో !!

తలుచుకుంటే ఒక్కసారి ఒళ్ళు జలదరించింది ఆమెకు.

"ఇంతకీ సుజాత ఏదీ ? దాని చెవిన కూడా ఈ శుభవార్త వెయ్యొద్దూ !" అని అంటూండగానే బైటనుంచి శంకరం, సుజాత వచ్చారు...

"ఎక్కడకు పోయార్రా! యిందాకట్నించి మీగురించి కళ్లు కాయలుకాచేలా ఎదురు చూస్తున్నాం" అంది పార్వతమ్మ బిడ్డల వంక ఆప్యాయంగా చూస్తూ.

"నీ వంటింటి బిడ్డల్ని ఏదొంగా ఎత్తుకు పోలేదు కాని అసలు విషయం ఏమిటో చెప్పమ్మా! కంగారు పడక" అని జవాబిచ్చి సోఫాలో చతికిల పడ్డాడు శంకరం.

సుజాత కూడా ఏదో మేగజైన్ చూడటంలో నిమగ్నమైపోయింది. "అమ్మా ! నువ్వు పెళ్లకూతురివి కాబోతున్నావమ్మా !" అంది పార్వతమ్మ.

సిగ్గుల మొగ్గైంది సుజాత. బుగ్గలు క్షణంలో ఎరుపెక్కాయి.

"ఒరే మొద్దూ ! విన్నావా! ... నీచెల్లిని వరించడానికి ఒక మగధీరుడు దొరికాడోయ్ ! ఇదిగో ఉత్తరం చదువు!" అంటూ శంకరం చెవిని సుతారంగా మెలివేసి చెప్పింది పార్వతమ్మ !

ఉత్తరం చదివి ఏమాత్రం సంతోషం కనపరచని కొడుకు వంక చూసిన పార్వతమ్మ, విశ్వనాధంగారల మనసులు క్షణంసేపు ఆందోళనతో నిండిపోయాయి.

"ఏం రా ! అలాగైపోయావు, ఏం ఆ అబ్బాయిని నీకు తెలుసా ? వ్యసన పరుడా?" వ్యధ, కంగారు... ఆతృత మొదలైనవన్నీ చోటు చేసుకున్నాయి ఆయన కంఠంలో !

"అది కాదు నాన్నా! మనసుజాత విషయం వాళ్ళకు తెలుసా ? తనలోని లోపాన్ని గుర్తించి మనస్ఫూర్తిగానే పెళ్ళికి ఒప్పుకున్నారా ! చెప్పండి. " —శంకరం పెద్ద మనిషిలా విలదీసి అడుగుతూంటే బొమ్మల్లా నిరుత్తరులైపోయారు.

"బాబూ ! ఎందుకదంతా !" అంది పార్వతమ్మ విసుగ్గా !

"కాదు మనలో ఓ లోపం ఉన్నప్పుడు దాన్ని ఎదుటి వాళ్లకు తెలియపరచకుండా వాళ్ల భవిష్యత్తుని బలి చేయడం మంచిది కాదు. అది ఘోరంకూడాను. అందు కే వాళ్లతో ఆ విషయం చెప్పడం మంచిది. లేకపోతే ఏనాటికైనా అది బయటపడుతుంది" అన్నాడు తీవ్రంగా శంకరం.

"ఏమిట్రా! నువ్వంటున్నది... నీకేమైనా పిచ్చిపట్టిందా! మన సుజాతను చూస్తే ఏ అవలక్షణాలు లేవే ! యింతకీ లోపం ఏమిటో మాకు అర్థం కావటంలేదు !" అన్నారు విశ్వనాధంగారు కొంచెం కటువుగా.

అలా అన్నప్పుడు ఆయన భృకుటి ముడి పడింది.

"నాన్నా ! చిన్నతనంలోనే ఆ సంగతి నిలిచిపోయింది నాలో... అటువంటిది మీకు గుర్తులేదా ! ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకోండి" అన్నాడు శంకరం.

వెంటనే కరిగిన గతం కళ్లముందు నిలిచింది ఆ దంపతులకు,

* * *

ప్రయాణ సౌకర్యాలు అంతగాలేని రోజులవి. రామ తీర్థం నుంచి విజయనగరం సినిమాల కెళ్ళాలంటే మైసూరెడ్లబండి పూయించుకునివాలుగైదు కుటుంబాల వాళ్లు బయలుదేరే వారు...

సుజాత వ్యక్తురాలైన క్రొత్తలో ఒకసారి విశ్వనాధంగారితో సహా మొత్తం నాలుగు కుటుంబాల వాళ్ళు సినిమా ట్రిప్ వేసారు. అది వానాకాలం కావటం వలన నెల్లిమర్ల చంపావతీ యేరు వస్తోంది... విశ్వనాధం గారు యేటిలోంచి బండిని నడిపే సాహసం చెయ్యొద్దని చెప్తున్నా వినకుండా బండివాడు దింపాడు. బండి కుదుపులతో వెళ్తూంటే ఒడ్డునున్న సుజాత క్రిందకు తూలి పడిపోయింది. నీళ్లు మింగేసింది. అందరూ గోలగోల పెట్టేసారు. బండివాడు ఒక్క ఉదుటన యేటిలోకి దిగి సుజాతను ఒడ్డుకు చేర్చి కడుపును, గుండెలను గట్టిగా నొక్కి నీళ్లు క్రక్కించాడు.

మొత్తానికి సుజాత బ్రతికింది.

కాని ఆరోజు మొదలు తరచు కడుపు నొప్పి రాసాగింది సుజాతకు. విశ్వనాధంగారు డాక్టరికి చూపిస్తే పిడుగులాంటి వార్త చెప్పాడు. "ఈ అమ్మాయి గర్భకోశం బద్దలైంది... అందువలన పెళ్లైనా పిల్లలు పుట్టే అవకాశం లేదు. ఆపరేషన్‌ల వల్ల సాధ్యం కాదది."

ఆ షాక్ నుంచి చానాళ్లవరకూ తేరుకోలేకపోయారు అంతా !

* * *

గతం నుంచి తేరుకుని కొడుకు వంక నిర్లిప్తంగా చూసారు విశ్వనాధంగారు.

"ఏం నాన్నా ! మాట్లాడవేం ! ఒకరికి అన్యాయం చేయటం మంచిదా ? చెప్పండి ! చెల్లాయికి పెళ్లికావటం నాకు యిష్టమే ! కాని నాలోని ఆదర్శం నా చేత యిలా మాట్లాడిస్తోంది" అన్నాడు శంకరం.

"ఆఁ చెప్పొచ్చావురా ! బోడి ఆదర్శాలు... మనం యిన్నాళ్లు దానికి సంబంధాలు వెతికినా దొరకలేదు... పోనీ ఏదో ఇన్నాళ్లకు సంబంధం నిశ్చయమైందనుకుంటే నువ్విలా అడ్డుపుల్లలు వేస్తున్నావు ? నీకన్నా వయసులోనూ, అనుభవంలోనూ చాలా పెద్దవాళ్లం మేం. నువ్వు మాకు నీతులు చెప్పనక్కర్లేదు. వంద అబద్ధాలైనా చెప్పి పెళ్లిచెయ్యమన్నారు పూర్వీకులు... మరేం మాట్లాడకు... ... కుక్కిన పేనులా నోరు మూసుకుని పడుండు..." గట్టిగా హుంకరించారు ఆయన.

"ఔన్రా ! మన సుజాత ఎంత అందంగా ఉంటుంది... ఎవరికీ తెలియని లోపం దానిది. అటువంటప్పుడు మనమే కోరి కొరివితో తల గోక్కుంటామా ! చెప్పు !" సమాధాన పరుస్తూ అంది పార్వతమ్మ.

తల్లిదండ్రుల మాటల్లో కొంత వాస్తవం గోచరించినా శంకరంలోని అభ్యుదయ భావాలు అందుకు అంగీకరించలేదు. అందుకే ఏమీ మాటాడకుండా వీధిలోకి వెళ్లిపోయాడు శంకరం. 'హమ్మయ్య' అని బరువుగా నిట్టూర్చి ముహూర్తం పెట్టించడానికి వీధిలోకి వెళ్లిపోయారు విశ్వనాధంగారు.


* * *

విజయ కేతనం

హలం —
మనిషి జీవనానికి ప్రధానం;
కలం —
జాతి మనుగడకు ఆయుధం;
బలం —
సమస్త దేశానికే సౌభాగ్యం....

— బండి లక్ష్మీనరసింహారెడ్డి





లోపం

పెళ్ళి రోజు...!!

విశ్వనాథంగారిల్లు బంధుమిత్రులతో కోలాహలంగా – సందడిగా, పట్టుచీరల రెపరెపలతో, పసందైన బాజా భజంత్రీలతో నిండుగా కళకళలాడుతోంది.

ఓ వైపు మునుసిగ్గుల తెమ్మెరల్లా వధూవరుల ముఖాలు చూడ ముచ్చటగా ఉన్నాయి.

శంకరం పెళ్ళి వారికి కావలసినవాట్ని అందిస్తూ అటూ యిటూ హడావుడిగా తిరుగుతున్నాడు ప్రతివారినీ పలకరిస్తున్నాడు.

అదే సందర్భంలో శంకరం ఒక అమ్మాయిని చూడటం తటస్థించింది. విలువైన వజ్రాల్లా మెరిసే కళ్ళు, బాదంపళ్ల లాంటి పెదాలు, ఎవరినైనా యిట్టే ఆకర్షించే తీరైన ముఖం కోటేరు ముక్కుతో అప్సరసలా ఉంది...

ఆ అమ్మాయి శంకరం హృదయకేన్వాసుపై ముద్రించుకు పోయింది.

ఇంతలో కూల్ డ్రింకులు పంపవలసిందని చెప్పగా శంకరం అందరికీ యిచ్చాడు. అలా యిస్తున్నప్పుడు కూడా శంకరందృష్టి ఆమెపైనే ఉంది కూల్ డ్రింకు యిస్తూ ఆమెను చూసి నవ్వి– "మీ పేరేమిటి ?" అని అడిగాడు నవ్వేసి ఊరుకుంది.

దాన్ని గ్రీన్ సిగ్నల్‌గా భావించి యింకా ఆరాధించటం మొదలెట్టాడు అదే సమయంలో పెళ్ళిపందిరిలో వేణు అనే పాత మిత్రుడు కలిసాడు శంకరానికి.

"ఏరా శంకూ! వీడెలా ఊడిపడ్డాడు అని ఆశ్చర్యపోతున్నావు కదూ! నువ్వు ఇన్వైట్ చేయకపోయినా- పెళ్ళికొడుకు కూడా నాకు స్నేహితుడేన్లే!" అంటూ వెడ్డింగు పంపనందుకు కోపగించుకున్నాడు వేణు.

"అయినా నీ అడ్రసు నాకు తెలిసేడిసిందేమిటి! తెలిస్తే పెండ్లికి పిలవనంతటి మూర్ఖుడిని కానురోయ్." అంటూ చిలిపిగా డొక్కలో పొడిచాడు శంకరం.

ఎన్నో విషయాలు వాళ్ళ మధ్య దొర్లాయి.

ఆ సమయంలోనే తను ఆరాధిస్తున్న అమ్మాయిని చూపించి– ఆమె వివరాలు అడిగాడు శంకరం.

"ఆ అమ్మాయి పేరు అరుణ. బి.ఏ చదివింది పెళ్ళికొడుకు దగ్గర చుట్టాలే! నా కంతకన్నా వివరంగా తెలీదు అన్నట్టు

(61వ పేజీ చూడండి)

వారఫలం

18–2–1983 శుక్రవారం మొదలు
24–2–1983 గురువారం వరకు

♈ **మేషం:** ధన లోపం లేని వారమే. పాత అప్పులు వసూలు కావటానికి అవకాశం ఉన్నది. వ్యాపారం, వ్యవహారం, కళా రంగ ఖ్యాతికి అవకాశమున్నది. అధికారం చెలాయించటంలో లోపం జరిగితే సంస్థ కార్యాలు కుంటు పడుతాయి. స్త్రీలకు: సర్వ విధ శ్రేయో దాయకం.

♉ **వృషభం:** అన్ని విధాలా ప్రగతి గలవారం. 'మూడు పూవులు ఆరు కాయలుగా' గృహ వ్యవహారాలు విస్తరిస్తాయి. గృహ సంబంధంగా అభివృద్ధి కార్య క్రమం కొనసాగుతుంది, గమనించండి. స్త్రీలకు: కళారంగ ఖ్యాతికి, పత్రికా మూలాన పేరు ప్రఖ్యాతులు రాగల వారమే.

♊ **మిధునం:** 'రాజకీయంగా మేలు సాధించాము గదా' అని సంతోషిస్తారు. అవకాశ వాదులను, ఆశ్రితులను దూరంగా ఉంచండి. మేలైన వస్తువులు సేకరించుకో గలుగుతారు. స్త్రీలకు: ప్రతిభ గాణింపు, సంఘంలో గుర్తింపు కనిపిస్తుంది.

♋ **కర్కాటకం:** అధికారుల మూలంగా లాభిస్తుంది. ఈ విషయం గ్రహించి మెలగండి. సుఖ శాంతులకు లోపంలేదు. కొన్ని విషయాలలో అప్రమత్తతతో మెలగాలి. గృహ సంబంధమైన వ్యవహారాలు పరిష్కరింప బడుతాయి. స్త్రీలకు: సభా గౌరవం, పత్రికా గౌరవానికి అవకాశమున్నది.

♌ **సింహం:** చాల దినాలుగా జరుగని పనులు సుకరంగా నెరవేర గలవు. ధన విషయంలో మీకు సర్వానుకూలత చేకూర గలదు. శత్రు వర్గీయులు విజృంభిస్తారేమో జాగ్రత్త పడండి. స్త్రీలకు: ఉద్యోగం కోసం ప్రయత్నించే వారికి అనుకూలం గ్రహించండి. నూతన వ్యవహారాలు తెలిసికో గలుగుతారు.

♍ **కన్య:** ద్రవ్యాదాయమున్నది, అధిక వ్యయమున్నది. కుటుంబ చిక్కులు అధికంగా ఉండగలవు. సులభంగా ఒకానొక వ్యవహారం నెరవేరటమే గాక, మీకే అనుకూలం. స్త్రీలకు: నూతన వ్యవహారాలు తెలిసి కోవటం, ఉత్తరాల మూలంగా కొన్ని విషయాలలో జోక్యం కూడా కలిగే అవకాశం ఉన్నది.

♎ **తుల:** అవకాశ వాదులు వెంట బడుతారు. అపకారులున్నారు, జాగ్రత్త. నూతన వ్యవహారాలు తెలిసికొనే అవకాశమున్నది. సులభంగా ఒకానొక విషయంలో మేలు చేకూరుతుంది. స్త్రీలకు: ముఖ్య రంగాలలో, వృత్తిలో, ఉద్యోగంలో మేలుంటుంది.

♏ **వృశ్చికం:** చాల కాలంగా జరుగని వ్యవహారం, లాభ దాయకంగా ఈవారం నెరవేరనున్నది. పత్రికా రంగంలో, సభా రంగంలో మీకు మేలు చేకూరుతుంది. రాజకీయ రంగంలో తృప్తి కనిపిస్తుంది. స్త్రీలకు: క్రమాభి వృద్ధి అన్ని రంగాలలో చెప్పదగిన వారం.

♐ **ధనుస్సు:** 'వారం వారు, యిలాగే ఉంది' అని అనుకోకండి, మీ రాశికి క్రమాభి వృద్ధి చేకూరుతుంది. ధన లబ్ధికి అవకాశమున్నది. నూతన వ్యక్తుల సాంగత్యానికి అవకాశం గల వారం. స్త్రీలకు: ఉద్యోగావకాశాలు కొందరకు శుభం జరిగే అవకాశం ఉన్నది.

♑ **మకరం:** రాజకీయంగా మీరు చేసిన ప్రయత్నాలు ఫలవంతం కాగలవు. చాలమందికి సభా గౌరవం, కొందరకు పత్రికా గౌరవానికీ అవకాశమున్నది. గృహ విస్తరణ కార్య క్రమానికి అవకాశముంటుంది. స్త్రీలకు: నూతన వ్యవహారాలకు, ధన సంపాదనకు మేలైన వారం.

♒ **కుంభం:** సులభంగా ఒకానొక వ్యవహారం, బహుశా రాజకీయ సంబంధమైనది, మీకు అనుకూలంగా, నెరవేర గలదు. విలువగల వస్త్రములు సేకరించుకో గలుగుతారు. అధికారుల ఆదరణకు, అప్రయత్న ధన లబ్ధికి అవకాశమున్నది. స్త్రీలకు: నూతన వ్యవహారానుకూలత, వృత్తిలో ప్రగతి గలవారంగా గ్రహించాలి.


♓ **మీనం:** చేతికి చిక్కిన అవకాశాలను సద్వినియోగం చేసికోండి, ధనా భావాన్ని గూర్చి చింతించకండి. మీరు రాజకీయంగా, సాంఘికంగా పెరగటం నిశ్చయం. స్త్రీలకు: అన్ని రంగాలలో, లాభదాయకంగా మేలు చేకూర గలవారం. గ్రహించండి.

— విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి ★

వ్యక్తిగతం




శ్రీ. శే. సంజయ్ గాంధీ సతీమణిని ఈనాటి ఆంధ్ర ప్రదేశ్ (తెలుగు నాడుగా పేరు మారేదాకా) ముఖ్య మంత్రి '**ఆపదలో ఉన్న ఆడకూతురు**' గా వర్ణించారు. ఆమె ఆపదలోకన్నా రాజకీయాలకి సంబంధించిన ప్రచారం లోనే ఎక్కువగా ఉన్నట్లు తోస్తుంది.



ఆమెని నిందిస్తూ శ్రీ మహమ్మద్ యూనస్ (శ్రీమతి గాంధీ అనుచరులలో ఒకరుగా పేరు పొందిన వారూ, ఇండియన్ ఫారిన్ సర్వీస్‌లో ఉన్న వారూ, ప్రస్తుతం డయిరెక్టర్ ఆఫ్ ట్రేడ్ ఫెయిర్స్‌గా ఉన్నవారూ) 'నేషనల్ హెరాల్డ్' దినపత్రికలో ఒక వ్యాసం రాశారు. ఈ పత్రికని పండిత జవహర్‌లాల్ నెహ్రూ స్థాపించారు.

రాజీవ్ గాంధీ, సంజయ్‌గాంధీల కీర్తికి అప్రతిష్ట తెచ్చే ఉద్దేశంతో కొందరు కొన్ని లేఖలని పునర్ముద్రించి పంచుతున్నారుట.

ఇదంతా శ్రీమతి ఇందిరాగాంధీ, శ్రీమతి మేనకాగాంధీల ప్రతినిధులు నడిపే ప్రచ్ఛన్న యుద్ధంగా పరిగణింప బడుతోంది ...




ఎన్నికలకి ముందు తమ మామగారిని ఎదిరించిన మాజీ మంత్రి శ్రీ చంద్ర బాబు నాయుడు ఇప్పుడు తమ అనుచరులతో సహా తెలుగు దేశం పార్టీలో చేరి[illegible]రు...

సీరియల్

జీవిత సమరం

యర్రగుంట్ల వరలక్ష్మీదేవి



(గత సంచిక తరువాయి)

ఆ రాత్రి నీరజ ఏవేవో కలలతో నిద్రపోయింది.

ఆ చూపుల రోజు రానేవచ్చింది. రెండో పెండ్లి వాడు అన్న దిగులు నీరజకు పోలేదు. పక్కింటి పిన్నిగారు నీరజను ముస్తాబుచేసి సావిడిలో ఖర్జూరం చాప మీద కూర్చోపెట్టేరు. అబ్బాయికి, అబ్బాయి తల్లికి, పెండ్లి చూపులు ఏర్పాటు చేసిన ఆ బావ గార్కి పక్కింటి నుండి కుర్చీలు రెండు తెప్పించి, ఇంట్లో ఉన్న ఒక్క కుర్చీని బాగా తుడిచివేసేరు.

పెండ్లికొడుకుని చూడగానే నీరజ సంశయా నన్ని పటాపంచలయేయి. పెండ్లికొడుకు మోహనరావు మోహనంగా ఉన్నాడు. చూడడానికి ముప్ఫైయేళ్ళ లోపు వాడిలానే ఉన్నాడు. అబ్బాయి ఆడిన నాలుగు మాటలు చాల సౌమ్యంగా ఉన్నాయి. ముఖంలో మంచి తనం గోచరిస్తూంది.

పెండ్లికొడుకు తల్లి చెప్పుకుపోతోంది.

"అబ్బాయి ఇంటి దగ్గర పుస్తకాలు తెప్పించుకుని చదువుతున్నాడు ఎమ్. కాం పరీక్షకు కట్టడానికి. చదువంటే ఎంతో శ్రద్ధ. బాంకులో క్యాషియర్ చేస్తున్నాడు. నెలకు ఎనిమిది వందలు జీతమిస్తారు. ఓవర్ టైము కూడా రెండు వందల వరకు వస్తుంది. బాంక్ ఆఫీసరు పరీక్షలకు కడుతున్నాడు. తెలివితేటలు లేకకాదు — అదృష్టం కలసివస్తే వచ్చేఏటికి బ్యాంకు మేనేజరు అవకపోడు. మా కోరికలు ఏమీ మీరు తీర్చలేనివి కావు. అన్నిటి కంటే ముఖ్యం మా అబ్బాయికి, మీ అమ్మాయి నచ్చడమే. మిగతా మాటలు అంత లెక్కలోనివి కావు."

ఆ తల్లి మాట్లాడుతున్నంతసేపు ఆ పెండ్లి కొడుకు చిరునవ్వుతో అలా కూర్చున్నాడు, మధ్య మధ్యన నీరజను పరీక్షగా చూస్తూ.

ఫలహారాలు తెప్పించి పురుషోత్తం టేబులుమీద పెట్టి పెండ్లివారిని తీసుకోమని కోరేడు.

"అన్నగారు! వద్దండి మేము తినకూడదు. కతుకితే ఆతకదు. అమ్మాయి నాకెంతో నచ్చింది. ఈ సంబంధం కుదరాలనే నా కోరిక. అందుకే ఏమీ తీసుకోము."

"పోనీ కాఫీయేనా తీసుకోండి. కాఫీకి ఫరవాలేదు," సంబంధం తెచ్చిన ఆ పెద్దమనిషి ఫలహారం తింటూ శలవిచ్చేడు.

కాఫీలు త్రాగేక, అబ్బాయి ఉద్దేశం కనుక్కుని ఇంటికి చేరేక మీకు ఉత్తరం వ్రాస్తాము, అని చెప్పి ఆ తల్లి, కొడుకు వెళ్ళిపోయేరు.

వారంరోజుల తరువాత పెండ్లివారి వద్దనుండి ఉత్తరం వచ్చింది. ఈలోగా నీరజ రెండుసార్లు అమ్మవారి గుడికివెళ్ళి దండం పెట్టుకొని, అమ్మవారి పాదల వద్ద ఉన్న కుంకం బొట్టు పెట్టుకుని వచ్చింది. ఆ తల్లిని వేడుకుంది ఆ మోహనరావునే తనకు భర్తగా చేయమని.

నీరజ కోరిక ఫలించింది. పెండ్లికొడుకు నీరజను ఆమోదించేడు. పదివేల కట్నంకు, రెండు వేలు లాంఛనాలకు ఒప్పుకుంటే ముహూర్తం పెట్టించవచ్చని ఆ తల్లి సుబ్బాయమ్మ వ్రాసింది దాంతో తండ్రి, కూతురు నిరాశతో కృంగిపోయేరు. ఆ మధ్యవర్తి కామేశంగార్కి ఉత్తరం వ్రాసి రప్పించేరు.

"బావగారు! ఇదెక్కడి న్యాయం చెప్పండి. అమ్మాయి నచ్చుతేచాలు అన్న ఆ సుబ్బాయమ్మగారు ఇలా మా తలకు మించిన కోరికలు కోరడం యేం సబబు చెప్పండి? నేను చేసింది ఎలిమెంటరీ స్కూలు మేస్టరీ. ఆస్తి బొత్తిగాలేదు. ఉన్నదల్లా ఈ చిన్న పెంకుటిల్లే నేను తల దాచుకుందికి. నా తదనంతరం నేను నా కొడుక్కి మిగిల్చిపోయేది, నా తండ్రి నాకిచ్చిన ఈ చిన్న కొంపేగ ఉంది. మరి నా దగ్గరున్నది మొత్తం ఆరువేలరూపాయులు మాత్రమే. మీరే ఏదైన మార్గం చూడాలి."

ఆ బావగారు మరో ఇరవై ఒద్దంటూనే పుచ్చుకుని త్వరగా ఏనాంకు బస్సులో బయలు దేరేడు. ఆ మరునాటికి తిరిగివచ్చేడు.

"పురుషోత్తం! అన్నీ వివరంగ పెండ్లివారితో మాట్లాడానోయి. మన స్థితిగతులు వాళ్ళకు చెప్పేను. వాళ్ళకి అమ్మాయి బాగా నచ్చింది కనక ఈ సంబంధం వదులుకుందికి వాళ్ళకు ఇష్టంలేదు. అందుకే ఆఖరి మాటగ ఇలా చెప్పేరు— లాంఛనాలు రెండువేల రూపాయులు వదులుకుంటారట. కట్నం పదివేల నుండి తొమ్మిదివేలకు మాత్రం దిగరట. అంతకు తక్కువ కట్నమైతే మరి కబురుపెట్ట నవుసరం లేదట. మరి ఆలోచించుకో.."

"బావగారు! ఏమని చెప్పగలను చెప్పండి. నా దగ్గరున్న నగదు ఆరువేలు మాత్రమే. ఈ ఇంటిని నా కొడుక్కి మిగిల్చిపోదామనుకుంటున్నాను. మరి మిగత డబ్బు ఎక్కడ నుండి తేగలను చెప్పండి?"

"పురుషోత్తం! తొందరెపడి ఏ నిర్ణయం తీసుకోకు. అమ్మాయితోను, అబ్బాయితోను ఈ విషయం చర్చించి నాకు వ్రాయి. మరి వెళ్ళొస్తా. ఒక్కటి మాత్రం మరచిపోకు. ఈ సంబంధం చాల మంచిది. బ్యాంకులో కాషియర్ ఉద్యోగమంటే అంత చిన్నదేమి కాదు. అబ్బాయి రూపం చూసేవు కదా ఇక ఆలోచించుకో."

పురుషోత్తం కూతుర్ని అడిగేడు ఏం చెయ్యడమని.

"నేనేమి చెప్పగలను చెప్పండి నాన్నా. పెద్ద వారు మీరే అన్నీ ఆలోచించుకోండి. మీరే నిర్ణయం తీసుకున్నా నాకు సమ్మతమే. మనకు స్థోమత లేనందుకు అంత కట్నంకు పీనం తూగలేము గనుక ఈ సంబంధం వదులుకున్నా నేనేమి బాధపడను," మనస్సులో కాస్త బాధగానే ఉన్నా ధైర్యంగ నీరజ తండ్రికి చెప్పగలిగింది.

పురుషోత్తం కాసేపు ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చేడు.

"చూడమ్మా— ఈ సంబంధం కావాలంటే ఈ ఇంటిమీద కట్నం సర్దుబాటుకు మూడు వేలు, పెండ్లి ఖర్చుకు మరో నాలుగువేలు అంటే మొత్తం ఏడువేలు అప్పుచేయాలి."

"అప్పుచేస్తే తీర్చేదెట్లా నాన్నా? మీరేమో రిటైరయిపోయేరు. ఆఖరికి వడ్డీ పెరిగి ఈ ఇంటినే తినేస్తుంది అప్పు."

"అందుకే ఓ నిర్ణయానికి వచ్చేను. నీ అన్నకు వ్రాస్తాను. వాడు అప్పును నెలనెలా డబ్బుపంపి అప్పు తీరుస్తానంటే అప్పుచేసి నీ పెండ్లి జరిపిస్తాను. వాడు వద్దంటే మానేస్తాను."

"సరే మీ యిష్టం."

పురుషోత్తం ఆ విధంగా అన్ని విషయాలు వివరించి కొడుక్కు వ్రాసేడు. పదిరోజుల తరువాత కొడుకువద్దనుండి జవాబు వచ్చింది. ఇంటిమీద అప్పుతెచ్చి చెల్లెలు నీరజకు పెండ్లి చేయమని, ఆ సంబంధం వదులుకోవద్దని, ముహూర్తం పెట్టి ముందుగ తనకు తెలియజేస్తే పెండ్లికి తప్పక వస్తానని.

నిరజ హృదయం ఆనందంతో ఉప్పొంగింది.

3

పెండ్లికి నాల్గు రోజుల ముందుగానే పురుషోత్తం కొడుకు గోపాల్, కోడల్ని, చంటివాడ్ని తీసుకునివచ్చేడు. రెండు రోజులయేసర్కి కోడలు వరుస పురుషోత్తంకి నచ్చలేదు. అసలు ఆ వివాహం తన చేతులమీద జరుగలేదు. కొడుకు మిలటరీలో

జరిగిన కథ—1: నీరజ తండ్రి పురుషోత్తం. తల్లి పాము కాటుకు గురై మరణిస్తుంది. నీరజ ఇంటర్ వరకు చదివి ఆపైన స్తోమత లేక ఆపేసింది. వున్న ఒక్క అన్నా మిలటరీలో చేరిపోతాడు. తండ్రి చేస్తున్న స్కూలు టీచరు ఉద్యోగంలోంచి రిటైరవుతాడు. నీరజకు వచ్చిన సంబంధాల్లో తండ్రికి నచ్చక కొన్ని జాతకాలు కలవక ఒకటే తప్పిపోతాయి. చివరకి దూరపు బంధువొకాయన సహాయంతో ఓ రెండో పెళ్లి వాడితో నీరజ పెళ్లి చేయటానికి నిశ్చయించు కొంటాడు ఆమె తండ్రి.

రాంచిలో ఉన్నప్పుడే రైఫిల్‌మన్ రామయ్య ఇంటికి తరచు వెళ్తూ అతడి కూతురు లక్ష్మితో ప్రేమాయణం జరిపి, ఆఖరికి ఆ వ్యవహారం కొంప మునిగినంతవరకు వచ్చేసరికి రామయ్య రైఫిల్ ఎత్తేసరికి గోపాల్ తలవంచుకుని గుడిలో లక్ష్మి మెడలో పుస్తె కట్టేసేడు. ఆ ప్రేమకానుకే ఆ చంటివాడు. పెండ్లి అయేక తండ్రికి ఆశీర్వదించమని ఉత్తరం వ్రాసేడు. పురుషోత్తం మనస్సులో కించపడిన పరిస్థితికి అనుకూలంగ సర్దుకుని ఉత్తరం ద్వారా కొడుకుని కోడల్ని ఆశీర్వదించేడు. ఇప్పుడు ఆ చంటివాడికి రెండు సంవత్సరాల వయస్సు దాటింది. ఈనాటికి ఈ శుభ సందర్భాన మళ్ళీ వెదురుపాడుకు గోపాల్, సతీపుత్ర సమేతంగ వచ్చేడు.

లక్ష్మిది అదో రకమైన స్వభావం. మొదటి నుంచి ఆమెదే పైచేయి. గోపాల్ వంత పాడవలసిందే ఆమె మాటకు. నీరజ వదిన సఖ్యత కోసం ఎంతో ప్రయత్నం చేసేది, గాని లక్ష్మి అంటీ అంటనట్టుగ ప్రవర్తించేది. దాంతో నీరజ మనస్సు వెల్తిగ అయిపోయేది. తల్లి లేని నీరజ తోటి స్త్రీ ప్రేమకు ఆరాటపడేది. ఆ నాల్గు రోజులలోనే నీరజకు తెల్సిపోయింది వదిన లక్ష్మి తనకు తల్లి కాలేదని, కనీసం స్నేహితురాలుకూడ అవదని. లక్ష్మి స్వార్థపరురాలు. ఆమెకు గోపాల్ తనకు చెందవల్సిన ఇంటిని చెల్లెలి వివాహం కోసం తనఖాపెట్టి అప్పు తేవడం సుతరాము ఇష్టంలేదు. ఈ యేర్పాటు తనకు చెప్పకుండ గోపాల్ చేసాడని వెదురుపాడు వచ్చింతరువాత లక్ష్మికి తెల్సింది. ఆసరికే డబ్బు తేవడం జరిగిపోయింది. అప్పుడు చేసేదేమిలేక తన అయిష్టతను తన ప్రవర్తనలో చూపేది. పురుషోత్తం ఆమె సంగతిని గ్రహించి బాధపడ్డాడు. ఇంతకీ కూతురు పెండ్లి అయిపోయి అత్తవారింటికి పోతే తనకు మిగిలిన బాధలేమి ఉండవు.

పెండ్లిలో నీరజ అత్తగారు చాల సౌమ్యంగ ప్రవర్తించింది. దేనికి గొడవ చేయలేదు. ఇక్కడ ఇవి పెట్టేరు, అక్కడ అవి పెట్టలేదు అని ఏ తంతు లేవదీయలేదు. పెండ్లికొడుకు మోహనరావు అంతే. పురోహితుడు కూర్చోమంటే కూర్చునేవాడు లేవమంటే లేచేవాడు. అన్నిటికి చిరునవ్వుతో శాంతంగ జవాబిచ్చేవాడు. నీరజతోపాటు పెండ్లికి వచ్చినవాళ్ళంత ఎంతో మెచ్చుకున్నారు. అట్లాంటి ఉత్తమమైన సంబంధం దొరకినందుకు నీరజ, పురుషోత్తం, గోపాల్ యెంతో సంతోషించేరు.

పెండ్లి అయిపోయింది. కూతురు నీరజను అత్తవారింటికి పంపుతున్నప్పుడు పురుషోత్తం మరి దుఃఖాన్ని ఆపుకోలేకపోయేడు.

"అవునుమరి— ఆ తల్లి చనిపోయిన నాటి నుండి పిల్లకు తండ్రి తల్లి తనే అయి ఏ లోటు రానీయకుండ పెంచేడు. మరిప్పుడు తను దక్షతైన కూతుర్ని పంపేయవల్సి వచ్చినప్పుడు బాధగానే ఉంటుంది మరి. పురుషోత్తం చాల ఉత్తముడు," అని బంధువులంతా అనుకున్నారు.

ఆ వీడ్కోలు దృశ్యం చూసి ఆ వియ్యపురాలు సుబ్బాయమ్మ కండ్లనీరు పెట్టుకుంది. మోహనరావు అప్పగింతలన్ని అయేక మామగారికి నచ్చజెప్పేడు.



జీవిత సమరం

"మామగారు! మీ అమ్మాయిని మీరు చూడాలనుకున్నప్పుడు నాకు ఉత్తరం వ్రాయండి. నేను తెచ్చి చూపిస్తాను. లేకుంటే ఆమెనే నాపంపుతాను. కొన్నాళ్ళు మీరు వచ్చి మాతో ఉంటే మేమంతా సంతోషిస్తాము."

అల్లుడి సహృదయతకు పురుషోత్తం చాల సంతోషించేడు. అతడికి ఆ మాటలవల్ల ఊరట కల్గింది.

పెండ్లిలో మాత్రం ఆడపెళ్లివారి బంధువులు ఒకరిద్దరు ఆ వియ్యపురాలు సుబ్బాయమ్మను అడిగేరు — "ఏమమ్మా కోడలుకి నాగవల్లిలో ఏ ఆభరణాలు పెడుతున్నారు ?" అని.

"అమ్మాయికి పెడ్దామని అయిదుతులాల చంద్రహారం మూడు పేటలది చేయమని బంగారం కొని కంసాలికిచ్చేము. పెండ్లి వేళకి తయారు చేసిస్తానని మాటిచ్చి దగుల్బాజీ మాట తప్పేడు. ఏం చేయమన్నారు చెప్పండి. అందుకే ప్రస్తుతం నా మెడలోని ఈ చంద్రహారం గొలుసు వేస్తున్నాను. తరువాత కొత్తది రాగానే నేను, కోడలు మార్చుకుంటాం. నాకెవరున్నారు చెప్పండి ముద్దుముచ్చట తీర్చుకుందుకు."

సుబ్బాయమ్మగారి మాటల్ని విన్నాక ఆ బంధువులు వియ్యపురాలు గడసరే అనుకున్నారు. పురుషోత్తం, నీరజ ఆమె చెప్పిన మాటలు నిజం కాబోలనుకున్నారు. లక్ష్మి మాత్రం కాస్త నోరు జార్చింది.

"ఈనాడు బోలెడన్ని కట్నాలు పుచ్చుకోడమే గాని అందులో ఓ పైసా కూడా తీసి కోడలుకి వస్తువు చేయించరు. డబ్బుమీద కాంక్ష ఉండబట్టే ఇన్నిన్ని బేరాలు. కట్నాలకు, కానుకలకు. ఈ అత్తగారు ఒట్టి బడాయి మనిషే. ఏమి పెట్టదు. చక్కగా ఆ తొమ్మిదివేలు బాంకులో వేసుకునుంటుంది. రెండో పెండ్లికే ఇంత కట్నం పుచ్చుకున్న మనిషి, మొదటి పెండ్లికి ఏ పన్నెండు వేలు పుచ్చుకుందో! ఆవిడ పెట్టిన బట్టలు చూసేరా ఎంత నాసిరకమో. ఆ పట్టుచీర రెండు వందలకు మించదు. ఆవిడ చాల గట్టి మనిషి."

ఇలా ఈవిడ వ్యాఖ్యానిస్తున్నప్పుడు ఆ వైపుకు వచ్చిన సుబ్బాయమ్మ విని లక్ష్మి వైపు కోపంగ చూసింది. దేముడు మేలుచేసి నీరజ ఆ సమయంలో అక్కడలేదు. ప్రక్కనున్న గదిలో ఉంది. ఆమె చెవిన ఆ మాటలు పడ్డాయి. వదినగారి దుడుకుతనానికి కాస్త బాధపడింది నీరజ. నీరజ మనస్తత్వం వేరు. "నగలు, నాణాలలో ఏముంది. మనిషికి మనిషి వద్దనుండి ప్రేమ, అనురాగం కావాలి. వాటికన్న విలువైన ఆభరణాలు ఏమున్నాయి గనుక," అనుకునేది నీరజ.

నీరజ అత్తవారితో ఏనాం వెళ్ళింది. శలవు లేదని గోపాల్, లక్ష్మి, నీరజ వెంట వెళ్ళలేదు. ఏనాం చేరేక సుబ్బాయమ్మ తన కూతురుచేత కొడుక్కు, కోడలికి హారతిప్పించి, కోడలుచేత ముందుగ కుడికాలు ఇంటిలోపల మోపించి తీసుకొని వెళ్ళింది ఆదరంగ.


నీరజ ఆడపడుచు, పిల్లలు ఓ వారం రోజులుండి టాటానగర్‌కు వెళ్ళిపోయేరు. ఇన్నాళ్ళు అత్తగారే వంట చేసుకునేది. కోడల్ని దగ్గరకు రానీయలేదు. "నీరజా! నీ భర్తను నువ్వు చూసుకో, వంటింటిని నాకు వదిలేయి. నేను ఊసుపోవడానికి ఏదోపని చేయాలిగ," అనేది. నీరజ ఉప్పొంగిపోయింది. తన అత్తగారు ఎంతో మంచిదనుకుంది. అత్తవారింట్లో తను గడిపిన ఆ తొలి రోజులు తలుచుకుంటుంటే నీరజ మనస్సు ఇప్పటికి ఆనందంతో వెచ్చనౌతూంది.

* * *

"అమ్మా! దాహం," అన్న పిలుపుకు ఈ లోకంలోకి వచ్చి పడింది నీరజ. తన గతకాల ఆలోచనల్ని త్రుంచి లేచివెళ్ళి ఆ పేషెంటుకు గ్లాసుడు మంచినీళ్ళిచ్చి వచ్చింది. ఆ పేషెంటు ప్రక్కన దిగువన ఆ పేషేంటు తల్లి గాఢనిద్రలో ఉంది.

నీరజ చేతివాచి చూసింది. రాత్రి ఎనిమిదిన్నర అయింది. గతుక్కుమని పేషంట్లకు ఇవ్వవలసిన మందులన్నీ ఇచ్చి, ఛార్టులో టెంపరేచర్లు, అవి వ్రాసి, ప్రక్కనున్న గదిలోకి వెళ్ళింది. ఆ సరికే పనికుర్రాడు భోజనం కారియరు హోటలు నుండి తెచ్చిపెట్టేడు. రాత్రి డ్యూటీ పడితె హోటలునుండి కారియర్ భోజనం తెప్పించుకుంటుంది నీరజ వీలున్నప్పుడల్లా ఇంట్లో వండుకొంటుంది.

చేతులు, ముఖం కడుక్కుని భోజనం చేసింది. రాత్రి పదకొండు గంటలకుగాని డ్యూటీ ముగియదు. ఆనాడు తనను రిలీవ్ చేయడానికి నర్సు కాంతం వస్తుంది. నర్సు కాంతం ఎప్పుడు సరిగ వేళకురాదు. కోపం వచ్చి నా కాంతం క్షమాపణలు, జాలి చూపులు చూసేసరికి నీరజకు కోపం దానిమట్టుకదే



పోయేది. కాంతం హాస్పిటల్‌లో పనిచేస్తున్నప్పటికి దాని ఆరోగ్యం ఎప్పుడూ బాగుండదు. ఏదో ఒకటి వస్తునే ఉండేది. ఏవో మందులు మింగుతునే ఉండేది డాక్టరు మురళి హేళన చేస్తుండేవాడు. "ఈ హాస్పిటల్‌లోని మందులలో సగం కాంతమే మింగేస్తుంటే పాపం పేషంట్లకు మందులు చాలటం లేదు. ఈ బక్కపల్చని కాంతాన్ని చూస్తుంటే మన హాస్పిటల్‌లోని పేషంట్లకు మన హాస్పిటల్‌మీద నమ్మకం పోతుంది."

కాంతం ఎవ్వరిమీద కోపం తెచ్చుకోదు. విని విననట్టుగ తన పని తను చేసుకునిపోయేది. చాల శ్రద్ధ ఉన్న నర్సు. కాంతం గురించి తలబోస్తూ సన్నగ నవ్వుకుంది నీరజ. భోజనం కాగానే కారియర్‌ని సర్దేసి వచ్చింది వార్డులలోకి. ఆపరికి పదిగంటలు కావస్తున్నాయి. ఒకసారి మొగవారి వార్డులోకి వెళ్ళి ఆ కాలిన యువకుడి స్థితిని చూసి వచ్చింది. అతడు మగతనిద్ర పోతున్నాడు. ఇంకా ఇంజక్షను మత్తు వదలలేదు. ఆ యువతి వద్దకు వెళ్ళి చూసింది. ఆమె మత్తునిద్రలోనే భాధతో సన్నగ మూల్గుతోంది.

ఆమె స్థితిని చూస్తే ఆమె బ్రతికేకన్న చనిపోవడమే మంచిదనుకుంది నీరజ. ఇంతకీ ఆమె బ్రతుకుతుందన్న ఆశ నీరజకు కల్గలేదు. ఈ రాత్రి గడవడమే కష్టమనుకుంది. వంగి ఆ యువతి చేతిని అందుకుని ఆమె పల్సుని చూసింది. ఆ పల్సు చాల బలహీనంగనుండి, ఏ క్షణాన్నయినా ఆగి పోవచ్చు అనుకుంది నీరజ. నీరజ హృదయమంతా ఆ యువతిపైన జాలితో నిండి కండ్లు నీళ్ళతో మసక కమ్మేయి. నీరజ అలా ఆలోచిస్తు వచ్చి తన కుర్చీలో కూర్చుంది. అప్పుడు ఆ తల్లి ఆడిన మాటలు జ్ఞాపకానికి వచ్చేయి —

"మా కోడలు కేకలు విని అబ్బాయి దానిని ఎలాగైన రక్షించడానికి వంటింట్లోకి జొరబడ్డాడు మాటల్ని లెక్కచెయ్యకుండ."

నీరజకు తన వివాహ జీవితం జ్ఞప్తికి వచ్చింది. పెండ్లయిన కొత్తరోజుల్లో మోహనరావు నీరజ కొంగుమ వదిలేవాడు కాడు. ఒకనాడు నదిలో నీరజ స్నానం చేస్తుంటే ఒడ్డున పాడిబట్టల్ని చూస్తు నిల్చున్నాడు ఆమె భర్త. పెంకితనానికి నీరజ నదిలో కొట్టుకుపోతున్నట్లు నటించి కేకవేసింది రక్షించమని. అంతే మోహనరావు చెప్పులు వదిలేసి ఒడ్డునుండి చెంగుమని నదిలోకి దూకి నీరజను పట్టుకున్నాడు ఎంతో ఆందోళనతో. నీరజ ఆనందంతో కిలాకిలా నవ్వింది. భర్తకు తనమీదున్న ప్రేమకు ఉప్పొంగి పోయింది.

"అమ్మ దొంగ! ఎంత గాభరా పెట్టేసేవు. చూడు భయంతో నా గుండెలు ఎలా కొట్టుకుంటున్నాయో," అనగానే నీరజ మరీ దగ్గరగ వచ్చింది. వెంటనే మోహనరావు ఆమెను గట్టిగ కౌగిలించుకుని బుగ్గను రుచి చూచేడు.

ఆ మధురమైన రోజులే వేరనుకుంది నీరజ. బరువుగ నిట్టూర్చింది. అలా ఆమె వైవాహిక జీవితంలో ఆనందంగ ఆరునెలలు గడిచేయి. ఈలోగా తండ్రికి జబ్బుచేసి మంచమెక్కేడు. చేసేదిక్కు లేకపోతే అత్తగారి ప్రోద్బలంమీద తండ్రి వద్దకు ప్రయాణమయ్యింది నీరజ. భర్త స్టాండుకు వచ్చి నీరజను బస్సు ఎక్కించి ఓ ఏభై రూపాయలు చేతిలో పెట్టేడు.

"నీరజ ! అధైర్యపడకు. మీ నాన్నకు నయమవుతుంది. కావల్సినన్నాళ్ళు నువ్వు తండ్రి వద్ద ఉండొచ్చు. అతని ఋణం ఇలానైన తీర్చుకో నువ్వు. నా అవుసరమైతే ఉత్తరం వ్రాయి, నేనూ శలవు పెట్టుకుని వస్తాను. వారం వారం మామగారి ఒంట్లో ఎలాగున్నది నాకు తెలియజేస్తుండు," అని సానుభూతితో సాగనంపేడు.

భర్త సహృదయతకు కృతజ్ఞతాపూర్వకంగ మనస్సులో అతడికి నమస్కారాలు చెప్పుకుంది.

తండ్రి పురుషోత్తం చాల బలహీనుడయి పోయేడు. పెద్దగ రోగమేమి లేకపోయిన పట్టుకున్న జ్వరం మాత్రం అతడ్ని వదలడంలేదు. అన్నిటికన్న ముఖ్యం అతడికి మరి జీవించాలనిలేదు.

"ఎందుకమ్మా మందులకు అలా డబ్బును ఖర్చుచేస్తావు ? మీ అమ్మ పోయిననాటినుండి నాకు బ్రతుకుమీద మమత పోయింది. కాని నీ బాధ్యత ఉండబట్టి ఇన్నాళ్ళు జీవితాన్ని నెట్టుకుంటు వచ్చేను. నువ్వు, మీ అన్న మీ కాళ్ళమీద మీరు నిలబడగల్గేరు. నాకు మరి జీవితంమీద రక్తి ఏమీ లేదు. మీ అమ్మను ఆ లోకంలో త్వరగ చేరుకుందామన్న తపన తప్ప, ఇప్పుడు నాకు మరే కోరిక లేదు. నన్ను చావనీయమ్మా," అనేవాడు తండ్రి.

ఏడుస్తూ నీరజ తండ్రికి నచ్చజెప్పేది — "అదేం మాటలు నాన్న, మాకోసమైన మీరు బ్రతకాలి. అమ్మ ఎలాగు మాకు లేదు, మీరుకూడ లేకపోతే మా గతేంకాను. మంచైనా, చెడ్డైన చెప్పుకుందుకు నా అన్న తండ్రి, తల్లి లేకపోతే జీవితం వెలితి కాదు? అట్లాంటి ఆలోచనలు పెట్టుకోకండి నాన్న. బ్రతకాలని కోరుకోండి," అని తండ్రిని బ్రతిమాలేది. పురుషోత్తం విరాగిలా సన్నగ నవ్వి ఎంతో ఆప్యాయతతో తల నిమిరేవాడు.

"నా తల్లివి నువ్వు. జీవితంలో ఎంతో ధైర్యంగ ఉండాలి. చిరునవ్వుతో కష్టాల్ని ఎదుర్కోవాలి. నేను పోతే బేలవయిపోకూడదు. ఆదరించే నీ భర్తే నీకు అండదండగ ఉంటాడు. చూడమ్మా నీరజ ! అన్నయ్యకు నా పరిస్థితి ఏమీ బాగులేదని ఎక్కువ రోజులు బ్రతకనని వెంటనే రమ్మని టెలిగ్రాం ఇయ్యి. పోయేముందు తనివితీర వాడ్ని ఓసారి చూడాలని ఉంది," అని తన ఆఖరి కోరిక వెల్లడించేడు.

నీరజ అలాగే చేసింది. నాలుగు రోజులు గడిచేసరికి గోపాల్ తను పుట్టి, పెరిగిన గ్రామంకు చేరేడు. తండ్రి ఏడుస్తున్న కొడుకును దగ్గరగా తీసుకుని తలను ప్రేమతో ముద్దాడేడు. ఆ రాత్రే నిద్రలో చనిపోయేడు.

నీరజ తెల్లారి లేచి తండ్రికి కాఫీ ఇద్దామని దగ్గరగావచ్చి చూసి, తండ్రిని కదిపి నాన్నా అని ఏడుస్తూ మీదపడింది.

తండ్రి చనిపోయిన నాటికి నీరజ పుట్టింటికి వచ్చి సుమారు నెలరోజులు కావస్తున్నాయి. వారం వారం భర్తకు ఉత్తరం వ్రాస్తుండేది. రెండు ఉత్తరాలు అందుకున్నాక పొగడి ధైర్యం చెప్తు భర్త జవాబు వ్రాసేడు. ఆఖరి వాక్యం — నీకు నా ముద్దులు; అన్నది తప్ప ఉత్తరంలో మరే ప్రేమ పలుకలేదు. నీరజ హృదయం భారమైంది. కొంపదీసి మోహనరావు తనని మరచిపోవడంలేదు కాదా. బహుశా తమ ఎడబాటుకు భర్తకు చిరుకోపం వచ్చి ఉంటుందని మనస్సును సమాధాన పర్చుకుంది. అంత ప్రేమగ ఉండే భర్త తనని ఎలా మర్చిపోగలడు !

జీవిత సమరం

తండ్రి చనిపోగానే భర్తకు టెలిగ్రాం ఇచ్చింది వెంటనే రావల్సిందని. రెండు రోజులకు అతడివద్ద నుండి జవాబు వచ్చింది.

"ప్రియమైన నీరజకు,

నువ్వు పంపిన టెలిగ్రాం అందింది. మీ నాన్నగారు చనిపోయినారని తెల్సి, నేను మీ అత్తగారు చాల విచారించేము. పెద్దతను, అతని కాలం తీరింది — వెళ్ళిపోయేరు. నువ్వు మనస్సును గట్టిపర్చుకో — అధైర్యపడకు. నువ్వు నన్ను వెంటనే రమ్మని వ్రాసేవు. నాకు రావాలని, నిన్ను ఓదార్చాలని ఎంతగానో ఉంది — గాని వీలుపడటంలేదు. రెండు రోజుల క్రితం నేను నూతివద్ద జారి పడ్డాను, కుడిపాదం బెణికి చాల వాచిపోయింది. అతి కష్టంమీద రిక్షాపై ఆఫీసుకు వెళ్ళి వస్తున్నాను. ఈ కాలు బాధతో, నడవలేని నేను ఇంత దూరం ప్రయాణమై రాలేక పోతున్నందుకు మరోలా భావించక. అక్కడ దినవారాలు అయ్యేక వీలు చూసుకుని నువ్వురావచ్చు. నీ రాకకై ఎదురు చూస్తుంటాను.

ఇట్లు
నీ మోహన్.

ఆ ఉత్తరం చదువుకుని చాలసేపు అలా స్థాణువులా గోడకు జేరగిల కూర్చుండిపోయింది. ఆమె హృదయంలో చిన్న ముల్లు గుచ్చుకున్నట్లయింది. భర్తలో ఏదో మార్పు గోచరించి భయాందోళనయి కల్గేయి. ఆఖరికి తన రోజులు బాగులేవనుకుంది. పెంచి, పెద్దచేసిన తండ్రి చనియేపోదు. ప్రేమించిన భర్త దూరమవుతున్నాడు.

తను తిరిగి అత్తవారింటికి చేరితే అన్ని సర్దుకుంటాయి. తను తన భర్త మునుపటికి మల్లే అనురాగంతో ఉండొచ్చు అని సమాధాన పర్చుకుంది. ఆ రోజుకు ఎదురు చూస్తోంది.

దినవారాలయిపోయేయి. అన్న గోపాల్ ఆ మరునాడు ఆ ఊరి పెద్దలతో ఏవో మంతనాలాడి వచ్చేడు.

"చెల్లీ ! ఈ ఇల్లు అమ్మేద్దామనుకుంటున్నాను."

"ఏం ? తండ్రిచ్చిన ఆస్తి ఉంచుకోవా ?"

"నీ పెండ్లికి నాన్న ఈ ఇంటి మీద ఆరువేలు అప్పుచేసేడు. నేను జీతంలో నెలనెలా తీర్చాలంటే చాలకాలం పడుతుంది. పైగా ఆ ఋణంమీద వడ్డీ పెరుగుతూంది. నేనెక్కడో దూరప్రాంతాలలో ఉద్యోగం చేయాలి. ఎవ్వరూలేని ఈ ఇంటికి రాలేవాయె నువ్వు. అద్దెకు ఇచ్చేననుకో. అద్దెకున్న వాళ్ళు నెలనెలా నాకు సరిగ అద్దె పంపుతారన్న నమ్మకమేమిటి ? పైగా ఈ గ్రామం వెదురు పొదుకు, తల్లీ తండ్రీలేని ఈ కొంపకు మనిద్దరము రాలేము. అన్ని విధాల ఆలోచిస్తే ఈ ఇంటిని అమ్మేయడమే మంచిదని తోస్తోంది — ఏమంటావు చెల్లీ ?"

"ఏమనడానికేముంది. ఈ ఇల్లు నీది. నీకేది మంచిదని తోస్తే అలా చెయ్యి."

గోపాల్ ఆ ఊరి పెద్దలతో సంప్రదించి, అప్పిచ్చిన షావుకారుకే పదిహేనువేలకు ఆ ఇంటిని అమ్మివేసి అప్పుపోగా చేతికి వచ్చిన తొమ్మిదివేలను తీసుకుని ఇంటికి వచ్చేడు.

"చెల్లీ ! ఇవాళతో ఈ ఇంటికి, ఈ గ్రామంకు మనకు ఋణం తీరిపోయింది. ఈ వెయ్యిరూపాయలు నీ వద్ద ఉంచుకో. బావగార్కి కూడ తెలియనివ్వకు— ముఖ్యంగ మీ అత్తగార్కి. నేను నీకు ఆఖరికి చేయగల్గిన సహాయం ఇంతే. మీ వదిన సంగతి తెల్సుకదా. బహు స్వార్థపరురాలు. దానికి తెల్సి నీకేమి నేను పంపలేను. నా బలహీనత ఈ పాటికి నీకు తెల్సి ఉంటుంది. ఈ డబ్బు నీకు ఎంతో అక్కరకు వస్తుంది. పోనీ మరో వెయ్యి కూడ ఇద్దునా," అని జేబులోని నోట్లు తీస్తుంటే నీరజ అడ్డుకుంది. ఆదరంతో కన్నులు చెమర్చగ - "అన్నయ్యా ! నీకు నా మీదున్న ప్రేమ నాకు తెలియకపోలేదు. నీ భార్య, పిల్లల్ని కాదని నన్ను ఆదుకోమని నేనెన్నడు అనలేను. నువ్వెక్కడున్న నెలకోసారి నీ క్షేమసమాచారాల్ని తెలియజేస్తు, నా క్షేమాన్ని కనుక్కునేందుకు ఓ ఉత్తరం రాస్తుంటే నేనెంతో సంతోషిస్తా. నాకు వెయ్యి రూపాయలు ఎక్కువే. ఓ అయిదువందలిస్తే చాలు," అని అయిదువందలు తిరిగివ్వబోయింది.

"ఒద్దమ్మా — ఆ వెయ్యి ఉంచుకో. చెల్లీ ! నేను రేపు బస్సులో రాజమండ్రిపోయి అక్కడనుండి రైలులో పోతాను. మరి నీ ప్రయాణమెప్పుడు?"

"నేను నీతో రాజమండ్రి వరకూ వస్తాను. అక్కడ నుండి నేను బస్సులో ఏనాం పోతాను."

"సరే— వెళ్ళేటప్పుడు ఆ షావుకారికి కబురు చేసి ఇంటిని అతనికి అప్పగించి పోదాం."

ఆ మరునాడు ప్రయాణమై, పుట్టి పెరిగిన ఆ ఇంటిని వదులుకోలేక వదులుకున్నారు, ఆ అన్నా చెల్లెళ్ళిద్దరు కంటి నుండి నీరు చిమ్ముతుంటే.

అవాళ ఆదివారం. మనసులో ఎంతో దిగులుతో ఎంతో ఆందోళనతో సాయంత్రం నాలుగు గంటలకు ఏనాంలో అత్తవారింట అడుగు పెట్టింది నీరజ. భర్త మోహనరావు ఇంట్లోనే ఉన్నాడు. ఆసరికే సావిడిలో కూర్చుని కాఫీ త్రాగుతున్నాడు. అత్తగారు వంటింట్లో ఏదో సర్దుతూంది. నీరజను చూడగానే మోహనరావు త్రాగుతున్న కాఫీగ్లాసును ప్రక్కన పెట్టి లేచి ముందుకు రెండడుగులు వేసేడు. చిరునవ్వుతో చేతులు జాచేడు. నీరజ సందేహాలన్నీ పటాపంచలై పోయేయి. ఒక పరుగువ వచ్చి భర్త చేతుల్లో చేరింది.

(ఇంకా ఉంది)

కొత్తగొంతులు


టి.యస్. కాంతారావు

అజ్ఞాతపు కొండల మాటు నుండి
చిక్కని దారిద్ర్యపు అడవుల మూరు
మూలల నుండి
ఈ చీకటి వ్యవస్థా గర్భాన్ని చీల్చి
పొడుచుకొస్తున్నాడు కిరణాయుధ
సూర్యుడు
నేల యోని చీలి
రక్త మాంస వీర్యాలతో
ఈ కుష్టు ఉచ్ఛిష్ట వ్యవస్థపై తిరగబడి
మనిషికీ మనిషికీ అడ్డు గోడలు లేని
ఆర్థిక అసమానత్వపు అమానుషత్వం లేని
ప్రపంచాన్ని ప్రమాణాల్ని ప్రజాప్రభుత్వాన్ని
నిర్మించే మనుషులు కావాలిప్పుడు
ప్రతి తల్లీ ఒక సూర్యుణ్ణి ప్రసవిస్తే చాలు
— నగ్నముని

కేశవరావుగా 'ఉదయించని ఉదయాలు'తో తెలుగు కవితా రంగంలో ప్రవేశించి నగ్నమునిగా దిగంబర విప్లవ కవితోద్యమాల్లో కవిగా ప్రతిష్టుడయ్యాడు. ఉదయించని ఉదయాలు రచనా కాలానికే నగ్నమునిది ఒక విలక్షణమైన గొంతుక అని, అతనిదొక ప్రత్యేక కవితా వ్యక్తిత్వమని అప్పటి ప్రముఖులు గుర్తించారు. అతని కవితాంశ, కవితాత్మక దృష్టి అనంతరకాలంలో విస్తృతమూ, విశాలమూ, అయ్యాయి. నడిచిన బాటలోనే నడవటం నగ్నమునికి గిట్టదు. వచన కవితా ప్రక్రియ అప్పటికే ప్రసిద్ధమైనా తను మాత్రం ఆ ప్రక్రియలోనే నూతన ప్రయోగాలకు పూనుకున్నాడు. అక్షర బలాన్ని, అక్షర సంయోగాన్ని చాలా బాగా గుర్తించిన ఈ తరం కవుల్లో నగ్నముని ముందుగా ఎన్నతగినవాడు. "వృత్తాలు ఛందస్సుల పట్టాలమీద నడిచే రైలు బళ్ళు. వచన గీతాలు ద్యోమయానం చేసే విమానాలు. వచనం బరువైన బండలాగ ఒకంతట గాని ఆకాశం మీదకు లేవదు. వచనాన్ని కదనం చేయడం అనేది ఒక్క కళాకారునికి మాత్రమే సాధ్యం. ఈ కళా నైపుణ్యమే నగ్నముని గీతాలను నినాదాల దశ దాటించి కవితాది హాయసంలో విహరించేటట్లు చేస్తుంది" అని శ్రీశ్రీ అన్నది నగ్నముని కవితా శక్తిని గుర్తించేకాని కాకతాళీయంగా కాదు.

1965 తరువాత తెలుగు కవిత్వం ఒక మలుపు తిరిగి తెలుగు నేలమీద ఒక మహా సంచలనాన్ని కలిగించటానికి మూలపురుషుడు నగ్నముని. దిగంబర కవితోద్యమానికి ప్రారంభకుడూ, పథనిర్దేశకుడూ నగ్నముని కావటం ఆధునిక తెలుగు కవిత్వ చరిత్ర విస్మరించరాని విషయం. ఆనాటికి మహాస్వప్న (కమ్మిశెట్టి వేంకటేశ్వరరావు) ఒక్కడు మాత్రమే 'అగ్ని శిఖలు – మంచు జడులు' కవితా సంకలనాన్ని వెలువరించి ఉన్నాడు. మిగతా నలుగురూ — జ్వాలాముఖి, చెరబండరాజు, నిఖిలేశ్వర్, భైరవయ్య కవితా రంగానికి కొత్తవాళ్ళు. దిగంబర కవితోద్యమం విప్లవ కవితోద్యమంగా రూపొందడంలో నగ్నముని పాత్ర మరచిపోకూడదు. (ఈనాడు వి. ర. సంలో నగ్నముని లేకపోవటం వేరు విషయం.)

తూర్పుగాలి కొయ్యగుర్రం రెండుకావ్యాలు వచన కవితలో ప్రయోగాత్మతకు నిరూపకాలు. నగ్నముని కవిత్వంలో ఎక్కడా వచనత్వం చోటు చేసుకోదు. కవితానుభూతి అందీ అందనట్లుగా కవిత్వాన్ని నడపటం అతనికే చేతనవును. ఏ పాదంలోనూ నినాదం కనపడదు. దిగంబర కవిగా అశ్లీలం రాసాడనే అపవాదు అతనిమీదుంది. దిగంబర కవిత్వావిర్భవానికి మూలకారణాలు అన్వేషిస్తే ఈ అశ్లీలం అపచారం కాదని, ఆనాటి షాక్ ట్రీట్‌మెంటుకి, కవిత్వరంగంలో, ఆలోచనా రంగంలో సంచలనానికి అది అవసరమేననిఅనిపించక మానదు. శీలమైనా, అశ్లీలమైనా కవిత్వం కవిత్వమే. ఆనాటి సాంఘిక, రాజకీయ, సాహిత్య స్తబ్ధ వాతావరణం, కలుషితమైన విలువలూ, వ్యాపార సంస్కృతి, రాజకీయ గుండాయిజం జన జీవితాన్ని ప్రభావితం చెయ్యటం నగ్నమునిని కలవర పరచాయి. సాహిత్య కారులు, మేధావులూ ఎంత మాత్రం ఈ వ్యవస్థపైన నిరసనను ప్రదర్శించకపోగా నిర్లిప్తతనుభజించటం నగ్నమునికి ఆశ్చర్యమైంది. ఇట్లాంటి వ్యవస్థలో సంచలనాన్ని కలిగించడానికి వైయక్తికమైన గొంతు కంటె గ్రూప్‌వాయిస్ బాగా పనికివస్తుందని ఆలోచించి దిగంబర కవితోద్యమానికి కారకుడయ్యాడు నగ్నముని. కవిత్వాన్ని ప్రజలపరం చెయ్యటం, ఈ వ్యవస్థలో రాజీలేని పోరాటాన్ని సాగించటం అప్పటి దిగంబర కవితోద్యమంగా నగ్నముని లక్ష్యం చేసుకున్నాడు. వి. ర. సం ఏర్పడిం తరువాత ఈ రాజీలేని పోరాటం కొన



సాగుతూ ఉన్నది. అతను కథలు రాసిన, విలోమ కథలు రాసినా పీడిత ప్రజల సంక్షేమం, ప్రయోగాత్మ కతలను విస్మరించలేదు.

తూర్పుగాలి కవితా సంకలనం అంతా ఈ వ్యవస్థ ఉన్న పద్ధతికీ, ఉండవలసిన స్థితికీ ఉదాహరణమే. పీడకులపట్ల ద్వేషాన్ని ప్రకటించినా, పీడితులపట్ల సానుభూతిని,వారి పోరిమిపట్ల అసహనాన్ని ప్రదర్శించినా అది కవితాత్మకంగాను,మరొకరికి సాధ్యంగాని విధంగాను ఉండటమే నగ్నముని ప్రత్యేకతకు తార్కాణం. కొయ్యగుర్రం— దివితాలూకా తుఫాను ఉదంతాన్ని ఆధారంగా తీసుకొని ఈ పాశవిక ప్రభుత్వానికి ప్రతీ కాంత్మకంగా రచించిన కావ్యం. దీన్ని వేకూరి రామారావుగారు ఆధునిక మహా కావ్యం అనటం సాహిత్య వేత్తలకు తెలియని విషయంకాదు.

స్వాతంత్ర్యానంతరం—ఈ వ్యవస్థపై నేటి కుహనా విలువలపై రాజీ కాని నిరసనను ప్రారంభించిన ఉద్యమ కవులలో మొదటివాడు బహుశా నగ్నమునేనేమో ! వచన కవిత్వాన్ని వదలకుండా; పాటని ముట్టకుండా కవిత్వంలో ప్రయోగాలు చేస్తున్నవాడు నగ్నముని. తెలుగు కవిత్వ భాషలోని ఫ్రిజిడిటీని, కాంప్లెక్స్‌ని అనేకా మధ్య తరగతి ఇన్‌హిబిషన్స్‌ని పోగొట్టటానికి ప్రయత్నించినవాడు నగ్నముని. "ఒక కొత్త ఆలోచన కోసం, ఒక కొత్త తాత్విక సిద్ధాంతం కోసం, ఒకకొత్త ఆశ కోసం జన జీవితం ఎదురుచూస్తున్నది. ఈ చీకట్లోంచి, ఈ అరిగిపోయిన సిద్ధాంతాల నినాదాలలోంచి, యీ ఆచననా లేమిలోంచి జన జీవితాన్ని ప్రభావితం చేసి నూత్న విలువల వస్త్రంతో యీ సమాజం బతికి బట్టకడితే, ఒక కొత్త ఆశ ఊపిరిగా యీ సమాజం మేల్కొంటే, భౌతిక అధిభౌతిక మానసిక స్థితి మధ్య సరియైన జీవితాన్వయంతో ముందుకు వెళ్ళగలిగితే, అందుకు నా రచనలు ఉపయోగపడితే నేను ధన్యుణ్ణయినట్లే" అంటాడు నగ్నముని. ఈనాటి క్రైసిస్ పొలిటికల్ కాదని ఫిలసాఫికల్ అని నగ్నముని నేటి నమ్మకం. 1965 తరువాత వచ్చిన కవులలో బలమైన అభివ్యక్తీకరణ, ప్రజాదృష్టి, ప్రయోగ దీక్ష; దక్షత కలిగిన ఉత్తమ వచన గేయకవి నగ్నముని.

నాయకులు ప్రజల ముఖాలపై
పోస్తున్న ఉచ్చని
కరుణరసంగా గంగాజలంగా గతుకుతున్న
యీ యువతరాన్ని
బీడీముక్కల్లా చెప్పకింద సిగరెట్ పీకల్లా
వంటింటి మసిపాతల్లా బతుకుతున్న
యీ తరాన్ని
నేను క్షమించలేను
ప్రశ్నించడం చేతకాని అస్తిత్వాన్ని
నేను క్షమించలేను
బుద్ధా నువ్వా నీ క్షమా నా కక్కర్లేదు
నువ్వొక్కడివే బోధి కింద చావు. ★



జీవిత సంధ్య

గురజాడ శోభాపేరిందేవి

'వృద్ధాప్యాన్ని మించినశాపం మరొకటి లేదేమో!' అనుకుంటుంది కాంతమ్మ 'వృద్ధులంటే అందరికీ చిన్నచూపే! వారి సలహాలు వినాలన్నా వారితో మాట్లాడాలన్నా చిరాకే! నిజంగా వృద్ధాప్యమే కనక శాపమే ఐతే ఆ శాపానికి గురి కాని మానవుడు ఉండడు కదా! మరి ఆ మాటని కుర్రకారు గుర్తించరేం ?'

ప్రస్తుతం దేశంలో అరవై ఏళ్ళు దాటినవాళ్ళు నాలుగుకోట్లమంది, డబ్భై ఏళ్ళు దాటినవాళ్ళు నలభై లక్షలమంది ఉన్నారని ఆవిడ దినపత్రికలో చదివింది. (దినపత్రిక రోజూ తూచా తప్పకుండా పూర్తిగా చదివే వ్యక్తి వాళ్ళింటి మొత్తంలో ఆవిడే!) మరి వాళ్ళంతా కూడా తనలాగే జీవచ్ఛవాలుగా ఉంటున్నారా ?'

"బామ్మా ! బామ్మా !" పిలుస్తూ వచ్చింది మానస.

"ఏమిటే ?" అడిగింది కాంతమ్మ.

"నీకు చెముడు కానీ వచ్చిందా బామ్మా ఎన్నిసార్లు పిలిచినా పలకవు! ముసలి వాళ్ళకి చెముడు తప్పకుండా ఉంటుందిట కదా !"

"ఇంతకీ విషయం ఏమిటమ్మా ?"

"నా ఫ్రెండ్ రతీ లేదూ వాళ్ళబామ్మ 'పెళ్ళీడు పిల్లలు' సినిమాకి వెళ్ళిందిట. నువ్వే చెప్పబామ్మా ఆవిడ చూడవలసిన సినిమా అదా ? ఏ 'స్వామి అయ్యప్ప'కో పోవాలికదా ! మేమంతా నవ్వలేక చచ్చామనుకో !"

"మానసా !" పిలిచింది వంట గదిలోంచి ఆ అమ్మాయి తల్లి.

"వస్తున్నానమ్మా" అంటూ పరిగెత్తింది మానస.

కాంతమ్మ పెద్దగా చదువుకోలేదు. అయితే ఏం ? అనుభవాలు చెప్పినపాఠాలు ఆవిడని విద్యాధికురాలిని చేసాయి. తెలుగు దినపత్రిక చదవడం వల్ల ప్రపంచంలో ఏ మూల ఏం జరుగుతుందో ఆవిడకి బాగా తెలుసు. కానీ అందరూ ఆవిడకి ఏమీ తెలియదనుకుంటారు.

ఇంట్లో అందరూ రాజకీయాలను గురించి మాట్లాడుకుంటున్నప్పుడు తను కూడా ఉత్సాహంగా పాల్గొంటుందావిడ. కానీ ఆవిడ ఏ విషయం గురించి మాట్లాడినా కారణం లేకుండానే నవ్వేస్తారు మనవలు. అప్పుడు ఆవిడ మనసు చివుక్కుమంటుంది. వెక్కిరింతగా మాట్లాడినా, వెకిలిగా నవ్వినా కొడుకూ కోడలూ మందలించక పోవడం ఆవిడకి మరీ బాధని కలిగిస్తుంది.

ఆవిడకి చేతకానిది లేదు. కుట్లూ, అల్లికలూ, వంటా వార్పులలో ఆవిడది అందవేసిన చెయ్యి. మానస బట్టలమీద ఎన్నో ఎంబ్రాయిడరీలు చేసింది. కుర్చీ కవర్లు వగైరాలన్నీ ఆవిడ చేతిమీదుగానే కుట్టబడే ఎంబ్రాయిడరీ చేయబడ్డాయి. పిల్లల పుస్తకాలకి అట్టలువేసి లేబుల్స్ అంటించడంకూడా ఆవిడే చేస్తుంది.

కాంతమ్మని కోడలు ధాత్రి కష్టాలు పెట్టేస్తోందని కాదు. కానీ అందరితోనూ సరదాగా కలిసి మెలిసి తిరగాలని, వారి ఉత్సాహంలో పాలు పంచుకుని, తన అనుభవాల సంపదను వారికి అందివ్వాలన్న ఆవిడ కోరిక మాత్రం ఇప్పటిదాకా తీరలేదు.

పిల్లలు కాలేజీలనుండి రాగానే వాళ్ళు తన ఎదుట కూర్చుని కబుర్లు చెప్పుకుంటే బాగుండును అనుకుంటుంది. కానీ వాళ్ళకి ఆవిడ ఎదురుగా కూర్చుని మాట్లాడడం బోర్ !

కొడుకు దినకర్ ఆఫీసునుండి రాగానే తల్లి వైపైనా చూడకుండా తిన్నగా వంట గదిలోకిపోయి ఆఫీసు కబుర్లన్నీ ధాత్రికి చెబుతాడు. 'పోనీ తానే వెళ్ళి కూర్చుంటే ఏమవుతుంది ?' అని అలా చాలాసార్లు చేసింది. కానీ అదేం ఖర్మమో తను రాగానే దినకర్ మాట్లాడడం ఆపేస్తాడు. ధాత్రి నొసలు చిట్లించుతుంది.

ఓ రోజు రాత్రి ధాత్రీ దినకర్‌ల మాటలువిన్న కాంతమ్మ ఆపైన వాళ్ళ మధ్యకి వెళ్ళలేదు.

"మన ఇద్దరినీ సరదాగా ఓ పావుగంటైనా

మాట్లాడుకోనీయకుండా వచ్చి కూర్చుంటారేమిటండీ అత్తయ్యా ?'' అని అడిగింది ధాత్రి.

''నీకు తెలియనిది ఏముంది ధాత్రీ ! అమ్మని బామ్మ చాలా కష్టాలు పెట్టిందిట. అమ్మా నాన్న ఆవిడ నోటికి దడిసి పగటిపూట ఒకరిని ఒకరు తప్పుకుని తిరిగేవారుట. ఇప్పుడు ఆవిడ మనలని అలా విడదీయనూలేదు. కలిసి ఉంటే తనతో పోల్చుకుని కుమిలిపోకుండా ఉండలేదు. అందుకే ఇలా వచ్చి మన ఏకాంతానికి అంతరాయం కలిగిస్తుంది.''

ఆ మాట విన్న రాత్రి కాంతమ్మకి నిద్ర రాలేదు. 'సుఖం' అన్న పదానికి అర్థమే తనకు తెలియకపోవచ్చు. అలాగని తన స్వంత కొడుకూ కోడలూ సుఖపడడం సహించలేక అడ్డుపడే అంత చెడ్డదా తాను ?' అనుకుంది పదే పదే ధోవతితో కళ్ళు తుడుచుకుంటూ !

ఆ మాట గుర్తు రాగానే ఆవిడ కళ్ళు నీటితో నిండాయి.

ఒక్కోరోజు వంటంతా కాంతమ్మే చేస్తుంది. లొట్టలు వేసుకుంటూ తింటారు అందరూ ! ఆ సమయంలో వాళ్ళకి ఆవిడని ఏడిపించబుద్ధి కాదు. తర్వాత మళ్ళీ మామూలే !

పదిహేను రోజులకి ఓసారి మంగలి వస్తాడు. అతడితో సందులోకి నడిచి గుండు గీయించుకుంటుంది కాంతమ్మ. అది చూసి విరగబడి నవ్వుతుంది మానస.

ఓ రోజు నవ్వుతూనే ''అదేమిటి బామ్మా ? నువ్వు ఎవరి ఎదుటా ముఖ్యంగా మగవారి ఎదుట గుండుమీది ముసుగే తీయవు కదా ! ఇప్పుడు ముసుగు తీసేయడమే కాక పరాయి మగాడిచేత గుండు గీయించుకుంటున్నావు '' అంది మానస. ఆ మాట నిజమే అనిపించింది కాంతమ్మకి ! విధవ అయిన స్త్రీ అలంకారప్రాయమైన జుట్టూ, పూలు, గాజులూ ఉంచుకో కూడదు అని నియమం పెట్టిన వ్యక్తులు ఇలాంటి చిన్న చిన్న విషయాలలో నిర్లక్ష్యం వహించారెందుకో ! అనుకుంది.

ఓ రోజు పరీక్షకి బయలుదేరుతున్నాడు మనవడు మానుష్. (రోజూ అతను పరీక్షకి వెళ్ళే సమయానికి లోపల ఎక్కడో.. కావాలని కూర్చునేది కాంతమ్మ.) తన వస్తువులన్నీ సర్దుకుంటున్నవాడు తల్లితో ''అమ్మా నా పెన్ను కనిపించడంలేదు'' అనేసి వెతుక్కోసాగాడు. వంట గదిలో ఉన్న ధాత్రి పట్టించుకోలేదు.

తానే వెతికి ఇద్దాము అనుకుని ముందు గదిలోకి వచ్చిందావిడ. అప్పటికే అది దొరకడంతో అతను గబగబా ముందుకు నడిచాడు.

ఆవిడ గబగబా వెళ్ళి అతన్ని ఆపి ''ఒరేయ్ నా శకునం మంచిది కాదురా! మీ అమ్మని ఎదురు రమ్మంటాను. అప్పుడు వెడుదువుగాని !'' అంది.

''పో బామ్మా ! నాకు ఇలాంటి వాటిమీద నమ్మకం లేదు. అసలే లేటైపోతుంటే నీ గోలేమిటి ?'' అంటూనే వెళ్ళిపోయాడు.

మానుష్ వచ్చేదాకా ఆ విషయమే ఆలోచిస్తూ అతను పరీక్ష బాగా రాయాలని పదే పదే దేముడికి దండం పెట్టుకుంటూ ఉండిపోయింది కాంతమ్మ.

ఆ రోజు రోజులాగ కాక ఆఖరి పరీక్ష కావడంతో ఆలస్యంగా ఇంటికి వచ్చాడు మానుష్.

''బామ్మా నీ శకునంవల్ల నేను అద్భుతంగా రాసాను తెలుసా ? అయినా గుండూ, ధోవతీలతో తిరుగుతావు కనక 'శకునం శకునం' అని అంటారు కానీ ఎందరో వితంతువులు పూలూ, గాజులతో బొట్టూ కాటుకతో కనబడితే శకునం అంటున్నారా? కనక తప్పు నీదీ నీలాంటివాళ్ళదీ కాదు అని నేనంటాను'' అన్నాడు మానుష్.

మనవడి మాటలో అక్షరం కూడా తప్పు కనబడలేదామెకి ! అతని మాటలు ఆమెని సంతోష పెట్టేసాయి. తమ కాలంలో మగవాళ్ళు కూడా ఈ విధంగా ఆలోచించి ఉంటే తము ఇంకో రకంగా ఉండేవారేమో ! అనుకుంది. పోనీలే ఇప్పటికైనా ఆలోచనాధోరణిలో మార్పు వచ్చింది అనికూడా అనుకుంది.

''బామ్మా గుడికి వెడదాం వస్తావా ?'' మానస అడిగింది.

ఆలోచనలలో చిక్కుకుపోయిన కాంతమ్మ ఉలిక్కిపడింది.

''విశేషం ఏమిటే ?'' అని అడిగింది ఊహిస్తూనే !

''సోమవారం నుండి పరీక్షలు'' అంది భయంగా!

కాంతమ్మకి నవ్వొచ్చింది. దాన్ని పెదవి దాటనీయకుండా చేసి ''త్వరగా రా అయితే'' అంది.

''వన్ మినిట్'' అని పరిగెత్తిన మానస అరగంటకి తిరిగివచ్చింది.

చంద్రకాంతం రంగు కంచిపట్టు పరికిణీ ఓణీలో చంద్రకాంత పువ్వులాగే ఉండి ''త్వరగా పద బామ్మా'' అని తొందరపెట్టింది.

ఈసారి ఆవిడ నవ్వకుండా ఉండలేకపోయింది.

'ఏం ఆడపిల్లలో ! అన్ని రంగాలలోనూ త్వరపడి పైకి వచ్చేస్తున్నారు. కానీ ముస్తాబు విషయంలో మాత్రం 'తొందర' అన్న పదానికి అర్థమే విస్మరిస్తున్నారు !' అనుకుంది.

శనివారం కావడంతో ఆంజనేయస్వామి గుడి కాస్త రద్దీగానే ఉంది.

చేతులు జోడించి, కళ్ళు మూసుకుని నిలబడి పోయింది కాంతమ్మ. 'స్వామీ త్వరగా నన్ను జీవన్ముక్తురాలిని చెయ్యి' అని ప్రార్థించి కళ్ళు తెరిచింది.

మానస ఇంకా కళ్ళు తెరవలేదు.

తల ఇటు తిప్పిన కాంతమ్మ ఉలిక్కిపడింది.

కాంతమ్మ ఈడే ఉన్న ఓ మగాయన ఒళ్ళంతా కళ్ళు చేసుకుని మానసని చూసేస్తున్నాడు. కాదు కాదు చూపులతో జుర్రేస్తున్నాడు.

జీవితం

జీవితపు ప్రమిదలో తైలం
కాలంతో హరించక మానదు.
జీవితపు వెలుగు కొడి కట్టకా తప్పదు
క్షణికమైన జీవితంలో
అనుక్షణం ఆశల ఆరాటంలో అలసే
మానవు డెంత పిచ్చివాడు !

— కె సదాశివరావు

కాంతమ్మకి కోపం ముంచుకువచ్చింది 'ఆ వయసు వ్యక్తి చేయవలసిన పనేనా అది ?' ఆదే వయసులో ఉన్న తానెలా ఉంది ! ఆవిడకి ఓ శ్లోకం గుర్తువచ్చింది.

'అంగం గళితం పలితం ముండమ్
దశన విహీనం జాతం తుండమ్
వృద్ధోయతి గృహీత్వా దండమ్
తదపిన ముంచత్యా శాపిండం !'

('చొప్పకట్టలా శరీరం ముడతలుపడిపోయినా, తల ముగ్గుబుట్టలా నెరిసిపోయినా, పళ్ళూడిపోయి బోసిగా అయిపోయినా, శక్తిలేక శరీరం క్షీణించి కర్రసాయంతో అడుగులు వేస్తున్నా కొందరికి ఆశ చావదు.')

ఆరోజు రాత్రి అద్దం ముందర కూర్చున్న కాంతమ్మకి తన శరీరంమీద పొడసూపుతున్న మచ్చలను చూసి కళ్లనీళ్లు తిరిగాయి. గత కొద్ది రోజులుగా ఆవిడ వాటిని చూస్తూనే ఉంది. కుష్ఠురోగం వచ్చిందేమో అని గిల్లుకుని చూసుకుంది. స్పర్శజ్ఞానం ఉంది. అయితే బొల్లేమో ! మందులు వాడితే పోతుందేమో ! ఆవిడకి చిన్నప్పటి నుండీ మచ్చలూ వగైరాలంటే ఓ విధమైన అసహ్యం. ఏ చిన్న పొక్కులాంటిది వచ్చినా అది పోయేదాకా ఆవిడకి స్థిమితం చిక్కదు.

ఎవరికి చెప్పాలి ? కొడుకుకి చెప్పాలంటే మొహమాటం ! కోడలిని పిలిచి రహస్యంగా చెప్పింది.

''కొన్ని మందులకి రియాక్షన్ వస్తుంది అత్తయ్యగారూ ! అలాంటప్పుడే ఇలాంటివి వస్తూ ఉంటాయి. అంతేతప్ప మరేమీ కాదు. అయినా మీ తృప్తికోసం డాక్టరు దగ్గరికి వెళ్లవచ్చు అనుకోండి!

కానీ మీరే ఆలోచించండి ! ఆయన తెచ్చిన జీతంరాళ్లే బొటాబొటీగా సరిపోతున్నాయి. పిల్ల ఎదుగుతోంది కదా అయినా దానిపేరిట చిల్లిగవ్వ దాచలేదు. మానుష్ ఏ ఇంజనీరింగ్‌కో వెడితే ఇంక చెప్పనే అక్కర్లేదు. అటు వాళ్ల భవిష్యత్తునీ పాడు చెయ్యలేము ఇటు ఆ ఖర్చులూ భరించలేము.

ఈ పరిస్థితిలో మనం ఎంత పొదుపుగా ఉంటే అంత మంచిది. మీరు కోపం తెచ్చుకున్నా నేను చెప్పకలిగినది ఇంతే !''

కాంతమ్మకి కోడలి మాటలు విన్నాక సిగ్గేసింది. నిజమే ! ఖర్చులు బాగా పెరిగాయి. ఆదాయం మాత్రం అలాగే ఉంది. ఈ పరిస్థితిలో తాను ఇలాంటివి చెప్పడం ఏమిటి ?

తన పరిస్థితిలో ఏ మగవాడు ఉన్నా హాయిగా బ్రతుకుతాడు. తనవారిని బ్రతికిస్తాడు ! దానికి కారణం రిటైర్ అయినా ఏదో ఓ ఉద్యోగం చేయడమో, లేక పెన్షన్ డబ్బుని వాడుకోవడమో !

ఆ రాత్రి, మర్నాడు ప్రొద్దున్నా చాలా ఆలోచించింది కాంతమ్మ 'తానూ సంపాదిస్తే ఏమైంది ?' అని !

మధ్యాహ్నానికి ఆమెకి మంచి ఆలోచన వచ్చింది. మానసతో కలసి ఓ ఎంబ్రాయిడరీ షాపుకి వెళ్ళిందో సారి ! అక్కడికి ఎందరో ఆడవాళ్ళు వచ్చి కుట్లూ అవీ కుట్టి డబ్బు తీసుకుని పోతారుట.

'తానూ అలా చేస్తే ?'

''పురాణానికి వెడుతున్నాను'' అని కోడలికి చెప్పి బయటపడింది.

ఆ షాపు వాళ్ళ ఇంటికి చాలా దూరం! బస్సులోనో రిక్షాలోనో వెళ్ళాలి. కానీ ఆవిడ దగ్గర డబ్బేమీ లేకపోవడంతో నడిచే వెళ్ళింది.

చెమటలు క్రక్కుకుంటూ, ఆయాసపడుతూ షాపులోకి వస్తున్న ఆ బోడి ఆవిడని ఆశ్చర్యంగా చూసారు షాపు యజమాని.

''మంచినీళ్ళు'' అంది.

ఇచ్చాడు.

గడగడా త్రాగేసి గ్లాసు అతనికి ఇచ్చేసింది.

''చెప్పండి.''

''నాకు ఎంబ్రాయిడరీ పని కావాలి బాబూ!''

చిత్తరపోయాడతను. ''మీరు అలాంటి పని ఏం చేస్తారమ్మా''

''అవసరంలో ఉన్నాను నాయనా! నాకొడుకుకి వేన్నీళ్ళకి చన్నీళ్ళుగా తోడ్పడాలన్నదే నా ఉద్దేశ్యం!''

''మీరు చేయలేరమ్మా!''

''చేయగలను బాబూ! చూపు బాగానే ఉంది. చేతిలో చురుకుదనం ఉంది.''

అతనికి ఇంతదాకా ఇలాంటి సంఘటన ఎదురు కాకపోవడంతో ఆశ్చర్యంగా ఉంది. ఆవిడ స్థితికి జాలిగా కూడా ఉంది.

''మీ ఇల్లు ఎక్కడ ?''

చెప్పింది.

''ఎలా వచ్చారు ?''

చెప్పింది.

''మీకు వచ్చే డబ్బంతా రాకపోకలకే ఖర్చవుతుంది తల్లీ! (రోజూ నడిచి రాలేరుగా) అయినా చేస్తాను అంటే మీ ఇష్టం! కానీ మీ అబ్బాయికి ఈ విషయం తెలిస్తే ఒప్పుకోరు. ఎండపొడ ఎరగక ఇంటి పట్టున ఉండే మీకిది కష్టమే! దీని వల్ల ఏ అనారోగ్యమో పట్టుకుంటే మీ అబ్బాయికి ఇంకో ఖర్చు కదమ్మా! ఆలోచించండి. మీరు రేపు వస్తే మీ ఇష్టం. కానీ రాకపోతేనే నాకు సంతోషం! రోజూ నడిచి రావడం పోవడం తేలిక కాదు.'' (ఎంబ్రాయిడరీ మిషతో ఆడపిల్లలమీద వ్యాపారం చేస్తున్నానని మాత్రం చెప్పలేదు అతను.)

జవాబియ్యకుండా వెనుదిరిగింది కాంతమ్మ.

ఇల్లు చేరిన ఆవిడకి ఒళ్ళు పులిసిపోయింది నడకవల్ల! మనసూ పాడైంది ఆలోచనలవల్ల!

జీవిత సంధ్య

నిస్సత్తువగా వరండామీద కూలబడింది కాంతమ్మ.

ఆవిడకి తన స్థితిని చూసి జాలీ అసహ్యమూ కలిగాయి. తనవారికి సాయపడలేనందుకు జాలీ, ఇలాంటి స్థితిలోకూడా వారిమీద ఆధారపడడానికి అసహ్యమూ వేసాయి. కోడలికి సాయం చేయలేకపోతే కోపం, చేస్తే అసంతృప్తి!

తాను ఉన్నా లేకున్నా ఒకటే! తన అవసరం ఎవరికీ లేదు. తనతో మాట్లాడాలన్న ఆసక్తి అంతకంటే లేదు. ఎంత వద్దన్నా వారి మాటల్లో ఏదో వెక్కిరింత కనబడుతూనే ఉంటుంది. ఏదో ఒకదానికి విసుక్కుంటూనే ఉంటారు. పిల్లలకి ఏ అనారోగ్యమో వస్తే విలవిల్లాడిపోతారు కానీ తనకి వస్తే పెద్దతనంగా తీసిపారేస్తారు. తను మనసారా నవ్వి ఎన్నాళ్ళయిందో! మనసుకి నచ్చిన వంటకాలు తిని ఎన్నేళ్ళయిందో! పెద్దవాళ్ళు పసివాళ్ళతో సమానం అంటారుకదా!

మరి తనని ఏ విషయంలో ఆ విధంగా చూస్తున్నారు? మూగ మొద్దులాగ మూలగదిలో పడి ఉండిపోయింది తాను. ఎటూ వెళ్ళదు. ఏమీ చేయదు. పైసా అవసరం అయినా కొడుకే గతి! ఎంత అవమానం! ఎంత అమానుషం! 'డబ్బు ఉంటే తననిలాగ చూసేవారా? ఊహూ!'

ఇంతలో ...

ఓ గజ్జికుక్క కుంటుకుంటూ కుయ్యోమంటూ లోపలికి వచ్చి కాంతమ్మ కాళ్ళదగ్గర కూర్చుంది. దాని ఒంటినిండా గజ్జే! ఎవరో రాయివేసి గాయపరచినట్లున్నారు. అందుకే కుంటుతూ వచ్చింది. గజ్జికూడా రేగినట్లుంది. రక్తం వస్తోంది.

ఈ కుక్కనే చాలా చిన్నపిల్లగా ఉన్నప్పుడు తెచ్చాడు అబ్బాయి. ''నా స్నేహితుడి కుక్కకి పుట్టింది. ముద్దుగా ఉందికనక తెచ్చాను'' అన్నాడు.

'తన మడికి ఆటంకం అవుతుందేమో' అని తాను తెగ భయపడింది. కానీ పాపం మూడ్ కనిపెట్టి దగ్గరికి వచ్చేది. మానస, మానుష్‌లకైతే అది ప్రాణం అయిపోయింది. ఇద్దరూ పోటీలు పడి దానికి తిండి పెట్టేవారు. దానితో బాగా ఆడేవారు. అది పుస్తకాలు, చెప్పులు లాంటి తెచ్చివ్వడం కూడా చేసేది.

తర్వాత అది ముసలిదైపోయింది. మునపటిలాగ గెంతక మగతగా పడుకుంటోంది కనక పిల్లలు దాన్ని పట్టించుకోవడం మానేసారు.

'ఇది చస్తుందేమో ఇక్కడే' అన్న అనుమానం కలిగి దాన్ని తరిమేసారు. అది వచ్చినా రానివ్వరు. తాను జాలేసి అన్నంముద్ద పడేయబోయినా తిట్టిపోస్తారు.

బయట కుక్కలతో తిరగడంవల్ల దానికి గజ్జి అంటి ఇంకా అధ్వాన్నంగా తయారైంది.

ఇప్పటికీ తనని పెంచిన వారింటిమీద మమకారం ఉన్నట్లుంది. అందుకే తనకే గాయం తగిలినా, ఒంటికే బాధ కలిగినా 'కుయ్యో' అంటూ వస్తుంది తల్లికి చెప్పుకోడానికి వచ్చే చిన్నపిల్లలాగ! ఇప్పుడూ అలాగే వచ్చినట్లుంది.

కుక్క అరుపు వినిపించికాబోలు తలుపు తీసాడు దినకర్. ''ఛీఛీ మళ్ళీ వచ్చింది పాడుకుక్క'' అంటూ రాయితో ఓ దెబ్బ వేసాడు. ఇందాకటి దానిమీదే మళ్ళీ తగిలిందేమో కుక్క గట్టిగా ఏడుస్తూ కుంటుతూ బయటకి వెళ్ళిపోయింది.

''నువ్వెప్పుడు వచ్చావమ్మా...?'' అంటూ ఏదో అడుగుతున్నాడు దినకర్.


ఆవిడకి వినిపించలేదు. ఆవిడ చెవులకి కుక్క ఏడుపే వినిపిస్తోంది. ఆవిడ కళ్ళకి అది కుంటు కుంటూ వెళ్ళడమే కనబడుతోంది.


ముసలివైపోయిన జంతువులని తరిమికొట్టినట్లుగా కాక ముసలివారైపోయిన మానవులని కొద్దోగొప్పో ఆదరిస్తున్నారు. నోటికి హితవైనదే పెట్టకపోయినా కడుపు నిండేలాగ పెడుతున్నారు. కోరికలు తీర్చకపోయినా కొట్టడంలేదు.

పశువులను కటికవాళ్ళపాలు చేసిన విషయంల ముందు ఇది గొప్ప విషయమే కదా!

ఆవిడకి జ్ఞానోదయం చేసిన కుక్క అరుపు హృదయవిదారకంగా వినబడుతూనే ఉంది. 'మానవుడు వృద్ధ జంతువులపట్ల చూపుతున్న అమానుషత్వాన్ని తెలియజేస్తూ వృద్ధ జంతువులకంటె మీరు నయంకాదా అని ప్రశ్నిస్తోంది తనకి తెలిసిన భాషలో తనకి తెలిసిన రీతిలో!'

అది వింటూ అచేతనంగా కూర్చుండిపోయింది కాంతమ్మ.





కేవలం ఒక్క డెట్ బిళ్లలోనే వుంది సాల్వెంట్ పవర్

బట్టలను అన్నిటికంటే ఎక్కువ తెల్లగా ఉతుకుట కొరకు



Shilpi DM/31 A/81 Tel

మరే ఇతర డిటర్జెంట్ బార్ లేక బిళ్ల దీనికి సాటి రాదు

పెద్దకథ

త్రాణికని స్వప్నం

కోమలాదేవి

(గత సంచిక తరువాయి)

అడుగుల సవ్వడికి ఇరువురు ఎడమయ్యారు. ఆమె ముందుకు వెళ్ళి లైట్ వేసింది.

గదిలోకి ఎవ్వరు రాలేదు.

మాధవ్ కూడ ముందుకు వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు. ఆమె దూరంగా ఒక స్టూల్‌మీద కూర్చున్నది.

"నీ మాటలన్నీ తు–చ– తప్పకుండా చేశాను. మరి నువ్వు నా మాట వినాలి."

"అట్లాగే..." అంది.

"ఇట్లా వచ్చి కూర్చో. నేను చెప్పేది శ్రద్ధగా విను..."

అమల రాలేదు...

"అమలా..." అన్నాడు ఎంతో మృదువుగా. ఆ పిలుపులోని అనురాగానికి ఆమె హృదయం పురివిప్పి నాట్యం చేసింది.

"ఊ... ఈ హృదయం ఈ ఆనందాన్ని పట్టలేకపోతోంది."

"ఔను... నాక్కూడ అలాగే ఉంది...అందుకే త్వరగా రా... విను."

అమల వచ్చి ఆతడికి దగ్గరగా కూర్చున్నది.

"మీరు నన్ను ప్రేమించగలరని కలలోకూడ అనుకోలేదు. అందుకే షాక్ – ఆ తరువాత తన్మయత్వం."

"ఔను... నేనుకూడ అనుకోలేదు. కాని బాహ్య సౌందర్యంలో ఏమీ లేదనుకోగానే ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి." ఆమె చేతిని అందుకుని గట్టిగ పట్టుకున్నాడు.

"నేను చెప్పే విషయాలకు చిన్నబోకు. మా ఆర్థిక ఇబ్బందుల్ని – అప్పులను గూర్చి నువ్వెంత గంభీరంగా మాట్లాడావు? నన్ను అవమానించాలని ప్రయత్నించలేదు. అలాగే నేను మాట్లాడే విషయాన్ని నీ మేథ్స్ బుర్రతో సరైన కోణంలో ఆలోచించాలి. సరేనా ?"

"ఉ" అంది – "ఏమిటో అది –" అన్న ఉత్సుకతతో.

"అమలా... నువ్వు ఇంతవరకు... అందంగా కనబడాలని ప్రయత్నం చేయలేదా ?"

అమల కిలకిల నవ్వింది. ఆమె నవ్వు వినటం అదే ప్రథమం. కల్మషం లేకుండ హాయిగా నవ్విన నవ్వు అది.

"బలే ప్రశ్న ! కనుబొమ క్రిందనుండి పూర్తి చెక్కిలిని కప్పే ఈ మచ్చతో అందంగా ఉండాలని ఎట్లా ప్రయత్నించను ? నవ్వరూ ?" ఆ మాత్రం తెలీదా ? అన్న ధోరణిలో అంది.

"మచ్చ సంగతి కాదు. రేపు... అంటే రేపే... ఆ డెంటిస్ట్ దగ్గరకు వెళ్ళి ఆ పన్ను సంగతి చూడు."

"వాడికేం లాగిపారేస్తాడు. మిగిలేది మరో అవకరం – తొర్రి" అమల మళ్ళీ నవ్వింది.

"వాళ్లే... నన్ను ఫూల్ చెయ్యాలనా ? వేరే పన్ను పెట్టేస్తాడు... ఏం ?"

అమల తన మూతిని తలంచుకుంది. అట్లా చేస్తే నవ్వితే ఆ పన్ను కనబడదు. ఊరకున్నప్పుడు మూతి అసహ్యంగా ఉండదు. బాగానే ఉందనుకున్నది.

"సరే" అంది ఉత్సాహంగా.

"బ్యూటీ పార్లర్‌కు వెళ్ళి నుదుటిని కప్పుతూ పెరిగిన వెంట్రుకల్ని తీయించేసుకో, మామూలుగ అంతా చేయించుకుంటారట... సరేనా ?"

"సరే" అంది నవ్వుతూ.

"ఇక మూడవది... అమలా నాకోసం నువ్వు భరించాలి... బాధ, వ్యయప్రయాసలతో కూడిన పని... ప్లాస్టిక్ సర్జన్ దగ్గర నీ ముక్కు సరిచేయించుకోవాలి."

"మీ ముక్కుతో సరితూగాలన్న మాట" రహస్యంగా అన్నలా అంది.

"ఔను మరి" అన్నాడు.

అమల చేయి ఉన్నట్టుండి శక్తిలేనట్లు 'లింప్' అయిపోయింది.

"ఏమిటి అమలా" ఆందోళనతో అడిగాడు.

"మీ పిచ్చి... ఇంత చేసినా చూడటానికి బావుండను కదా..." అంది దిగులుగ.

"ఉండకపోతే ఫరవాలేదు. నాకు బాగానే ఉంటావు... అమాలా... ఒక్కటి చెప్పు... ఇందాక నిన్ను అనురాగంతో– ఆవేశంతో ముద్దు పెట్టుకున్నాను. దానిలో నటన కనబడిందా ? నీ హృదయాన్ని అడిగి చూడు" అన్నాడు ఆర్తితో.

జవాబుగా అమల చేయి సన్నగా కంపించింది.

"మరి వెళ్లొస్తాను."

మాధవ్ ఆమె ముఖాన్ని తన రెండుచేతుల్లోకి తీసుకున్నాడు. ఆమె చెక్కిళ్లపై తడికి ఆతడిచేతులు తడిచిపోయాయి. అదురుతున్న ఆమె అదరాలపై క్షణకాలం తన పెదిమలు నిల్పాడు. ఆ తరువాత తన కుడి చెక్కిలితో ఆమె కుడి చెక్కిలి రాశాడు.

"వస్తాను" అని బైటకెళ్లిపోయాడు.

మాధవ్ కోసం వాళ్లిద్దరు ఎదురు చూస్తున్నారు.

మాధవ్ వచ్చి వాళ్ల ఎదురుగ కూర్చున్నాడు.

"అమల నడిగాను. ఒప్పుకుంది."

రాజేంద్రప్రసాద్ కవరు మాధవ్ కిచ్చాడు.

పెళ్లికోసం పెట్టుకున్న అర్జీ అది.

"ఐతే పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు?" అడుగుతూ–

రాజేంద్రప్రసాద్ బిగ్గరగా నవ్వాడు, "అమల పెళ్లి ఇట్లా అవుతుందనుకోలేదు. చాలా గ్రాండ్‌గా చెయ్యాలనుకున్నాము. మీ నాన్నగారి కోరిక కూడ అదే."

"అంత డబ్బు వేస్ట్. దాని అవసరం ఎంతైనా ఉంది. అమల మీకు చెబుతుంది" అని లేచాడు.

"మరి డబ్బు ఎప్పుడు తీసుకుంటావ్ మాధవ్ ?" ఆయన కూర్చో అని చేతో సైగ జేస్తూ అడిగాడు. మాధవ్ కూర్చున్నాడు.

"మా నాన్నగారు ఎంత డబ్బు అడిగారు ?" మాధవ్ తల వంచుకుని మెల్లగా అడిగాడు.

ఆయనకు నవ్వు వచ్చింది. డబ్బు ఎవ్వరికి చేదుకాదు. మాధవ్‌కు కూడా కాదు అనుకున్నాడు.

"మీ నాన్నగార్ని అడగలేదా ?"

"అడగాలనుకున్నాను– కాని ఈ ప్రస్తావన తెచ్చారు కాబట్టి మీరే చెప్పండి."

"మూడు లక్షలు– కారు."

మాధవ్ ఆశ్చర్యాన్ని కప్పిపుచ్చుకొంటూ నవ్వాడు. హాయిగా నవ్వాడు.

"మీరంతా కలసి నాకు బాగానే విలువ కట్టారు. థాంక్స్..." ఆతడి ముఖం సీరియస్‌గా ఆయింది.

రాజేంద్రప్రసాద్– అతడి భార్య కొస్త భయంతో చూచారు. కూతురి మెడలో ఆ మూడు ముళ్లు పడేవరకు వీళ్ల వాళ్ల అడిగినదానికి సరే అనాలి– అంతే... ఇంకా ఇవ్వగలరు. కాని ఈ ఆశకు అంతం ఎప్పుడు !

"అమల కోసం చాల ఖర్చు చేయవలసి వస్తుంది" అంటూ లేచాడు.

"చెప్పు– వింటాను" అన్నట్లు చూస్తున్నాడు రాజేంద్రప్రసాద్.

"ఇప్పుడు తీసుకున్నది చాలును. ఇక ఏమీవద్దు– కాని ఒకటి చెయ్యాలి మీరు"

ఏమిటన్నట్లు మానుపడి చూస్తున్న అత్త మామగార్ల వైపు చూచి నవ్వాడు.

"పాపం డ్రైవర్ కూతురి పెళ్ళి మాత్రం మామూలుగ జరిపించండి" అని వెళ్ళిపోయాడు.

మరి కాసేపటికి కారు వెళ్ళిపోతున్న శబ్దం విన వచ్చింది. ఆతడు హఠాత్తుగా వెళ్ళటం – వాళ్ళ ఆశ్చర్యం నుండి తీరుకోవటం అయ్యాక అమల వచ్చి అన్ని సంగతులు చెప్పింది. చాలసేపు మౌనంగా కూర్చున్నారు.

చివరికి తల్లి అంది "ఆ తండ్రికి చాల షాకింగ్‌గా ఉంటుంది. ఇన్ని లక్షలు అతను ఒద్దు అన్నందుకు, పోనీ కొంత డబ్బు రహస్యంగా ఇద్దామా ?"

అమల ఒద్దన్నట్లు తలాడించింది "మాధవ్

ఆశయం వేరు. ఈ విషయం తెలిసిందంటే నన్ను ఎన్నటికి క్షమించరు" అంది దృఢంగా.

"ఐతే... ఒక పని చెయ్యి... వారి అవసరాన్ని కనిపెట్టి న్యాయమని తోచినప్పుడు నీకుగా నీవు వారికి సహాయం చెయ్యి, మాధవ్ నీ చర్యను హర్షిస్తాడు."

అమల లోపలికి వెళ్ళిపోయింది. తన గదిలో అన్ని లైట్లు వెలుగుతున్నాయి.

అమోఘమైన ఆనందంతో ఆమె అణువణువు నాట్యం చేస్తోంది.

తండ్రి తల్లి అత్తమామల సమక్షంలో మాధవ్ అమలను పెళ్ళి చేసుకున్నాడు.

ఆ సాయంత్రం అమల — ఆమె తల్లి బొంబాయికి వెళ్ళిపోయారు.

నెల రోజులు అందరికి అవిరామంగ గడిచిపోయింది. ఇంట్లోవారికి మాధవ్ శత్రువైపోయాడు. ఒక్కరు కూడా మనసారా పలుకరించటం లేదు. అరచేతిలో ఉన్న ఆనందాన్ని కర్కశంగా లాగివేసిన క్రూరుడిలా చూస్తోంది కుసుమ. కొడుకు మారిపోయి పెత్తనం తన చేతుల్లోకి తీసుకుని నయాపైసా తనకు ఇవ్వలేదని ఆ తండ్రి బాధ. మాధవ్ డబ్బు తీసుకోలేదని అతడికి తెలియదు. ఆడపిల్లలకు చిన్న బహుమతి కూడ ఇవ్వకుండా పెళ్ళి జరిపేసుకున్నారు.

కాని ఎక్కడో మారుమూల హృదయంలో మాధవ్ అమలను చేసుకున్నందుకు జాలిపడ్డారు. కాని ఆ మూలను విడిచి ఆ భావం బైటికి రాకుండా తలుపులు బిగించివేశారు.

రాజేంద్రప్రసాద్ మాధవ్‌లు ఇల్లు అద్దెకు తీసుకున్నారు. దాన్ని వస్తువులతో అమర్చాలనుకున్నారు. కాని మాధవ్ ఒద్దన్నాడు. "అమలకు ఇష్టమైనట్లు అమర్చుకోనివ్వండి. ఏది కావాలో తనే నిర్ణయించుకుంటుంది."

ఆయన ఆ మాటలకు పొంగిపోయాడు.

బొంబాయి నుండి తరచు ఉత్తరాలు వచ్చేవి.

ఏదో ఒకటి తేల్చుకోవాలనుకున్నాడు తండ్రి.


"నీ భార్య రాగానే వేరే వెళ్ళిపోతావు. ఇల్లు కూడ తయారుగ తీసిపెట్టాడు నీ మామ. మరి కుసుమ పెళ్ళి మాట ఏంచేశావు? ఒక్క పది వేలుంటే అయిపోతుంది."

మాధవ్ తండ్రివైపు జాలిగా చూచాడు. నాన్నా "నేను డెబ్బైవేలు తీసుకుని అన్నీ చేశాను. అంత చాలుననుకున్నాను. నేనేం తీసుకోలేదు. ఒద్దన్నాను."


గోపాల్రావుకు గుండె ఆగినంత పనైంది.

"లక్షలను వద్దన్నావురా?" గర్జించాడాయన.

కొడుకును 'రా' అని సంవత్సరాలు దాటిపోయాయి. మాధవ్ అతికష్టంతో కోపాన్ని అణచుకున్నాడు. "నాన్నా—నేను ఎంతో మాట్లాడగలను—మిమ్మల్ని ఎన్నో అనరాని మాటలు అనగలను. మీరు నా విషయంలో చేసిన తప్పులన్నీ ఎత్తి చూపగలను. కాని అవన్నీ మీకు తెలుసును. నేను చెప్పక్కర్లేదు. మన ఆర్థిక ఇబ్బందులు తీరాలనుకున్నాం—అందరు సంతోషంగా ఉండి నేను అనామకుడినైపోయినా ఫరవాలేదనుకున్నాను. కాని మన తాహతుకు మించిన కోరికలతో నన్ను ... చులకనచేసి బేరం పెట్టి







అమ్మారు. నా అందాన్ని చూపి మూడు లక్షలు అడిగారా! అందమైన ఆడపిల్లను 'అందు' కోసం అమ్మే తలిదండ్రులు నయం. నేను అంగీకరించానని, డబ్బు విషయంలో జోక్యం కల్గించుకోలేదని మీరు అత్యాశకు పోయారు. నాకు జ్ఞానోదయం కాక పోయినట్లయితే నేనెంత అధోగతి పాలై ఉండునో! నేను నా భార్య పూచికపుల్లల్లా పడి ఉండేవాళ్ళం. నేను, డెభ్భై వేలు కట్నం తీసుకున్నాననుకోండి. తృప్తిగా ఉంటుంది."

మాధవ్ అక్కడనుండి వెళ్ళిపోటానికి లేచాడు.

"వాణ్ణి చదివించటానికి డబ్బు?" విసిరినట్లు మాటలు ఊడిపడ్డాయి తండ్రి నోటినుండి.

"ఇంకా చదివించటం ఏమిటి నాన్నా! బి.కాం. ఫైనల్ పై నెలలో రాస్తున్నాడుగా. వెంటనే ఉద్యోగ ప్రయత్నం చేస్తే సరి."

"వాడు ఎం. కాం. చదవాలనుకుంటున్నాడు."

"చదవమనండి. దానికేం?"

"మరి డబ్బు?"

"డబ్బుకేం తక్కువ? వాడికికూడ మరో అమల లాంటి పిల్లను తెచ్చి చేస్తే పోతుంది. ఎం. కాం. స్కూటర్ కాదు — పి. ఎచ్. డి. కారు కూడ వస్తాయి. మీరు అందరికీ ఇలాంటి ఆశలు కల్పిస్తారని నేను కల్లోకూడ అనుకోలేదు.

"మరి సుమలత!"

మాధవ్ తల పట్టుకుని కూర్చున్నాడు. "నేను ఎక్కడికో పరాయి దూర దేశానికి వెళ్తున్నట్లు మాట్లాడుతున్నారెందుకు? నేను ఇక్కడే ఉంటాను. మిమ్మల్ని ఒదిలి పారిపోయేటంత కఠినుడ్ని కాను... కాకపోతే మీరంతా నామీద కత్తికట్టినట్లు వ్యవహరిస్తుంటే బాధపడుతున్నాను..."

గోపాలరావు మరి మాట్లాడలేదు.

"లంచం బెట్టి ఉద్యోగం తెప్పించేద్దాం. దాని అప్పు తీర్చుకుంటాడు." అని వెళ్ళిపోయాడు.

ఎంత సర్దిచెప్పుకున్నా అతడికి మాధవ్ నేరస్థుడిలాగానే కనిపించాడు. వాడిదే తప్పు. మొదట తనకు స్వేచ్ఛనిచ్చాడు. అందుకే తన ఆశకు అంతం లేకుండాపోయింది. ఆనాడే ఆరాలుతీసి ఉంటే తను ఇన్ని కోర్కెలతో సతమతమవకపోయేవాడుకాదు. కాని, ముందునుండి అతడు ఒకే కోణంలో ఆలోచించాడు—

తొణకని స్వప్నం

మాధవ్‌ను అన్నింటికి దూరంగా ఉంచాలనే అతడి అభిమతం. కాని... కథ అడ్డం తిరిగింది.

ఆ రాత్రి సుమలత అన్నను దెప్పిపొడిచింది.

"మహా వైభవంగా పెళ్ళి చేస్తానని మాట ఇచ్చాడట మీ మామ. పెళ్ళిలో పెళ్ళికొడుకు చెల్లెండ్రలా సరదాగా దర్జాగా తిరగటానికికూడ వీల్లేకుండా చేశావు."

చెల్లివైపు రెప్పవాల్చకుండా చూచాడు. ఆ తరువాత మెల్లగా అన్నాడు "ఏ ఆవకరం లేని వాళ్ళతో, ఐశ్వర్యవంతులతో ఆ పెళ్లి ఇల్లు సందడిస్తుంది. వాళ్ళంతా పైకి ఏమీ అనకపోయినా మనసులో— చాటుగా అనుకుంటారు... వాళ్ళు విమర్శించని విషయం ఒక్కటి ఉండదు. ముఖ్యంగా ఎవరివల్ల మనకీ సమస్యలు తీరాయో— ఆ విశాల ఉన్నత హృదయం గాయపడకూడదనే నేను ఇట్లా పెళ్లిచేసుకున్నాను. అమల వచ్చిన తరువాత మీకు తప్పక బహుమతులు తెస్తుంది" ఆ తరువాత ఇంకేం మాట్లాడటానికి ఎవ్వరు సాహసించలేదు.

ఆ రోజు మాధవ్ అత్యంత ఉత్సాహంగా ఇంటి కొచ్చాడు. సూట్‌కేస్‌లో బట్టలు సర్దుకుని తలి

తాగుడు అనర్థం!

తాగుడు, నిద్రమాత్రల వలన కాలేయం చెడిపోయి కామెర్ల వ్యాధి రాగలదని పశ్చిమ జర్మనీ వైద్యులు హెచ్చరించారు. నిద్ర మాత్రలలోని వివిధ రసాయనాలను విభజించ టానికి వీలు లేకపోవడం వలన పచ్చకామెర్లకు దారి తీస్తుంది. రోజుకు 0.7 లీటర్ల సారాయి, 2 లీటర్ల బీరు చొప్పున రెండు సంవత్సరాలు తీసుకుంటే కాలేయం పాడై పోవడం తథ్యమని వీరు హెచ్చరించారు. ఆ తరువాత కూడా దీనిని కొనసాగినిస్తే, మరో రెండు లేక మూడు సంవత్సరాలలో మృత్యువు తప్పదని కూడ వీరు హెచ్చరించారు. ఏ దశలో నైనా తాగుడు మానితే, కాలేయం సర్దుకుని ఆరోగ్యం బాగు పడేందుకు అవకాశమున్నదని వీరు తెలియచేశారు.

దండ్రులకు చెప్పాడు. "పది రోజులు సెలవు పెట్టాను. అమలను బొంబాయినుండి తీసుకుని రావాలి."

కొడుకు అంత ఆత్రంగా ఆనందంగా పరుగులు పెట్టటం వాళ్ళకు బాధకరంగా ఉన్నా "వెళ్లిరా" అని హృదయపూర్వకంగా అన్నట్లు నటించారు.

కొడుకును గుమ్మం దాటనిచ్చి... "ఇది నాకు అర్థం కావటంలేదు. ఆ పిల్ల అంటే మాధవ్‌కు అంత ఇష్టం— ప్రేమ ఎలా పుట్టుకొచ్చాయో!" అంది తల్లి.

ఆయన అపహాస్యం చేస్తున్నట్లు నవ్వాడు "అందుకే ప్రేమ గ్రుడ్డిదన్నారు" అన్నాడు.

హోటల్ గదిలో అమల డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూర్చుని తన ప్రతిబింబాన్ని చూచు కుంటోంది. టేబుల్‌మీద మాధవ్ వస్తున్నట్లు పంపిన టెలిగ్రాం ఉంది. ఆమె ఆనందం పరిపూర్ణత చెంది ఉంది.

"ఈ ఆలోచన మనకు ముందరే ఎందుకు రాలేదో!" అంది తల్లి, ప్లాస్టిక్ సర్జరీని తలంచుకుని.

"నాకు వచ్చింది... కాని... ఎంత చేసుకున్నా ఫలితం అంతే అన్న నిస్పృహ ఉండేది."

అమల నవ్వింది. పలువరస ముత్యాల్లా మెరవక పోయినా వరుసగా ఉండి చూడటానికి అసహ్యంగా లేదు. నుదురు తడుముకున్నది... పాలభాగంలో అనవసరమైన నూగులేదు— విశాలంగా ఉంది. ఎఱ్ఱటి బొట్టు దివ్యంగా మెరుస్తోంది.

ఆమె ముక్కుని మునివేళ్ళతో సవరించుకుంది. పొట్టిగా ఉండి పరచుకున్నట్లున్న ముక్కు ఎత్తుగా తిన్నగా ఉంది! మాధవ్ ముక్కుతో పోటీపడి నిలువ లేదు. చూడటానికి సంపంగి మొగ్గలా లేకపోయినా మామూలుగా బాగానే ఉంది. ప్రక్కకు తిరిగింది — రవ్వపుడక తళుక్కుమంది.

అప్రయత్నంగా ఆమె చేయి చెక్కిలిని తడుము కున్నది... మచ్చ అట్లాగే ఉంది. దాన్ని కూడా ప్లాస్టిక్ సర్జరీతో, చర్మము అంటించి చికిత్స చేయ వచ్చు. దానికి సమయం కావాలి... తను ఆగలేదు... మాధవ్‌ను చూడాలి. తామిరువురు భార్యా భర్తల్లా కొన్నాళ్ళుండాలి. ఈ మచ్చ ఉన్నప్పుడే అతడి ప్రేమ ఉన్నత శిఖరాన్ని అందుకుంటే ఆ అనుభవం చాలు... తన అణువు అణువు మాధవ్ పేరు ఉచ్చరిస్తూంది.


ఉచితం!
ప్రతి ఇమామీ వ్యానిషింగ్ క్రీముతో*
అందమైన తల పిన్నుల జత
ఇమామీ అమన్
ఇమామీ అమన్
ఈ వ్యానిషింగ్ క్రీం ఆమెకు
చక్కదనాన్నిచ్చింది కనుక
ఆమె తన పేరును
క్రీముకు ఇచ్చింది.
మిసమిసలాడే చర్మ సౌందర్యం.
లక్షలాది జనులు ఆరాధించి
ఆకాంక్షించే మృదుత్వమూ,
అందమూ, ఆ రహస్యం ఇప్పుడు
మీకూ తెలుసు. ఇమామీ ఒక
తార చర్మ సౌందర్య రక్షణ
మార్గం-మీది కూడా.
త్వరపడండి!
ఈ అవకాశం
కొద్దిరోజులు
మాత్రమే.
*40 గ్రా లేదా
80 గ్రాంల ప్యాక్
emami*
Fresh and Fragrant
VANISHING CREAM
ఇమామి
వ్యానిషింగ్ క్రీమ్
ఇమామి అంటే ఇటాలియన్‌లో "నన్ను ప్రేమించు" అని
సౌందర్యానికి ఆది వాగ్దానం.
★ ఆయా ప్రాంతాలకు తగినట్లుగా అందమైన,
ఆకర్షణీయమైన డిజైనులలో క్లిప్పులు.
★ ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడులలో మాత్రమే.
E/VC/CAS-182 TEL

ఆమె తనువు మనసును మాధవ్ ఆక్రమించుకుని ఉన్నాడు.

అంధకారంలో ముళ్ళలో నడిచిన ఆమె పూల బాటలో స్వచ్ఛమైన వెలుగులో పయనించబోతోంది.

భర్త రాకకోసం ఆమె వేయి కళ్ళతో ఎదురు చూస్తోంది. రాజేంద్రప్రసాద్ స్వయంగా వెళ్ళి అల్లుణ్ణి ప్లేన్ ఎక్కించి వచ్చాడు. ఒక అల్లుణ్ణి — ఎవరైనా సరే తెచ్చుకోవాలనుకున్నారు. కాని మాధవ్ లాంటి మంచి మనసున్న అందమైన యువకుడు అమలకు దొరుకుతాడని ఆయన కలలో కూడ అనుకోలేదు.

గగనంలో ఎగురుతున్నవిమానం వైపు చూచి తృప్తిగా హృదయం నిండుగా ఆనందాన్ని నింపుకున్నాడు.

మేఘమాలికల పరుపు పైన తేలిపోతోంది విమానం. వెనక్కి ఆనుకొని కళ్ళు మూసుకున్నాడు. తన స్వప్న సుందరి మనోఫలకంపై రూపు దిద్దుకుంటోంది. నల్లటి మేఘాలను మంచు తెరలనూ తొలగించుకుంటూ స్పష్టమౌతున్న ఆ ఆకారం తనకెంతో సంతృప్తికరంగా ఉంది. ఓ చిన్న మబ్బుతునక ఆమె ముఖం మీద తారట్లాడుతోంది—ఇంకా! ఆమె విశాలమైన ఫాలభాగం మీద ఎర్రని బొట్టు, ముచ్చటైన ముక్కుకున్న చిన్న వజ్రం ముక్కుపుడక తళుకులీనుతుంటే ఆమె పెదిమలపై దరహాస రేఖ నాట్యం చేస్తుంటే శ్రావ్యమైన కంఠం ఎత్తి ఓ మధురమైన ప్రేమ గీతికతను ఆలాపిస్తూ తనను సమీపిస్తోంది...! మాధవ్ హృదయం స్పందించింది. ఆమెను అమాంతంగా పొదివి పట్టుకుని ఆ ముక్కుకు తన ముక్కు రాస్తూ ఎన్నో తీపి తీపి కవనాలు చెబుతున్నాడు. ఆ కబుర్లకు అంతే లేదు!

హోటల్ చేరిన వెంటనే లిఫ్ట్‌లో అమల ఉన్న అంతస్థుకు వెళ్ళాడు.

మెల్లగా తలుపుమీద తట్టాడు.

"ఎవరూ ?" అంటూ అమల వచ్చి తలుపు తీసింది.

మాధవ్ "అమలా" అంటూ ఆనందావేశాలతో ఆమెను తన బాహువుల్లో బంధించాడు.

ఆమె మారిన రూపును తన్మయత్వంలో అవలోకిస్తున్నాడు.

అమల నవ్వింది. "అయినా...బాగాలేనా ..." అంది.

"నో ... నో ..." అంటూ తన ముక్కు ఆమె ముక్కుకు రాశాడు.

"నేనొక కలగన్నాను" అన్నాడు ఆమెను గాఢంగా చుంబించి, కాస్త దూరంగా ఉండేట్లు నిలిపి ఆమె భుజాలమీద చేతులుంచి ఆమె ముక్కుకేసి చూస్తూ.

"మీ డాక్టర్ — ఈ ముక్కుకు అప్పుడే ఒక వజ్రపు తునకను పెట్టేశాడే! నా స్వప్నంలో — నా సుందరికి ఇలాగే ఉన్నది" అన్నాడు చిలిపిగ నవ్వుతూ.

"మీ స్వప్నం తొణక కూడదని అలాచేసి ఉంటాడు ."

"ఔను ... నా స్వప్నం తొణకలేదు. ఒకప్పుడు నా మనఃఫలకంపై ధూళి ఉండి కనిపించినదే యదార్థమైన అందం అనుకున్నాను. సృష్టిలోని అందాన్ని గ్రహించటానికి మంచి మనసు, హృదయ పూర్వకమైన త్యాగశీలత, నిస్వార్థమైన తలపులు ముఖ్యమని నాకు నేర్పావు. నా మనోచక్షువులు హృదయ సౌందర్యాన్ని గ్రహించలేకపోయాయి. నా జీవితంలో వసంతమే లేదనుకున్న నాకు రాగ రంజిత వసంతమే నా హృదయంలో నిల్చిపోయేలా చేశావు. బాధ్యతల నుండి పారిపోయి జీవితాంతం—నేను త్యాగం చేశాను — అని గొప్పగా అనుకుంటూ — కుమిలిపోతూ మన ఇరువురి జీవితాల్ని అంధకారం చేయాలనుకున్న నన్ను వెలుగుబాటలోకి నడిపించావు మరబొమ్మలా ఉన్న నన్ను మానవుడిగా ఆలోచింపజేశావు ... అందుకే అమలా మనకు చాల బాధ్యతలున్నాయి. ఈనాటి నుండి నా జీవితంలో ప్రవేశించి నా కష్టాలలో — నా సమస్యలలో—నా బాధ్యతల్లో— నా ఆనందంలో ... "

ఆమె చటుక్కున అంది "అర్థాంగిగా ఉంటాను"

"ఔ"నని తల ఊపుతూ పారవశ్యంతో సంతృప్తిగా ఆమెను తన హృదయంలోకి తీసుకున్నాడు.

"అమలా సరైన భాగస్వామి దొరకలేదని బాధపడ్డాను. ఆనందానురాగాలకు నిలయమై వివాహం అనేది విజయవంతం కావాలంటే సరైన భాగస్వామిని వెదుక్కోవటంతో కాదు — కాని సరైన భాగస్వామిగా ఉండటం ముఖ్యమని గ్రహించాను."

"ఔను" అన్నట్లు ఆమె ముఖం ఎత్తి అతడి కళ్ళలోకి ఆరాధనగా చూచింది.

ఆమె వజ్రపు ముక్కుపుడక దేదీప్యమానమైన సప్త వర్ణ కాంతిపుంజాల్ని వెదజల్లింది.

[అ యి పో యి ం ది]

తల్లి పాలలాంటిది మరొకటి లేదిక... !



మీ పాప, పుట్టిన 6 గంటల తర్వాత మీ నుంచి 'నివారక ఆహారం' పొందుతుంది. దాన్ని యిచ్చేది మీరే యుగయుగాలుగా తల్లి యొక్క స్వాభావిక సంస్కారం యిది.

తల్లి పాలు ప్రకృతి యిచ్చే మహత్వ పూర్ణమైన వరం!

ఎందుకంటే పాప పుట్టుకతోనే తల్లి స్తనాలలో పాలు వస్తాయి. మరి వాటిలో ప్రాకృతికమైన రూపంలో "రోగ నిరోధక ద్రవ్యాలు" ఉంటాయి. దాంతో, అప్పుడే పుట్టిన పాపయొక్క ఆమాశయం, పేగుల్లోనివీ, యితర వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుంది. అందుకే స్తన్యపానానికి అంత ప్రాముఖ్యత యివ్వబడింది.

స్వాభావికమైన పోషణ

శరీర నిర్మాణం కోసం ప్రకృతి లోని ప్రోటీన్లు, శక్తినిచ్చే కార్బోహైడ్రేట్లూ, ఆరోగ్యాన్ని కాపాడే విటమిన్లూ సరియైన మోతాదులో ఉండి, తల్లి పాలను సరిగ్గా సంతులితంగా కూడా తయారుచేస్తాయి— అప్పుడే పుటిన పాపకది సరియైన పోషణనిచ్చే ఆదర్శమైన ఆహారం అవడం కోసం. (ఉదాహరణకి, స్తన్యపానం చేసే పాపలకు విటమిన్ సి లోటువలన వచ్చే స్కర్వీ వ్యాధి రాదు సాధారణంగా) మరి తల్లి పాలు తాగిన పాప ఎలా ఎదిగి, పెరుగుతాడో చూడండి! ఇక మీరు మీ పాపను గుండెలకి హత్తుకుని పాలిస్తూంటే ఎంత ఆనందాన్ని పొందుతారని! మరి ఆ పసికందు యింత పెద్ద లోకంలో కేవలం మీ మమతను పొంది ఎంత సురక్షితంగా వున్నట్టి అనుభవాన్ని పొందుతాడని!

ప్రపంచమంతా ప్రచలితం

ఇప్పుడు రోజుకి రోజూ, ప్రపంచమంతటా ఎక్కువ మంది తల్లులు, అంటే పశ్చిమ దేశాలలో సహితం, తల్లులు తమ పాలే యివ్వడం మొదలెట్టారు. ఎందుకంటే, తల్లి పాలలోని అమూల్య పోషక తత్వాల మహత్తర లక్షణాన్ని మళ్ళా అవగాహన చేసుకోవడం మొదలెట్టారు.

తప్పకపోతే

మరి మీ లేగనక యిక ఏ కారణం వల్లనైనా తప్పకపోతే, మీ పాపకు మీ పాలు యివ్వలేకపోతే—అంటే మీ ఆరోగ్యం సరిగా లేకనో, లేదా మీలో, సరిపడినన్ని పాలు పడకో, అలా జరిగినప్పుడేం చెయ్యాలి మీరు?

అటువంటి సందర్భంలో మీరు ఎంతో జాగ్రత్తగా ఉండవలసి వస్తుంది, ఎంతో ఆలోచించిన మీదట. ఎటువంటి ఎటువంటి ఆహారం యివ్వాలంటే, ఆ యిచ్చేది తల్లి పాల తర్వాత అన్నింటికన్నా ఉత్తమమైనదిగా ఎంచుకునేదాన్ని.

స్ప్రే డ్రయిడ్ అమూల్ స్ప్రే

అమూల్‌స్ప్రే, పుష్టినిచ్చే దృష్టితో చూస్తే మహత్తరంగా సంతులితమైన ఆహారం. ఎందుకంటే దీన్లో చాలా ఎక్కువైన తీరులో ప్రోటీన్లు, దాంతోబాటే, తేలికగా అరగగలిగే కార్బోహైడ్రేట్లు. సరియైన సంతులిత రూపంలో అత్యావశ్యకమైన విటమిన్లూ, ఖనిజ పదార్థాలూ ఉన్నాయి. ఇది, అంతకు ముందే మరగ బెట్టిన నీటిలో టక్కున కరిగి పోతుంది. మొదటిగానే పేస్ట్‌లా తయారు చేయవలసిన అవసరం ఉండదు.

పొదుపు

అమూల్ స్ప్రే, డబ్బాలలో దొరికే శిశు ఆహారాలన్నిటికన్న పొదుపైనది. ఎందుకంటే యిది ఆధునికమైన పాల సంఘం యొక్క ఉత్పాదన—దీనిలోని సభ్యులు "శ్వేత విప్లవం" తీసుకురావడంలో అందరికన్న ముందడుగు వేశారు.

జాగ్రత్త పడటం

పాప ఆహారానికి ఉపయోగించే అన్ని వస్తువుల్నీ, సీసానీ, ఎప్పుడూ ఆరోగ్యరీత్యా బాగా శుభ్రంగా కడిగి నీటిలో మరగ బెట్టాలి. పాప ఆహారాన్ని తయారుచేయడానికి కూడా మరిగిన నీటినే వాడండి. పాప సరియైన పోషణకోసం, డబ్బా పైన యివ్వబడిన అమూల్ స్ప్రే మోతాదుల ప్రకారమే ఖచ్చితంగా పాప ఆహారాన్ని తయారు చెయ్యండి.

ఉచితం! ఉపయోగకరమైన విషయాలు యీ అధ్యాయాలలో ఉన్నాయి అవి- గర్భధారణ, ప్రసవానికి ముందర జాగ్రత్త, ప్రసవము, తల్లి పాలు, ఇతర ఆహారములు, మిశ్రమ ఆహారమును అలవాటు చేయుట, పిల్లవాని దిన చర్య, పిల్లవాని అభివృద్ధి, జబ్బులను అరికట్టుట, ప్రథమ చికిత్స, సాధారణ రోగములు, జబ్బుతోనున్న పిల్లవాని సంరక్షణ, జ్ఞాతక ముంచుకోవలసిన విషయములు ఈ పుస్తకం తెలుగు, ఇంగ్లీషు, హిందీ తమిళం, మలయాళం, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ భాషల్లో దొరుకుతుంది. దానికోసం పోస్ట్ బాక్స్ 10124, బొంబాయి 400 001 అడ్రసుకు మీ పేరూ, పూర్తి అడ్రసు యిస్తూ రు. 1.25 స్టాంపుల్ని జతపర్చండి.

అమూల్ స్ప్రే తయారుచేసే వారి తరపున, మీ పాప ఆరోగ్యం కోసం సద్భావంతో యిస్తూన్న సందేశం యిది.

అమూల్‌స్ప్రే

భారతదేశపు ప్రముఖ సహకార పాల సంఘం వారి ఉత్పాదన.

అమ్మకం చేయించువారు:
గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్,
పోస్ట్ బాక్స్ 10, ఆనంద్ 388 001, గుజరాత్.



ASP/AS-1/83

సీరియల్

జీవన్మృతులు

ఇంగ్లీషు మూలం: బ్రామ్ స్టోకర్

స్వేచ్ఛానువాదం: కొలను వెంకట దుర్గాప్రసాద్



(గత సంచిక తరువాయి)

('ది పాల్ మాల్ గెజిట్'లోని తరువాయి భాగం)

జూలాజికల్ గార్డెన్స్ రక్షకుడు థామస్ బిల్డర్ చెప్పడం మొదలెట్టాడు.

"అసలు కథ ఇది. ఇప్పుడు నేను చెప్పబోయే తోడేలును 'బెర్సికర్' అని పిలిచేవాళ్లం. నార్వే జామ్‌రాచ్ ప్రాంతాల నుండి తెచ్చిన మూడు బూడిద రంగు తోడేళ్లలో ఇదొకటి. దీన్ని నాలుగేళ్ల క్రితం కొన్నాం. అది చాలా చక్కగా నడుచుకునేది. ఎప్పుడూ చెప్పుకోదగ్గ ఇబ్బంది పెట్టలేదు. అదెప్పుడూ తప్పించుకుపోవాలనిచూస్తుంటే నాకు ఆశ్చర్యమేసేది. ఆడదానిలాగే తోడేలుని నమ్మడానికి లేదు."

"ఆయన మాటలకు మీరేమీ పట్టించుకోకండి." అని నవ్వింది అతని భార్య. "ఆ ముసలి తోడేలు ప్రమాదకరమైనది కాదు" అంది.

మళ్ళీ అతను చెప్పడం మొదలెట్టాడు.

"అదీ సార్. నిన్న వాటికి తిండి పెట్టిన రెండు గంటల తర్వాత, ఏదో గొడవ నా చెవినపడింది. అప్పుడు నేను అడవి పిల్లి కొకదానికి ఆరోగ్యం బాగో లేకపోతే, దానిని చూస్తూ వున్నాను. అరుపులు, గొడవా వినిపిస్తే, నేను తిన్నగా వచ్చేసాను. అక్కడ బెర్సికర్ పిచ్చిపట్టిన దానిలాగ, బోనులో అరుస్తూ తిరుగుతోంది. ఆ రోజు జూలో పెద్దగా జనంలేరు. ఆ బోను దగ్గర అప్పుడు ఒక్క మనిషి మాత్రమే వున్నాడు. అతను పొడుగ్గా, సన్నగా, పొడుగు ముక్కుతో వున్నాడు. కొనదేలిన గడ్డంలో అక్కడక్కడా తెల్లటి వెంట్రుకలున్నాయి. అతని కళ్ళు నిశ్చలంగా, ఎర్రగా వున్నాయి. అతన్ని చూసే, తోడేలుకు వికారం కలిగి అరుస్తోందని పొరపడ్డాను. అతను చేతులకు తెల్లటి తొడుగులు వేసుకుని వున్నాడు. అతను వాటివంక చూపిస్తూ "చూడండి, ఈ తోడేళ్ళు ఎందుకో కలవర పడుతున్నాయి" అన్నాడు.

"బహుశా మిమ్మల్ని చూసే అనుకుంటా" అన్నాను. ఎందుకంటే, అతని గాలి నాకు పడలేదు. అట్లా అన్నందుకు అతను కోపం తెచ్చుకుంటాడను కున్నానుగాని, తెచ్చుకోలేదు. అతను వ్యంగ్యంగా నవ్వాడు. అతని పళ్ళు తెల్లగా, పదునుగా వున్నాయి. "ఓ వాటికి నేనంటే ఇష్టంలేదులా వుంది" అన్నాడు.

"అంతే అయివుంటుంది," నేనూ అట్లాగే అతన్ని అనుకరిస్తూ వ్యంగ్యంగా అన్నాను. "వాటికి ఎప్పుడూ ఎముకల్ని వేస్తుండాలి, వాటి పళ్ళకు పని కల్పించడానికి" అన్నాడు.

సాధారణంగా అలా చెయ్యవుగానీ, మేం ఇద్దరం మాట్లాడుకుంటూ వుండేసరికి అవి క్రింద పడుకున్నాయి. నేను బెర్సికర్ చెవులు దువ్వాను. అది ఏమీ కదలలేదు! అతను కూడా దగ్గరగా వచ్చి, ఏవిటో ఆశీర్వదించాడు గానీ, వాటి చెవులను మాత్రం దువ్వలేదు.

"కాస్త జాగ్రత్తగా వుండాలి, బెర్సికర్ కాస్త చురుకు" అన్నాను.

"ఏం ఫర్వాలేదు. నాకు అలవాటే" అన్నాడు.

"ఏవిటీ, మీరు తోడేళ్ళ వ్యాపారంలో వున్నారా?" అని అడిగాను, నా టోపీతీసి చేత్తో పట్టుకుని. ఎందుకంటే తోడేళ్ళ వ్యాపారం చేసే వాళ్ళు మాకు మంచి మిత్రులు.

"కాదు. వాటి వ్యాపారం చెయ్యనుగానీ వాటిని ఎక్కువగా పెంచుతుంటాను" అన్నాడు. ప్రభువులా టోపీని కాస్త సర్దుకుని వెళ్ళిపోయాడు. బెర్సికర్ అతను కనుమరుగయ్యే వరకూ అతన్నే చూస్తూ వుండిపోయింది. తర్వాత ఒక మూలకెళ్ళి కూర్చుని బయటకు రాకుండా సాయంత్రమంతా వుండిపోయింది. రాత్రి వెన్నెల బాగా వచ్చినప్పుడు ఈ తోడేళ్ళు అరవడం మొదలెట్టాయి. ఆ సమయంలో వాటికి అరవ వలసినంత అవసరం ఏమీలేదు. దగ్గర్లో మనిషిఎవరూకనిపించలేదు. జూవెనక పార్కురోడ్డులో ఎవరో ఒకతను కుక్కను పిలుస్తున్న చప్పుడు తప్ప మరేమీ వినిపించలేదు. ఒకటి రెండుసార్లు నేను వాటి దగ్గిరకెళ్ళి, అవి సరిగా వుండేట్టు చూసాను. అవి అరవటం మానేసాయి. అర్ధరాత్రి పన్నెండు గంటలకు కాస్త ముందు ఒక్కసారి, గార్డెన్‌చుట్టేసి బెర్సికర్ బోను దగ్గరకు వచ్చాను. అంతే, బోను ఊచలు కోసి వంచి వున్నాయి. బోను అంతా ఖాళీగా వుంది. అదీ నాకు తెలిసినంతవరకూ జరిగింది" అన్నాడు.

"ఎవరైనా ఏవైనా కనిపెట్టారా?" అడిగాను.

"ఆ సమయంలో మా తోటమాలి ఒకడు సంగీతం ఆలాపనతో వస్తూ కనిపించాడు. అతను ఒక పెద్ద బూడిదరంగు కుక్క గార్డెన్‌లోంచి రావడం చూసాడట. అట్లా అని అంటాడుగానీ, నేను నమ్మను ఎందుకంటే, దీని గురించి ఒక్క ముక్క కూడా వాళ్లావిడకు చెప్పలేదట. తోడేళ్ళన్నీ పారిపోయాయి అన్న సంగతి అందరికీ తెలిశాక, బెర్సికర్ కోసం మేం పార్కు అంతా వెతుకుతున్నప్పుడు, అతను ఏదో గుర్తుకు తెచ్చుకుని చెప్పాడు. అతను బుర్ర సంగీతంతో నిండిపోయి వుంటుందని నా నమ్మకం. అతనేమీ చూసి వుండడు.

"మిస్టర్ బిల్డర్! మరి ఈ పారిపోయిన తోడేలు గురించి మీవాళ్లకు ఎట్లా లెక్క చెప్పగలరు?" అడిగాను.

"చెప్పగలనుగానీ, నా జవాబుతో మీరెట్లా తృప్తిపడతారు?" అన్నాడు.

"మీరు చెబితే ఎందుకు ఒప్పుకోం. జంతువుల గురించి బాగా అనుభవం వున్నవాళ్ళు. ఏదో ఒకటి చెప్పలేరా?" అన్నాను.

"అయితే సరే, నేను ఏం చెపుతానంటే, బెర్సికర్‌కి వెళ్ళిపోవాలనిపించింది, వెళ్ళిపోయింది అంటాను." అన్నాడు.

జోకు వేసినందుకు నవ్వుతూ. అతనితోపాటు అతని భార్య కూడా నవ్వింది. అతనట్లా తమాషాకు అన్నాడేగానీ, అసలు సంగతి రాబట్టాలనుకున్నాను.

"అర్ధ సావరిన్ బంగారం ఇచ్చినదానికి ఇదంతా చెప్పారు. మిగతా సగం సావరిన్ ఇస్తానుగానీ, ఈ విషయంలో మరి ఏం జరుగుతుందో చెప్తారా" అడిగాను.

"చెప్తాను. అసలు నా ఉద్దేశంలో ఆ తోడేలు ఎక్కడో దాక్కొని వుంటుంది. ఆ మతిమరుపు తోటమాలి ఏం చెప్పాడు? ఆ తోడేలు ఉత్తరం వేపుకు గుర్రంకన్నా వేగంగా వెళ్లిందని చెప్పాడు. నాకు అతని మాటలమీద నాకు నమ్మకంలేదు. ఎందుకంటే, తోడేళ్ళు గుర్రాల్లా, కనీసం కుక్కల్లా కూడా

జరిగిన కథ—14: లూసీ ఆరోగ్యం గురించి జాన్‌సెవార్డు ఆర్థర్ హాల్మ్‌వుడ్‌కి తెలియ జేస్తుంటాడు. లూసీ పరిస్థితి దయనీయంగా వుంది. ఆమె వంట్లో రక్తం చాలా తక్కువగా వుంది. అందువల్ల ఆమెకు రక్తం ఎక్కించటానికి ప్రయత్నాలు చేస్తుంటాడు ప్రొఫెసర్ వాన్‌హెల్సింగ్. డాక్టర్ సెవార్డు లూసీకి తన వంట్లోని రక్తం ఇస్తాడు. ఆమె పరిస్థితి ఇప్పుడు కొంచెం మెరుగ్గా వుంటుంది. పారిపోయిన తోడేలు కథనం గురించి జులాజికల్ గార్డెన్స్ రక్షకుడిని "ది పాల్‌మాల్ గెజిట్" పత్రికా విలేఖరి ఇంటర్వ్యూ చేస్తుంటాడు.

పరుగెత్తలేవు. వాటి అవయవ నిర్మాణం అట్లా లేదు. కథల్లో వాటిల్లో తోడేలు గురించి బాగా రాస్తారు. దానిగురించి భయంకరంగా వర్ణిస్తారు. కానీ అదంతా సరికాదు. నిజానికి తోడేలు చాలా చిన్న జంతువు. దానికి కుక్కకున్న తెలివికూడా వుండదు. అవి పోట్లాడగలిగినట్టుకూడా, తోడేలు పోట్లాడలేదు. ఈ తోడేలుకు పోట్లాడే అలవాటు లేదు. ఎక్కడో పార్కులో, వణికిపోతూ దాక్కుని వుంటుంది. తిండి ఎట్లా సంపాదించుకోవాలా అని అనుకుంటూ వుంటుంది. లేదా ఏదేనా ప్రాంతానికి వెళ్లిపోయి వుంటుంది. దానికి ఆహారం కనపడకపోతే, దానికోసం ఎక్కడో చూడ్డం మొదలెడుతుంది. లేకపోతే ఏ మాంసం కొట్టువాడి దగ్గరకో వెళుతుంది. దానికి అదీ దొరకలేదనుకో, ఎవరైనా నర్సు, తొట్టిబండిలో పిల్లాడ్ని వదిలేసి తన ప్రియుడ్ని కలవడానికి వెళ్లిందనుకో, అంతే, జనాభా లెక్కల్లో ఆ పిల్లవాడ్ని తగ్గించి చూపించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అదీ సంగతి" అన్నాడు.

మరో సగం సావరిన్ అతని చేతిలో పెట్టబోతుండగా, కిటికీ తలుపులు తోసిన చప్పుడయింది. బిల్టర్ మొహం విప్పారింది, ఆశ్చర్యంతో.

"దేవుడి దయవల్ల బెర్సికర్ వచ్చేసి నట్టుంది" అన్నాడు.

అతను వెళ్ళి తలుపులు తీసాడు. ఇక ఈ వ్యవహారం అంతా అనవసరం అనిపించింది. అది వచ్చేశాక ఇంకెందుకు! షుమారు ఒక రోజున్నరపాటు లండన్ నగరాన్ని స్తంభింపచేసి, పిల్లలందర్నీ హడలెత్తించిన తోడేలు వచ్చేసింది. అది ఎంతో బాధ పడ్డ దానిలా కనిపించింది. బిల్టర్ దానిని పోయి దొరికిన వస్తువులాగ ప్రేమగా దగ్గరకు తీసుకున్నాడు. దాని శరీరాన్నంతా తడిమి చూసాడు.

"నాకు తెలుసు. ఇది ఎక్కడో చిక్కుల్లో పడింది. నేను చెప్పలేదా ? దాని తలంతా బాగా గీసుకుపోయింది, గాజు ముక్కలతో. ఇది ఏవో గోడలెక్కి దూకి వుంటుంది. గాజు పెంకులతో ప్రహరి గోడలు కట్టడానికి ఈ మనుషులకు సిగ్గెందుకుండదో. అందుకే దీనికి అన్ని దెబ్బలు. బెర్సికర్, రా రా !" అన్నాడు.

అతీను తోడేలును పట్టుకుని, బోనులో వుంచి తాళం వేసాడు. దానికి కొద్దిగా మాంసం వేసాడు. అది కాస్త దగ్గుతుండడం మూలాన, రిపోర్టు చెయ్యడానికి వెళ్లాడు బిల్టర్.

నేనూ కూడా ఈ జూ నుండి పారిపోయి మళ్ళీ వచ్చిన తోడేలు ఉదంతం రాయడానికి వచ్చేసాను.

డాక్టర్ సెవార్డు డైరీ :

సెప్టెంబర్, 17 : భోజనం ముగించాక, పేరుకుపోయిన నా పనులను పూర్తిచేయడం ప్రారంభించాను. ఈ మధ్య లూసీని చూసి రావడానికి వెళ్లడం వల్ల, పనులు వె న క పడి పో యా యి. హఠాత్తుగా తలుపులు తెరుచుకున్నాయి. నా పేషంటు కలవరపడిపోయిన మొహంతో లోపలికి పరుగెత్తుకొచ్చాడు. నామీద పిడుగు పడ్డంతగా అదిరిపడ్డాను. ఇట్లా పేషంటు తనకు తానే గదిలో చొరపడడం ఎప్పుడూ జరగలేదు. ఒక్క క్షణంలో అతను తిన్నగా నా దగ్గరకు వచ్చేశాడు. అతని చేతిలో చాకు వుంది. మనిషి చాలా ప్రమాదకరంగా కనిపించాడు. నేను టేబులుకు ఇవతల, అతను అవతల వున్నాం. అతను నాకంటే చాలా చురుకుగా, బలంగా వున్నాడు. నేను ఈ పరిస్థితిని ఎదుర్కొని నిలబడదామనుకునేలోపే, అతను నా ఎడంచేతి మణికట్టును కత్తితో బాగా గాయపరిచాడు. మళ్ళీ అతను మరో దెబ్బ వేసేలోగా, నా కుడిచేత్తో అతనికి పాఠం చెప్పాను. అతను వెనక్కి వెళ్లికలా పడిపోయాడు నేలమీద. నా మణికట్టు నుండి రక్తం బాగా స్రవించింది. కింద తివాచీ అంతా రక్తంతో తడిసిపోయింది. అతను మళ్ళీ ఏ ప్రయత్నము జేయలేదు. నేను మణికట్టుకు తగిలిన గాయానికి కట్టుకట్టుకున్నాను. అయినా అతన్ని ఓరగా గమనిస్తూనే వున్నాను. ఇంతలో పనివాళ్ళు పరుగెత్తుకొచ్చారు. అప్పుడు వాళ్ళూ, నేనూ అతన్ని చూసాం. అతను చేస్తున్న పని వెగటుపుట్టింది. అతను కుక్కలా బోర్లాపడుకుని, మణికట్టు దగ్గర్నించి నేలమీదకు కారిన రక్తాన్ని నాకుతున్నాడు. పనివాళ్ళు అతన్ని పట్టుకుని లేపారు. అతను గొడవేం



చేయలేదు. వాళ్లతోపాటు వెళ్లిపోతూ "రక్తమే జీవితం, రక్తమే జీవితం" అన్నాడు.

రక్తం పోతూంటే నేనిప్పుడు తట్టుకునే పరిస్థితిలో లేను. ఈ మధ్య చాలా రక్తంపోయింది. లూసీకి రక్తం ఇవ్వడం, ఆమె గురించిన ఆందోళన, ఇవన్నీ నా ఆరోగ్యాన్ని తినేశాయి. నేను ఎక్కువగా ఉద్రేకం చెందాను. ఎక్కువగా అలసిపోయాను. ఇప్పుడు నాకు విశ్రాంతి కావాలి. విశ్రాంతి, విశ్రాంతి. వాన్ హెల్సింగ్, మళ్ళీ నన్ను పిలవనందుకు సంతోషంగా వుంది. ఇప్పుడు నిద్రకు భంగంలేదు.

ఆంట్‌వెర్ప్ నుంచి వాన్ హెల్సింగ్ కార్‌ఫోక్స్‌లో వున్న సెవార్డుకు పంపిన టెలిగ్రాం :

(టెలిగ్రాం కార్‌ఫోక్సు, సుస్సెక్సుకు పంపబడింది. చిరునామా సరిగ్గా లేకపోవటంచేత ఇరవై నాలుగ్గంటల ఆలస్యంగా అందింది.)

సెప్టెంబర్ 17, ఇవాళ రాత్రికి హల్లింగ్ హోమ్ దగ్గర తప్పకుండా వుండాలి. ఎప్పుడూ ఆమెను కనిపెట్టి వుండకపోతున్నట్టయితే, ఆమెను చూడడానికి వెళ్లి వెల్లుల్లిపాయలు అన్నిచోట్లా సరిగా వుండేట్టుగా చూడాలి. చాలా ముఖ్యమయిన విషయం. ఏ మాత్రం భంగం కలగకూడదు. వీలయినంత త్వరలో కలుస్తాను.

డాక్టర్ సెవార్డు డైరీ :

సెప్టెంబర్, 18 : ఇప్పుడే లండన్ వెళ్ళే రైలు కోసం బయలుదేరాను. వాన్‌హెల్సింగ్ టెలిగ్రాం నన్ను చాలా నిరుత్సాహపరిచింది. ఒక రాత్రి అంతా పోయినట్టేకదా! ఒక్క రాత్రిలో ఎంత గందరగోళం జరుగుతుందో నాకు అనుభవమే. ఏవీ జరగకపోవచ్చుగానీ, అసలు ఇదివరకు ఏం జరిగి వుంటుంది? ఏమిటో, మొత్తానికి ఏదో పీడ మమ్మల్ని వెంటాడుతోంది. ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా వదలకుండా వుంది.

లూసీ రాసిపెట్టి వుంచిన ఉత్తరం :

సెప్టెంబర్, 17 : రాత్రి సమయం :


ఇది రాసి ఎవరైనా చూడడానికి వీలుగా వదిలి పెడుతున్నాను. ఇది చూసి, నావల్ల ఇబ్బందుల పాలవకుండా వుంటారు. అసలు ఈ రాత్రి ఏం జరిగిందో వున్నది వున్నట్టు రాస్తున్నాను. నాకు చచ్చేంత నీరసంగా వుంది. అసలు ఏమాత్రం రాయడానికి కూడా శక్తి లేకుండా వుంది అయినా కూడా నేను రాయదల్చుకున్నాను. రాస్తూ చచ్చిపోతాను.

మామూలుగా మంచంమీదకు చేరాను. వెల్లుల్లిపాయలు డాక్టర్ వాన్‌హెల్సింగ్ చెప్పినట్టుగా అన్నిచోట్లా వుంచాను. తొందరగానే నిద్ర పట్టేసింది.


కిటికీ తలుపు చప్పుడుతో నాకు మెలకువ వచ్చింది. నేను విట్‌బిలో రాతిగుట్టలమీద నిద్రలో నడుస్తూ వెళ్లడం, ఓసారి మీనా నన్ను రక్షించడం, తర్వాత కిటికీ తలుపులు చప్పుడు కావడం, అన్నీ నాకు బాగా తెలుసు. అదే ఇది. నాకు భయం వేయలేదు. డాక్టర్ సెవార్డు నా పక్కగదిలో వుంటాడని డాక్టర్ వాన్‌హెల్సింగ్ నాకు చెప్పారు. అందుకని ఏదైనా అయితే అతన్ని పిలవచ్చు. మళ్ళీ నిద్రపోడానికి ప్రయత్నం చేసాను. కానీ రాలేదు. అంతలోనే పూర్వం వున్న భయం నాలో ప్రవేశించింది, అందుకని మెలకువగానే వుండటానికి నిశ్చయించుకున్నాను. నిద్ర ముంచుకొస్తున్నా, నేను నిద్రపోదల్చుకోలేదు. మేలుకొని ఒంటరిగా వుండడానికి భయం వేసింది. లేచివెళ్ళి గది తలుపులు తీసి "ఎవరున్నారు అక్కడ?" అని పిలిచాను. జవాబు లేదు. అమ్మను నిద్ర లేపడానికి భయం వేసింది, ఆమె ఆరోగ్యం సరిగా లేనందున. ఇక చేసేది లేక తలుపులు వేసేసాను. బయట చెట్ల పొదల్లోంచి కుక్క అరుపులాంటిది వినవచ్చింది. అది చాలా క్రూరంగా వుంది. కిటికీ దగ్గరకు వెళ్లి తలుపులు తీసి బయటకు చూసాను. కానీ ఏమీ కనిపించలేదు, ఒక పెద్ద గబ్బిలం తప్ప. అది రెక్కలతో కిటికీ తలుపుల్ని టపటప కొడుతోంది. మళ్ళీ నా మంచంమీదకు వెళ్లాను. నిద్రమాత్రం పోకూడదని నిశ్చయించుకున్నాను. మొదట అమ్మ తలుపు తీసి లోపలికి చూసింది. నేను నిద్రపోకుండా వుండడం గమనించి లోపలికొచ్చింది. నా ప్రక్కనే కూర్చుంది. ఆమె మామూలుగాకన్నా, ఎంతో తియ్యగా, మన్నితంగా నాతో అంది :

"నీగురించే నాకు బెంగ. నువు ఎట్లా వున్నావో చూద్దామని వచ్చాను."

ఆమె అక్కడ కూర్చుంటే, జలుబు చేస్తుందేమోనని భయం వేసింది. ఆమెను లోపలికొచ్చి నాతోపాటు పడుకోమని చెప్పాను. ఆమె నా మంచం దగ్గరకు వచ్చి నాతోపాటు పడుకుంది. ఆమె తన గౌను తీసివేయకుండానే పడుకుంది, కాసేపు వుండి తన గదిలోకి వెళ్లిపోతానని చెపుతూ. ఇద్దరం ఒకరికొకరు దగ్గరగా పడుకున్నాం. కిటికీ తలుపు దగ్గర మళ్ళీ చప్పుడయింది. ఆమె ఆ చప్పుడు విని నిస్తేపోయి, కాస్త భయపడి "ఏమిటా చప్పుడు?" అని అరిచింది. ఏంలేదని నచ్చచెప్పటానికి ప్రయత్నించాను. ఆమె మౌనంగా వుంది. కానీ ఆమె గుండె వేగంగా కొట్టుకుంటున్న చప్పుడు నాకు బాగా వినిపిస్తోంది. కాసేపు అయిన తర్వాత మళ్ళీ సన్నగా జంతువు అరుపు వినవచ్చింది. అది చెట్ల పొదల్లోంచి వస్తోంది. కొద్ది క్షణాల్లో కిటికీ తలుపుకు ఏదో గుద్దుకుంది. అంతే, కిటికీ తలుపుల అద్దాలు పెద్ద చప్పుడుతో పగిలి నేలమీద పడి ముక్కలయ్యాయి. కిటికీకి వున్న తెరలు గాలివిసురుకి వెనక్కి ఎగిరాయి. అద్దాలు పగిలిపోగా, మిగిలిన కిటికీ తలుపుల చట్రంలోంచి బూడిదరంగులో వున్న ఒక పెద్ద తోడేలు తల కనిపించింది. అమ్మ భయంతో అరిచింది. మంచంమీద బిగుసుకుపోయి కూర్చుంది, అని ఇవీ ఆసరాగా పట్టుకుంటూ. ఆమె ఆ భయంలో, నామెళ్లో కట్టుకున్న వెల్లుల్లిపాయల దండ పట్టుకుని లాగేసింది. ఒకటి రెండు క్షణాల తర్వాత ఆమె సరిగా కూర్చుని, తోడేలు వంక చూపించింది. ఆమె గుండె విపరీతంగా కొట్టుకుంటున్నట్టు వినపడుతోంది. వెంటనే పిడుగుపాటు దెబ్బలా పడిపోయింది. అప్పుడు ఆమె తల నా తలకు కొట్టుకుంది. రెండు క్షణాలు నా తల దిమ్మెక్కిపోయింది. గది, గదిలోని వస్తువులు గిరగిరా తిరుగుతున్నట్టు అనిపించింది. నేను కిటికీ వైపుకు చూస్తూ వుండిపోయాను, చూపు మరల్చకుండా. తోడేలు తలను వెనక్కి తీసేసుకుంది. అప్పుడు కిటికీ చట్రంలో మిగిలిన గాజుపొడి నేల మీద పడింది, చల్లినట్టుగా. నేను కదలడానికి ప్రయత్నించాను. కానీ ఏదో మత్తు నన్ను ఆవహించింది. అమ్మ శరీరం అప్పటికే చల్లబడింది. ఆమె గుండె కొట్టుకోవడం మానేసింది. ఆమె నా మీద పడిపోయింది. కాసేపటి వరకు నాకు ఏం జరిగిందో నాకు గుర్తులేదు.



స్టేట్‌బాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాదు సర్కిల్ స్టాఫ్ యూనియన్ రజతోత్సవాల సందర్భంగా విజయవాడలో జనవరి 23న జరిగిన ప్రారంభ సమావేశంలో ప్రసంగిస్తున్న యూనియన్ అధ్యక్షుడు శ్రీ పి. లక్ష్మీనరసయ్య. వేదికపై శ్రీయుతులు పి. వి. రాజు, వై. తారకనాథ్, డాక్టర్ చంద్ర, టి. వెంకటేశ్వరరావు (మేయర్), డాక్టర్ సూరి భగవంతం, దూబర్, జోగయ్యశర్మ ప్రభృతులని కూడా చిత్రంలో చూడవచ్చు.



[illegible]

చిరకాలంగా ఎదురుచూస్తున్న ఆ గ్యాస్ కనెక్షన్ లభించింది.
ఇక గ్యాస్ స్టౌవ్‌ని ఎంచుకోవడమే అయితే, నిస్సందేహంగా
అది సూపర్ (అత్యున్నత) నిర్ణయమే.
సూపర్‌ని ఎంచుకోవడం తప్ప మరో మార్గం లేదు. ఇంధనం
తెలివిగా వాడుకోడంలోను, పొదుపు కోసం కూడా సూపర్.
నాణ్యతలో, రూపంలో సూపర్. అత్యున్నత భద్రతా ప్రమాణాలకు
అనుగుణ్యంగా రూపకల్పన చేయబడింది. సూపర్ ప్రత్యేకతలు.
ఒక్క మాటలో చెప్పాలంటే 'సూపర్' ఖ్యాతి! **సూపర్‌ఫ్లేమ్**


సూపర్ ప్రత్యేకతలు :

- నాజూకుగా కనబడే సిల్వర్-క్రోమ్ లేదా స్టెయిన్‌లెస్ స్టీల్ బాడీ.
- తుప్పు పట్టని, వేడి ఎక్కని ప్యాన్ సపోర్టర్‌లు.
- నిప్పు అంటుకోనని (FIRE PROOF) నాబ్‌లు.
- లోపలే నిర్మాణమైన దృఢమైన స్టాండ్.

అనేక రకాల మోడల్స్ !

సింగిల్ బర్నర్, డబుల్ బర్నర్ 'ప్రీమియం' డబుల్ బర్నర్ డీలక్స్, కేంటీన్ బర్నర్ ఆకర్షణీయమైన రంగులలో లభిస్తాయి.

ఎల్ పిజి డీలర్‌లు దగ్గర మాత్రమే దొరుకుతాయి.




నం.1 సూపర్‌ఫ్లేమ్

భారత దేశపు అత్యధికంగా విక్రయమయ్యే గ్యాస్ స్టౌవ్

గ్లోబ్ సూపర్ పార్ట్స్

(బాత్రా గ్రూప్ పారిశ్రామిక సంస్థలలో ఒకటైన సూపర్ పార్ట్స్ ప్ర.లి. కి చెందిన విభాగం)
14/1, మధుర రోడ్, ఫరిదాబాద్ టెలి సం.లు 825561-62-63



డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

పి. వి. ఆర్. — రాయచోటి

నా వయస్సు 17 సంవత్సరములు. నేను కళ్ళజోడుకి బదులుగా కాన్‌టాక్ట్‌లు వాడవచ్చునా? మన రాష్ట్రంలో ఈ సౌకర్యాలు ఎక్కడ ఉన్నాయో తెలియజేయండి.

★ తప్పకుండా కాన్‌టాక్ట్ లెన్సులు వాడవచ్చును. కాని నేత్ర వైద్యుల సలహా పొందిన తర్వాత వాడటం మంచిది. పెద్ద పట్టణాలలో—అంటే ముఖ్యంగా హైదరాబాదు, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, కాకినాడ మొదలయిన పట్టణాలలో ఈ కాన్‌టాక్ట్ లెన్సులు వేసే కళ్ళజోడు షాపులు ఉంటాయి.

జి. బి. — ఖమ్మం

నా వయస్సు 21 సం॥లు. నాకు ముగ్గురు పిల్లలు. పిల్లలు పుట్టక పూర్వం లావుగా ఉండే దాన్ని, పిల్లలు పుట్టిన తర్వాత చాలా చిక్కిపోయాను. 3 నెలల క్రితం పిల్లలు కలుగకుండా ఆపరేషన్ చేయించుకొన్నాను. అయినా వంట్లో ఏ మార్పూ లేదు.

★ కొందరు శరీర తత్వాన్ననుసరించి సన్నబడటం జరుగుతుంది. శరీరంలో రోగలక్షణాలు లేవని నిర్ధారణగా తెలిస్తే లావు—సన్నాలను గురించి బాధ పడటం అనవసరం. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకొంటే లావు అయ్యే అవకాశం ఉండదు.

పి. ఎం. — విజయవాడ

నా పన్ను సగం వరకు విరిగి కొన్ని రోజులు అయింది. చూడటానికి అసహ్యంగా ఉన్నది. సగం పన్ను అతికిస్తారా? ఎక్కడ అతికిస్తారు? ఖర్చు ఎంతవుతుంది?

★ విరిగిన పన్ను అతికించటం అసాధ్యం. ఆ పన్నుని పూర్తిగా తీసివేసి వేరే కృత్రిమంగా పన్ను కట్టించుకోవలసి ఉంటుంది. దంతవైద్యులు ఎవరైనా ఇలా చేస్తారు. ఖర్చు వైద్యుని బట్టి, వాడబడే దంతాన్ని బట్టి ఉంటుంది.

ఆర్. వి. — బాపట్ల

నా వయస్సు 20 సంవత్సరములు. సన్నగా వుంటాను. నాకు ఆకలి వేస్తుంది గాని ఎక్కువగా తినలేకపోతున్నాను. మట్టిలాంటి పదార్థాలు తినాలని పిస్తుంది. మట్టి తినవద్దన్నా తినకుండా వుండలేక పోతున్నాను. ఏదైనా వ్యాధిలక్షణమా? దీనికి పరిష్కారం తెల్పండి.

★ దీనిని పెర్వర్టెడ్ అప్పెటైట్ అని అంటారు. పైకా అని కూడా దీనిని వ్యవహరిస్తారు. మానసిక ఆందోళన, విరక్తి వల్ల ఇలా ఏర్పడే అవకాశం ఉంటుంది. ఎనీమియా ఉన్నవారికి ఇటువంటి కోరిక ఉంటుందని శాస్త్రజ్ఞుల అంచనా.

మలపరీక్ష చేయించుకొని క్రిములు ఉన్నవని తేలితే తగిన చికిత్స చేయించుకోవడం మంచిది. లోనికి ఇనుప ధాతువు మాత్రలు తీసుకోవటం అవసరం.

ఎం. ఆర్. ఎ. వి. — శ్రీకాకుళం

మా అబ్బాయి వయస్సు 16 నెలలు. పుట్టిన మరుసటిరోజే ఫిట్సు వచ్చాయి. తర్వాత అప్పుడప్పుడూ జ్వరం వచ్చినప్పుడల్లా ఫిట్సు వస్తున్నాయి. ఇంతవరకు కూర్చోవటం రాలేదు. మనుష్యులను మాత్రం గత రెండు నెలలుగా గుర్తుపట్టటం, నవ్వటం, కేరింతలు కొట్టటం చేస్తున్నాడు. ఈ రోగాన్నేమంటారు? ఎందువల్ల వస్తుంది? తల్లి తండ్రులకి వెనీరియల్ రోగాలు ఉంటే ఇలా వస్తుందా?

★ దీనిని సెరిబ్రల్ పాల్సీ అని అంటారు. మెదడులోని జీవకణాలకి (సెల్స్‌కి) ఆక్సిజన్ సరఫరా సకాలంలో అందకపోవటం వల్ల ఇలా జరిగే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులకి వెనీరియల్ రోగాలు ఉన్నందువల్ల ఇలా జరిగే అవకాశం లేదనే చెప్పాలి. ప్రసవం ఆలశ్యమయినందువల్ల సాధారణంగా ఇలా జరుగుతుంది. ★


జీవన్ మృతులు

క్షణాలు గడిచిపోతున్నాయి, కానీ ఎంతో భయంకరంగా గడుస్తున్నాయి. మళ్ళీ నేను కాస్త స్పృహలోకి వచ్చాను. ఎక్కడో దగ్గర్లో గంట మోగుతోంది. పరిసర ప్రాంతాల్లోని కుక్కలన్నీ అరుస్తున్నాయి. మా ఆవరణ చెట్లపొదల్లో అనుకుంటా, నైటింగేల్ పాట వినపడుతోంది, భయంతో, నీరసంతో, మొద్దుబారిపోయిన నాకు నైటింగేల్ పాట చనిపోయిన మా అమ్మ గొంతులా వుండి నన్ను ఓదార్చినట్టు అనిపించింది. ఈ అరుపుల చప్పుళ్ళ హడావిడికి మా పని మనుషులు లేచినట్టున్నారు. వాళ్ల నడక చప్పుడు నాకు వినిపించింది. నేను వాళ్లను పిలిచాను. వాళ్ళు లోపలికొచ్చారు. వాళ్ళు లోపలికొచ్చి, నా మీద చనిపోయి పడివున్న అమ్మను చూసి కెవ్వుమని అరిచారు. గాలి విసురుగా, కిటికీలోంచి లోపలికి వీచింది. తలుపులు టపాటపా కొట్టుకున్నాయి. వాళ్ళు వచ్చి అమ్మను లేవనెత్తి, నేను లేచిన తర్వాత ఆమెను మంచం మీద పడుకోబెట్టి గుడ్డ కప్పారు. వాళ్లంతా భయంతో కుంచించుకు పోతున్నారు. అది చూసి వాళ్లను భోజనాల గదిలోకి వెళ్ళి తలా కాస్త 'వైన్' తాగమని చెప్పాను. తలుపులు ఒక్కసారి తెరుచుకుని మళ్ళీ వెంటనే మూసుకున్నాయి. ఆ చప్పుడుకు పనిమనుషులు భయంగా అరిచారు. వాళ్లంతా కలిసి భోజనాల గదిలోకి వెళ్లారు. నా దగ్గరున్న పూవులను ఆమె ఎదపై వుంచాను. పని మనుషులు వున్నప్పుడు డాక్టర్ వాన్ హెల్సింగ్ ఏం చెప్పాడో గుర్తుంది. వాళ్లను లోపలికి రానివ్వ వద్దన్నాడు. కానీ ఇప్పుడు వాళ్లను రానివ్వకుండా వుండలేను. ఇప్పుడు ఎవరో ఒకరు నాతోపాటు కూర్చోవాలి. ఈ పని మనుషులు ఎంత సేపటికీ తిరిగి రాకపోయేసరికి ఆశ్చర్యమేసింది. వాళ్లకోసం పిలిచాను. జవాబు లేదు, ఇక లాభంలేదని నేనే భోజనాల గదిలోకి బయలుదేరాను.

అక్కడ పరిస్థితి చూసేసరికి నా గుండె బరువెక్కింది. పని మనుషులు నలుగురూ, నేలమీద కదలికలేకుండా పడివున్నారు, భారంగా వూపిరితీస్తూ. టేబుల్‌మీద సగం తాగిన సారాసీసా కనిపించింది. అది కాకుండా, ఏదో ముక్కులు బద్దలయ్యే వాసన వచ్చింది. నాకు అనుమానం వచ్చి ఆ సీసా వాసన చూశాను. నల్లమందు వాసనలాంటిది అది. అలమారలో చూశాను. అమ్మకోసం డాక్టరు వ్రాసి ఇచ్చిన సీసా ఖాళీగా కనిపించింది. అది వీళ్లుతాగారు. ఇప్పుడేం చెయ్యాలి? నేను ఇప్పుడేం చెయ్యాలి?? మళ్లీ నా గదిలోకి వచ్చేశాను. అమ్మను వదిలి వెళ్లాలనిపించలేదు. ఇప్పుడు నేను ఒంటరిగావున్నాను, అమ్మ శవం ప్రక్కన. బయటకు వెళ్లడానికి భయం వేసింది. తోడేలు అరుపు సన్నగా, పగిలిపోయిన అద్దాల కిటికీలోంచి ఇంకా వినవస్తోంది.

గాల్లో ఏవో మెరుపులు కనిపించాయి. అవి తేలుతూ, గుండ్రంగా తిరుగుతూ వున్నాయి. కిటికీలోంచి కనపడుతున్నాయి. ఇంతలో దీపం నీలి మంటతో వెలిగి, వెలుతురు తగ్గింది. ఇప్పుడేం చెయ్యాలి? ఓ దేవుడా, ఈ రాత్రి నన్ను ప్రమాదాన్నుండి రక్షించు. ఈ రాసిన కాగితాన్ని నా రొమ్ము మీద వుంచుకుంటున్నాను. ఎవరైనా నన్ను లేపడానికి వచ్చినపుడు దీన్ని చూస్తారు. నాకు ప్రియమైన తల్లి వెళ్లిపోయింది. నేనుకూడా వెళ్ళే సమయం వచ్చింది. డియర్ ఆర్థర్! ఈ రాత్రితో నేను లేకపోతే, నీకు గుడ్‌బై చెపుతున్నాను. దేవుడు నిన్ను చూస్తుంటాడు. ఓ దేవుడా, నన్ను రక్షించు!

(ఇంకా వుంది)


CHARMINAR
THE VAZIR SULTAN
TOBACCO CO. LTD.
10 CIGARETTES
మీలాంటి
మగవానికి
తృప్తినిచ్చేది-చార్మినారే!
విశ్రాంతి పొందండి! చార్మినార్ తాగండి.



'రఘురాముడు'లో శోభన్‌బాబు, శారద

'పులి-బెబ్బులి'లో జయప్రద, రాధిక



పల్లెటూరి పిడుగు

"సంక్రాంతి లోపునే షూటింగ్ పూర్తయిపోవాలి," అన్నారు విజయలక్ష్మి మూవీస్ అధినేత జి. వి ఎస్ రాజు. బోయిన సుబ్బారావు దర్శకత్వం వహించే "పల్లెటూరి పిడుగు" చిత్రం షూటింగ్ డిసెంబర్ 18న చంద్రగిరి దగ్గరున్న కోదండ రామపురం గ్రామంలో ప్రారంభమైంది. మోహన్‌బాబు, సత్యనారాయణ, కాంతారావు, నాగేష్, గిరిబాబు, ప్రభాకర్, కవిత, పండరీబాయ్, కల్పనా రాయ్ వగైరా తారాగణం. యం డి సుందర్ కథకు సత్యానంద్ సంభాషణలు రాశారు. ఆత్రేయ గీతాలకు సత్యం బా-ులు కూర్చారు. జి శివరాజు ప్రొడక్షన్ కంట్రోలర్. పుష్పాల గోపీకృష్ణ ఛాయ, భాస్కరరాజు శిల్పం, రవి కూర్పు, ఎస్ గోపాల్ సహకార దర్శకత్వంతో జి వి రాజు నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు



విశేషాలు

-జి. వి. జి.

నమోదు చేయబడిన చిత్రాల పేర్లు

శ్రీ విశ్వజ్యోతి ఆర్ట్ పిక్చర్స్ "ధనవంతుడు, ధైర్యవంతుడు," శ్రీ మహాలక్ష్మి ప్రొడక్షన్స్ "కొత్త దంపతులు," బాలాజీ సినీ ఇంటర్నేషనల్ "టార్జాన్," కల్యాణి ఆర్ట్ ఫిలిమ్స్ "ఆనంద భైరవి," శ్రీ విజయసారథి ఆర్ట్ పిక్చర్స్ "హృదయగానం," "కాలనాగు," క్రియేటివ్ సినిమా "సంపూర్ణ ప్రేమాయణం," అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ "సూక్ష్మంలో మోక్షం," రాఘవేంద్ర ఎంటర్‌ప్రైజెస్ "ఆకలి," అంజనీసుధా పిక్చర్స్ "అత్తా కోడళ్ళ సవాల్," బొమ్మరిల్లు ఆర్ట్ ప్రొడక్షన్స్ "పంచవన్నెల చిలకలు," శర్వాణి ప్రొడక్షన్స్ "వన్నెల వెలుగులు"

'ప్రజాశక్తి'లో కె. విజయ





'ముద్దుల మొగుడు'లో అక్కినేని నాగేశ్వరరావు

'మాయింటి ప్రేమాయణం'లో ప్రసాద్‌బాబు, జ్యోతి



సినిమా

"ముద్దుల మొగుడు' లో ముచ్చటైన ఘర్షణ !

విశాలమైన రోడ్డులో సరికొత్త మోడల్ బ్యాక్ కారును డ్రయివ్ చేసుకుంటూ పోతున్నాడు ప్రసాద్ [ఎ. ఎన్. ఆర్]. దూరాన మరో రోడ్డులో పాత మోడల్ ఆస్టిన్ కారేసు డ్రయివ్ చేసుకు వస్తోంది దుర్గ [శ్రీదేవి]. రెండు కార్లూ అలా అలా వచ్చి, ఒక ఇరుకైన వీధిలో వెళ్లే వీలులేక ఎదురెదురుగా ఆగాయి.

దుర్గ 'హుం' అని మూతి విరిచింది. తన కారు 'బూర' హారన్‌ను 'బొయ్'మని మోగించింది. ప్రసాద్ స్టయిల్‌గా తన కారు మ్యూజికల్ హారన్‌ను మోగించాడు. దుర్గ మరింత వేగంగా, బిగ్గరగా 'బూర' హారన్ మోగించింది. ప్రసాద్ లయబద్ధంగా హారన్ మోగించాడు.

దుర్గ ఉడికి పోయింది. ఇక భరించ లేక స్వరున కారు దిగి, దభాలున తలుపు మూసి, ప్రసాద్ కారు వైపు చరచరా నడిచింది. ప్రసాద్ స్టయిల్‌గా తన కారు దిగి, సున్నితంగా తలుపు మూసి నిలుచున్నాడు.

దుర్గ ఎగాదిగా చూసి, "వాట్ మిస్టర్ బ్యాక్ కార్ ?" అంది తీక్షణంగా.

ప్రసాద్ లయబద్ధంగా "ఓ ... టిక్కు నిక్కుల డొక్కుకారు కుమారిగారూ, ఏమి వక్కాణించినారు ?" అన్నారు.

"నాన్సెన్స్ ! బ్యాక్ కారంటే గొప్పా ? మీకు మేనర్స్ తెలుసా ?"

ప్రసాద్ ఘజల్‌లా వినిపించాడు : "నాకు తెలుసునని మీకు తెలియదు గాని, మీకు తెలియదని నాకు తెలుసునని మీకు తెలిసిన చాలును."

దుర్గ మరింత రెచ్చిపోయింది. "వ్హాట్.. తెలుసు—తెలుసు ? యూ ఛాటర్ బాక్స్ !"

"విన్ను తెలును ! నీకున్న పన్నె తెలుసు ! పన్నె తేలిన— నీ దొరవయసు తెలుసు." పద్యంలా చెప్పాడు ప్రసాద్. అతని కారును వెనక్కు పోనియ్యమని దుర్గ అనేసరికి "ముందైన, వెనకైన ముద్దుగుమ్మలకు అందగించును. మాకు అలవాటు లేదు వెనుదీయుటన్నది. మన జాతకాన ఇన్నాళ్ళుగా లేదు—ఈనాడు రాదు" ద్విపదలా ప్రసాద్ వల్లించాడు.

"మిస్టర్ ! మీ అలవాట్లు మీ ఇంట్లో ... అసలు నీకు కారు డ్రయివింగ్ అంటే తెలుసా ?"

"కారేమి ? ఏ కుర్రకారైనా నేను నడిపించి, పొగరంత అణిగించగలను."

"యూ స్కౌండ్రల్ !"

ఇంతలో అటు సైకిల్‌పై వస్తూన్న సరళ [సుహాసిని] "ఏయ్, దుర్గా ! ఏమిటే గొడవ ?" అంటూ సైకిల్ దిగి, ప్రసాద్‌ను చూసి, "అన్నయ్యా ! నువ్వా ! ఏమిటీ నడివీధి భాగోతం?" అంది.

"భాగవతం కాదు. భామాకలాపం...సత్యభామా కలాపం !" అన్నాడు ప్రసాద్.

"సరళా ! ఈ రౌడీని అన్నయ్యా— అనడానికి నీకు సిగ్గులేదూ ?" అంది దుర్గ.


"సిగ్గెందుకూ ? నిజంగా అన్నయ్యే. మా పినతల్లి కొడుకు. అది సరేగాని, ఇంతకీ అసలు గొడవేంటి ?" అని సరళ అంతా తెలుసుకొని, "అన్నయ్యా, నువ్వేకాస్త సర్దుకో ! నా మాట వినవూ ?" అంది.

"వినెదను, చెల్లీ వినెదను... దుర్గాదేవీ, మా చెల్లిపోనీ అన్నది—కనక పోనిస్తున్నాను. కాని ఒక్కటి



"ఎప్పుడూ కాళ్లతో గెంతటంచూసి జనానికి బోరు కొట్టింది. ఇప్పుడు కాస్త మార్చాం !"

'చట్టానికి వేయికళ్లు'లో కృష్ణ, మాధవి





ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్
తరంగిణి
రంగుల చిత్రం
నిర్మాత కె.రాఘవ
కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: కోడి రామకృష్ణ
లక్ష్మీ ఫిలింస్
PRATAP ADS

సంచలనాత్మక రంగుల్లో స్పెషల్ సిల్కులు



ఆప్కోవారి నారాయణపేట నాణ్యమైన సిల్కులు

బెనారస్ సిల్కు బాణీలో పేరుమోసిన నారాయణపేట సిల్కుచీరలు. అద్భుత సౌందర్యవంతమైన డిజైన్లలో దేశ, విదేశాల కళా ధర్మాల్ని మేళవించి అన్ని కాలాల్లో వాడేది. రెండురంగుల సిల్కు దారాల నేతలో వన్నెచిన్నెల జిలుగు కలయిక. సొగసైన నమూనాలతో, సోయగమొలికే నేతపనితనంతో నారాయణపేట సిల్కుల అపూర్వసౌందర్యం జగద్విదితం. నిగనిగలాడే వన్నెలు, కంటి కింపైన ఛాయలతో ప్రాచీన నేతపనివారి ప్రావీణ్యం రంగులతో వూసులాడుతున్నాయి. ప్రత్యేక సమయాల్లో నారాయణపేట సిల్కు చీరలు తమ ప్రత్యేకతను చాటుకుంటూ ఉల్లాసంగా సమ్మోహింప జేస్తాయి.

చేనేతలను ప్రోత్సహించండి

ఆప్కో

చేనేతలు కొనండి

ఆప్కో చేనేతలు

KIRON/APCO/832P

తెలుసుకోండి. ఇది వన్ వే ... ఇంకెప్పుడూ ఇలా తప్పుదారిన రాకండి. వచ్చి దబాయించకండి. అర్థమైందా ?" అంటూ తన కారును వెనక్కు తీసి, "టాటా ... బై బై ... చీరియో !" అంటూ వెళ్ళిపోయాడు.

అతను వెళ్తున్న వైపే గుడ్లప్పగించి చూస్తున్న దుర్గను ఊపి సరళ "తల్లీ దుర్గా ! దారి క్లియర్ అయింది. మనను కూడా క్లియర్ చేసుకుని ఇక దయచెయ్," అంటూ సైకిలెక్కింది.

"థాంక్యూ, సరళా; థాంక్యూ!" అంటూ దుర్గ 'టాటా' చెప్తూ కారులో కూర్చొని, స్టార్ట్ చేసింది.

కె. ఎస్. ప్రకాశరావు స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో కథకుడు, నిర్మాత చెరుకూరి ప్రకాశరావు నిర్మించిన మహీజా ఫిలిమ్స్ "ముద్దుల మొగుడు" చిత్రం ఫిబ్రవరి విడుదల.

సినిమా

శుభవార్తలు!

★ రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ శ్రీ జి. కె. రాజు ఆరవ పుత్రుడు, నటుడు సుధాకర్‌కు నెల్లూరు వాస్తవ్యురాలు జయంతి (19), బి. యె., సెకండ్ ఇయర్ చదువుతూన్న యువతితో జనవరి 9 రాత్రి విజయవాడ కనకదుర్గ ఆలయంలో వివాహం జరిగింది. నవ దంపతులు ఆ మర్నాడే 'మధుచంద్ర'కు కాశ్మీర్‌కు బయలుదేరి వెళ్ళారు. "ఆయనెక్కడున్నా ఆయన్ని చల్లగాచూస్తే చాలు—అని భగవంతునికి నా ప్రార్థన," అంటూ సుధాకర్‌కు నటి జయచిత్ర శుభాకాంక్షలు తెలిపింది.

★ నటీమణి జయసుధ చెల్లెలు సుభాషిణికి హైదరాబాదు వాస్తవ్యులు శ్రీ నిడదవోలు సుందరేశ్వరరావు పుత్రుడు అంజనీకుమార్, బి.ఎస్.సి.,తో జనవరి 17న మద్రాసులో పాణిగ్రహణమహోత్సవం జరిగింది.



'బందిపోటు రుద్రమ్మ'లో విజయలలిత



'రాజా—రాణి—జాకీ'లో రాధిక, గొల్లపూడి, రాధిక

★ నటి పద్మప్రియకు జనవరి 17న తిరుచ్చూర్‌లో నాను అనే ఓ బస్సుల ఓనర్ కుమారునితో కల్యాణం జరిగింది. వరుడు సినిమా నటనలో శిక్షణ పొంది, ప్రస్తుతం మద్రాసు టి'నగర్‌లో ఒక నటనా శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.

★ "అడవి సింహాలు, జానీ దోస్త్" చిత్రాలలో ద్విపాత్రలు నిర్వహించిన చింపాంజీ 'లులూ' జనవరి 20 న అమెరికాకు బయలుదేరి వెళ్ళింది. ఈ 'లులూ'కి ఇదివరకే వరుణ్ణి నిశ్చయించినట్లు దీని శిక్షకుడు మైకేల్ తెలియజేశారు.

సినిమా

అమాయక చక్రవర్తిలో కల్లు దొరలు

సత్తిరాజులు (నూతన్‌ప్రసాద్, రాళ్ళపల్లి, కాశీ విశ్వనాథ్) ముగ్గురూ తూలుతూ వచ్చి, అమాంతంగా ఆనంద్ (చంద్రమోహన్) కాళ్ళ ముందు పడిపోయారు. "దొరగారూ, దొరగారూ! చ్చమించండి, దొరా!"

ఆనంద్ ఒక్కడుగు వెనక్కు వేశాడు. "ఏరోయ్, సత్తిరాజులూ! దేనికిరా క్షమించడం? లేవండి... లేవండి!"

"మరేం లేదు, దొరా! పన్జేసే పెతీవోడూ కల్లో గంజో తాగాలని మా అయ్య చెప్పేవాడండి... అందుకని మేం పొద్దునపూట కల్లు తాగి, మద్దేనం పూట గంజి తాగుతున్నామండి... ఈ రోజు


'అమాయక చక్రవర్తి'లో చంద్రమోహన్, విజయశాంతి

'అభిలాష'లో చిరంజీవి, రాధిక


తమరొత్తున్నారన్న సంగతి తెలీక కల్లు తాగేశాం, దొరా!" అంటూ సత్తిరాజులు తలా ఒక మాటన్నారు.

"సర్సరి... ఇవ్వాళ్టికి క్షమిస్తున్నాను. రేపట్నుంచి మందు తాగారంటే, మిమ్మల్ని ఉద్యోగం లోంచి తీసేస్తాను. జాగ్రత్త!" అని ఆనంద్ అంటూండగా లక్ష్మి (జయమాలిని) ఒయ్యారంగా నడుచుకుంటూ వచ్చింది. ఆమెవంకే రెప్పలార్పకుండా చూసిన ఆనంద్ "అరే! ఇది మీ లచ్చితల్లి కదరా? ఇంతలో ఎంతెదిగిపోయింది?" అన్నాడు.

"అయ్!" అన్నారు ముగ్గురు సత్తిరాజులూ, ఆనంద్ ముఖకవళికలు పరిశీలిస్తూ.

లక్ష్మి కులుకుతూ, "ఈసారి ఎన్నాళ్ళుంటారు, దొరగారూ?" అంది.

"జీవితాంతం ఇక్కడే ఉంటానికి వచ్చాను," అన్నాడు ఆనంద్.

చినసత్తిరాజు (నూతన్‌ప్రసాద్) ఆతృతతో "మరి, అమ్మగారు ఎప్పుడొస్తారండి?" అనడిగాడు.


ఆనంద్ ముఖద్యుతులు మారాయి. "అమ్మగారు లేరు; ఇక రారు... వెళ్ళండి... వెళ్ళి మీ పని చూసుకోండి," అంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

"అమ్మగారు లేరు; ఇక రారు... అమ్మగారు లేరు; ఇక రారు... అమ్మగారు లేరు; ఇక రారు..." అనుకుంటూ ముగ్గురు సత్తిరాజులూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. వాళ్ళ చెల్లెలు లక్ష్మిని, ఆనంద్‌కి అంటగట్టాలనే చెడు తలంపు వాళ్ళ చూపుల్లో కనిపించాయి.

విజయబాపినీడు నేతృత్వంలో తుది మెరుగులు దిద్దుకుంటూన్న లలినీ చిత్ర "అమాయక చక్రవర్తి" చిత్రానికి జనార్దన్ దర్శకుడు.

భార్గవ్ ఆర్ట్ ప్రొడక్షన్స్ చిత్రం

"విజయవంతమైన 'గోపురంగళ్ సాయ్ వదిల్లై' తమిళ చిత్రం ఆధారంగా కొత్త పిక్చర్ షూటింగ్‌ను మార్చి 27న మొదలెడుతున్నాం," అన్నారు "మనిషికో చరిత్ర" చిత్ర నిర్మాతలు ఎస్. గోపాలరెడ్డి, చింతపల్లి ప్రసాద్. తమిళంలో అద్భుతంగా పోషించిన నాయిక పాత్రను సుహాసిని తెలుగులోనూ నిర్వహిస్తుంది. గొల్లపూడి మారుతీరావు స్క్రీన్‌ప్లే సమకూర్చి ఒక కీలకపాత్రనూ ధరిస్తారు. గణేశ్‌పాత్రో సంభాషణలకర్త. తాతినేని ప్రసాద్ దర్శకుడు.


గంగాధర్
Maheejaa Films
మహీజా ఫిలిమ్స్
ముద్దుల మొగుడు
నిర్మాత: సి.హెచ్.ప్రకాశరావు
దర్శకత్వం: కె.యస్.ప్రకాశరావు
VEEKAY


'పిచ్చిపంతులు'లో రావుగోపాలరావు, మురళీమోహన్, కృష్ణవేణి



సినిమా

ఎం. ఎస్. రెడ్డి చిత్రాలు

''మా 'కళ్యాణ వీణ' చిత్రంలో హీరో పట్నావాసపు జర్నలిస్టు. హీరోయిన్ పల్లెపడుచు. ఇదొక రసవత్తరమైన సరికొత్త ప్రేమ కథ. ఇంతవరకు సుమన్, అరుణ, పూర్ణిమ, మ్యూజిక్‌కు సత్యంను, డైరెక్షన్‌కు గిరిధర్‌ను బుక్ చేయడం జరిగింది. ఫిబ్రవరి నుంచి షూటింగ్,'' అన్నారు కౌముది అధినేత ఎం. ఎస్. రెడ్డి. ఈయన జూన్, జూలైలలో ప్రారంభించే ''మాణిక్య వీణ'' చిత్రంలో కృష్ణ హీరో. ఆ తర్వాత ఈ సంవత్సరాంతంలోగా మరో చిత్రాన్ని కూడా నిర్మించే ఉద్దేశ్యం ఉందని నిర్మాత చెప్పారు. ''కల్యాణ వీణ'' చిత్రానికి మల్లెమాల కథ, స్క్రీన్‌ప్లే, గీతాలు సమకూర్చారు.



అమితాబ్ బచన్ : జాయ్ ఆఫ్ ది నేషన్

సినిమా కబుర్లు

ఈ దేశంలో అత్యంత ఖరీదైన వ్యక్తి ఎవరో తెలుసా?...అమితాబ్ బచన్. బహుళ జనాదరణ పొందిన పేరు. లక్షలాది ప్రేక్షకుల గుండెల్లో ప్రతిక్షణం మారుమోగే పేరు. బెంగుళూర్‌లో 'కూలి' షూటింగ్‌లో జరిగిన సంఘటనతో ఆయనకు ప్రాణాపాయస్థితికి చేరుకోవడం, ఆతర్వాత బొంబాయి ఆస్పత్రిలో డాక్టర్ల విశేష కృషి, లక్షలాది ప్రజల పూజలు, పునస్కారాలు — ఎలా అయితేనేం ఆయన తేరుకోవడం జరిగాయి.

రెండు చిత్రాలు

మద్రాసులో నిర్మిస్తున్న రెండు హిందీ చిత్రాలలో అమితాబ్ నటిస్తున్నారు. ఒకటి: సత్యచిత్ర ఇంటర్నేషనల్ పతాకంపై శ్రీయుతులు సత్యనారాయణ, సూర్యనారాయణ నిర్మిస్తున్న భారీ చిత్రం 'మహాన్', మరోటి: లక్ష్మి ప్రొడక్షన్స్ పతాకంపై శ్రీ ఏ. పూర్ణచంద్రరావు రూపొందిస్తున్న 'అంధా కానూన్', అమితాబ్ ఆరుమాసాల విశ్రాంతి తర్వాత, సంపూర్ణ ఆరోగ్యం చేకూరిన తర్వాత జనవరి 11వ తేదీన మద్రాసులో జరిగిన సత్యచిత్రవారి ''మహాన్'' షూటింగ్‌లో పాల్గొన్నారు. ఆ షూటింగ్ జరిగే ఏ. వి. యం. స్టూడియో గేటుబయట, 9వ ఫ్లోర్ ముందు 'వెల్‌కం టు ది చిరంజీవి అమితాబ్‌బచన్, జాయ్ ఆఫ్ ది నేషన్' అని రాసిన క్లాత్ బేనర్స్ కట్టబడ్డాయి. అమితాబ్ ఆ రోజు 8–45 ని.లకే ఏ వి. యం.కి వచ్చారు. శివాజీగణేశన్ ప్రత్యేకంగా వాడే మేకప్ రూమ్‌లో ఆయన మేకప్ వేసుకుంటూ రిలాక్సింగ్‌గా కూచున్నారు. నిజానికి ఆయన చాలాముందుగానే వచ్చినా ఆ రోజు 9–10.30 గం.ల మధ్య వర్జ్యం వుంది. పదిన్నర తర్వాత ఆయన ఫ్లోర్ దగ్గరికి వచ్చేసరికి ఆరుగురు పురోహితులు వేదమంత్రోచ్చాటన జరిపి, బొట్టుపెట్టి హారతి యిచ్చి బూడిదగుమ్మడికాయ దిష్టితీసి ఆ తర్వాత షూటింగ్ ప్రారంభించారు. సత్యచిత్ర నిర్మాతలు—మృత్యుంజయుడు అమితాబ్‌కి ఏ దిష్టి తగులకూడదని ఆయన పట్ల అంత ప్రేమాభిమానాలతో తీసుకున్న జాగ్రత్త అది.

రుణం ఎలా తీర్చుకోను ?

''భగవంతుడే కాదు, నా నిర్మాతలు కూడా కరుణామూర్తులు. నాపట్ల ఇంతటి శ్రద్ధాసక్తులు కనపరుస్తున్న వీరి రుణం ఎలా తీర్చుకోగలను!'' అన్నారు, అమితాబ్, దాదాపు రుద్ధకంఠంతో.

పూజ పూర్తయి అమితాబ్ సెట్లోకి అడుగు పెట్టబోతున్నంతలో నిర్మాతలలో ఒకరైన శ్రీ సత్యనారాయణ నలుగురు మోస్తేనేగాని కదలని బరువైన అందమైన పూలదండను అమితాబ్ మెడలో వేశారు. అటుపిమ్మట దర్శకుడు యస్. రామనాథన్, కెమెరామన్ ఎ. విన్సెంట్, తక్కిన సాంకేతికనిపుణులు పూలదండలతో ఆయన మెడను అలంకరించారు. దండలతోనేకాదు, కృతజ్ఞతాపూర్వకంగా కూడా అమితాబ్ మెడ వంగిపోయింది.

ఏది న్యాయం ?

అది కోర్టు సీన్. అమితాబ్ లాయర్ వేషంలో వున్నారు. అన్యాయమైపోయిన ఒక చిన్న కుర్రాణ్ణి చేతులపై తీసుకువస్తూ న్యాయాధిపతిని న్యాయం కోరే దృశ్యం. ''చిత్రంలో యిది అమితాబ్ కేరెక్టర్ ఇంట్రడక్షన్'' అన్నారు, నిర్మాతలలో ఒకరైన సూర్యనారాయణ : ''ఫిబ్రవరి 7వ తేదీ వరకూ అమితాబ్ మద్రాసులోనే వుంటారు. ఈ రోజు కోర్టు సీను పూర్తయితే ఒక పాట మాత్రం బేలన్స్ వుంది. అదికూడా జనవరి నెలాఖరులోగా పూర్తి అయిపోతుంది. మన చిత్రం కంటిన్యుయేషన్ పూర్ణచంద్రరావుగారి 'అంధా కానూన్' పూర్తి చేస్తారు. ఈ రెండు చిత్రాల షూటింగ్స్, డబ్బింగ్స్ పూర్తిచేసి ఆయన ఫిబ్రవరి 8న బొంబాయికి వెళ్తారు.''

తీర్చుకున్న మొక్కు !

ఎపుడూ రిజర్వ్‌డ్‌గా వుండే అమితాబ్ ఆ రోజు అందరితోను కరచాలనంచేసి, ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. ఆయన మొహంలో కళ, మాటల్లో పూర్వపు గాంభీర్యం తొణికిసలాడుతున్నాయి. జనవరి 15వ తేదీన భార్య జయభాదురితో కలిసి తిరుపతి వెళ్లి 16వ తేదీ ఉదయం తిరుమలేశునికి 600 కొబ్బరికాయలు కొట్టి సుప్రభాత దర్శనం చేసుకున్నారు. ఆరోగ్యం కుదుటబడితే తిరుపతి వచ్చి స్వామి దర్శనం చేసుకుంటామని ఆయన శ్రీమతి జయభాదురి మొక్కుకున్నారట !

— మోహన్ కుమార్



'మహాన్' నిర్మాతలతో అమితాబ్ →

దమ్మున్న దర్శకుడు....

ఫిల్మిస్థాన్ స్టూడియోలో 'మేరా ఫైసలా' చిత్రం షూటింగ్‌కి అంతా సిద్ధంగాఉంది. కానీ, తొమ్మిది గంటలకి రావల్సిన ఆ చిత్ర హీరో సంజయ్‌దత్ పన్నెండు గంటలవుతున్నా ఇంకా అయిపులేడు. డైరెక్టర్ రాజేంద్రసింగ్ (మేరీ ఆవాజ్ సునో) అగ్గిమీద గుగ్గిలం అయిపోతున్నాడు. పన్నెండు తర్వాత తాపీగా సెట్లోకి వచ్చాడు సంజయ్. ఇటు సంజయ్‌దత్ 'హలో'అని పలక రించడం, అటు రాజేంద్రసింగ్ 'ప్యాక్అప్' అనడం దాదాపు ఒకేసారి జరిగాయి. 'ప్యాక్అప్' అంటే ఆరోజుకి షూటింగ్ ముగిసిందన్నమాట. ఖంగు తిన్నాడు సంజయ్‌దత్. అంతటితో ఆగలేదు రాజేంద్రసింగ్. ఇలా ఇష్టం వచ్చినట్టు షూటింగ్‌కి వచ్చే హీరో తనకి అక్కరలేదనీ, సంజయ్‌దత్ బదులుగా వేరే హీరోని చూడమనీ చెప్పాడు నిర్మాతకి—

సంజయ్ దత్



షాక్‌నుంచి తేరుకుని సంజయ్‌దత్ డైరెక్టర్‌కి క్షమాపణ చెప్పుకున్నాడు. అంతేకాదు. మర్నాటినుంచీ చెప్పిన టైముకి షూటింగుకు వస్తున్నాడు.


దీని భావమేమనగా దర్శకుడికి దమ్ము, ధైర్యం అంటే ఆత్మవిశ్వాసం, దృఢనిర్ణయం ఉంటే ఎలాంటి సూపర్‌స్టార్ అయినా వేరివేషాలు వెయ్యక క్రమశిక్షణతో పనిచేస్తాడని.

రాయి-పర్వతం....

'మజ్‌దూర్' చిత్రం షూటింగ్ జరుగుతోంది. ఆరోజు షూటింగ్‌లో దిలీప్‌కుమార్, రాజ్‌బబ్బర్ ఉన్నారు.

ఒక పత్రికా విలేఖరి రాజ్‌బబ్బర్‌ని అడిగాడు.

''దిలీప్‌కుమార్‌తో కలిసి నటిస్తున్నప్పుడు మీకెలా అనిపిస్తోంది?''— అని.



''ఏముంది. ఒక నటుడితో మరొక నటుడు కలసి నటిస్తున్నప్పుడు ఎలా ఉంటుందో అలా అని పిస్తోంది''— అని రాజ్‌బబ్బర్ జవాబు.

ఈ జవాబువిన్న ఒక సినీమనిషి ఇలా వ్యాఖ్యా నించాడు. దిలీప్‌కుమారెక్కడ? రాజ్‌బబ్బర్ ఎక్కడ? రాజ్‌బబ్బర్ చిన్నరాయి అయితే దిలీప్‌కుమార్ మహా పర్వతం. దిలీప్ స్థాయిని అందుకోడం రాజ్‌బబ్బర్ వల్ల అవుతుందా... అయితే ఒక్కవిషయం మాత్రం ఒప్పుకోవాలి. రాజ్‌బబ్బర్ నటుడైన నాలుగేళ్లలోనే అరవై చిత్రాల్లో నటిస్తున్నాడు. నలభైఏళ్ల నట జీవితంలో దిలీప్‌కుమార్ ఇంకా అరవై చిత్రాలు పూర్తి చెయ్యలేదు ! క్వాంటిటీకాదు క్రదర్ క్వాలిటీ కావాలి.

ఇప్పుడే పైకివస్తున్న తారలలో ఆత్మవిశ్వాసం ఉంటే మంచిదేగానీ, అనుభవం ప్రతిభగల సీనియర్ తారలను గౌరవించలేని అహంకారం ఉడటం మంచిదికాదు.

రాజ్ బబ్బర్



ముగింపు మారింది....

మన్‌మోహన్ దేశాయి దర్శకత్వంలో తయారవుతున్న 'కూలీ' చిత్రం షూటింగ్‌లోనే అమితాబ్ బచ్చన్ తీవ్రంగా గాయపడటం, మృత్యువుతో పోరాడి బైటపడటం అందరికీ తెలిసినదే. ముందుగా తయారు చేసుకున్న కథప్రకారం 'కూలీ' చిత్రంలో అమితాబ్ బచ్చన్ ధరిస్తున్న పాత్ర చివరిలో మరణిస్తుంది. ట్రాజెడీ ఎండింగ్. అయితే మృత్యువుని ఎదిరించి తిరిగి కోలుకున్న అమితాబ్ బచ్చన్ చిత్రం ఆఖరిలో మరణించినట్టు చూపిస్తే అది ప్రేక్షకులకు నచ్చదేమోనని పెద్ద అనుమానం వచ్చింది మన్‌మోహన్‌కి. అంతే, కథమార్చి సుఖాంతం చేసేస్తున్నాడు. లాంగ్‌లివ్ అమితాబ్.

అయితే 'దీవార్' 'ముకద్దర్‌కా సికందర్' చిత్రాలలో అమితాబ్ పాత్రలు చివరిలో మరణిస్తాయి. ఈ రెండూ సూపర్‌హిట్ చిత్రాలు. కానీ, ఎవరి నమ్మకాలు వాళ్లవి...

కమలహాసన్




కమల్ కా కమాల్ ....

కమలహాసన్ తొలిహిందీ చిత్రం 'ఏక్‌దూజేకే లియే', మలిహిందీ చిత్రం 'సనమ్ తేరీకసమ్' రెండూ ఘనవిజయం సాధించిన సంగతి అందరికీ తెలిసిందే. ఇప్పుడు కమలహాసన్ నటించిన మూడో హిందీ చిత్రం 'ఏతో కమాల్ హోగయా' బొంబాయిలో విజయవంతంగా నడుస్తోంది.

ఈ 'హాట్రిక్'తో కమలహాసన్‌కి హిందీలో మరింత డిమాండ్ పెరిగింది. కమలహాసన్ నటించిన మరో హిందీ చిత్రం 'జరాసీ జిందగీ' (ఆకలి రాజ్యం) త్వరలో విడుదల కాబోతోంది.

రాబోయే చిత్రాలలో కమల్‌కా కమాల్ ఎలా ఉంటుందో... ★

—ఆంధ్రసచిత్రవారపత్రిక—



daCunha/GCM/76/TL/82

నూటికో కోటికో ఒక్కరు

కన్నెపల్లి గోపాలకృష్ణ



వామనరావుకేసి ఓరకంట చూసాను.

తనమీద వినవస్తున్న కామెంట్లను వినవట్లే ఫైలులో ఏదో వ్రాసుకుపోతున్నాడు

అతన్ని చూస్తుంటే ఒక్క క్షణం పీధినపోయే గజరాజు గుర్తొచ్చింది.

అంతేకాదు. ముఖమ్మీద ఉమ్మున అతి సాధారణంగా తుడిచేసుకునే సిగ్గూ లజ్జా లేని వ్యక్తి కూడా గుర్తొచ్చాడు.

ఛ. ఏం మనిషి ?

వాళ్ళమీద, వీళ్ళమీదా పెట్టి తనకేసి చూస్తూ హేళనగా అంటున్నా పట్టించుకోకుండా నిర్వికారంగా ఉంటాడేం ?

చెప్పు తీసి, ముఖమ్మీద కొట్టినట్లు సమాధానం చెప్తే పోలా ?

మొరిగే కుక్కల్లా టేబిల్ చుట్టూ చేరి వాగుతున్న సుబ్బారావు బృందాన్ని చూస్తుంటే అసహ్యమేసింది

ఒక మనిషిని అదేపనిగా మాటల్తో బాధించడానికి వీళ్ళకి మనసెలా ఒప్పుతుందో ?

ఎవరి అలవాట్లు వారివి. అతని వ్యక్తిగత విషయాలను విమర్శించడానికి వీళ్ళకెవరిచ్చారు హక్కు ?

ఫైలుమీద పెన్ను సాగిపోతున్నా నా చెవులు మాత్రం అసంకల్పితంగానే వాళ్ళ మాటలు వింటున్నాయి.

"చూడండి గుర్నాథంగారూ. మీ రెంత పిసినార్లైతే మాత్రం పిల్లలకి కూడా కడుపునిండా తిండి పెట్టకపోతే ఎలాగండీ ? సొమ్మేం కట్టుక పోతారా మీరు ? మీరేవనుకోనంటే నాదో చిన్న డౌటు. కట్టుకున్న దానిక్కూడా సరైన చీర కొనకపోతే ఎలాగండీ ? ఏవండోయ్ వింటున్నారా? — మిమ్మల్నే డబ్బు దేముందండీ ? ఆఫ్టాల్. వెధవ డబ్బు. డబ్బుని మనం సంపాదిస్తాం కానీ డబ్బు మనల్ని సంపాదించదుగదండీ..." అనర్గళంగా సాగిపోతోంది సుబ్బారావు వాక్ప్రవాహం.

ఆ మాటలన్నీ నిజంగా తననే ఉద్దేశించి అంటుంటే గుర్నాథం అంత హాయిగా నవ్వగలడా ?

వామనరావు విని బాధపడాలనే కాదూ వాళ్ళ ఉద్దేశం

సంస్కారంలేని మనుషులు

చేద్దామనుకుంటున్న పనికి ఏకాగ్రత కుదిరి చావడం లేదు

వీళ్ళ మాటలు డిస్టర్బెన్స్ కలిగిస్తున్నాయి.

విసుగ్గా చూసాను

నా చూపును ఆ పట్టున క్యాచ్ చేసేసాడు సుబ్బారావు.

"హల్లో, గురువుగారూ ! ఏంటీ—కథకు ప్లాటు వెతుకుతున్నట్లుందే వాలకం ? అయినా లంచ్ అవర్ టైములో కూడా ఏమిటండీ పని ? క్యాంటీనుకి రారూ ? కొంపదీసి మీరు కూడా మన గుర్నాథంలానే ఆదా చేయడం నేరుస్తున్నారేమిటి ?" వెకిలిగా నవ్వుతూ చొరవగా నా భుజం పట్టుకు నిలబెట్టాడు సుబ్బారావు.

అయిష్టంగానే లేచి, అనుసరించాను

చెయ్యాల్సిన పని కొండంత ఉంది. చకచకా చేసేద్దామనుకుంటే వెధవ బోర్‌గాళ్ళు తయారయ్యారు తిట్టుకుంటూ క్యాంటిన్‌లో ప్రవేశించాను.

టోకెన్లు తీసుకొని ఫలహారాలు పట్టుకొని కుర్చీల్లో కూలబడ్డాం

నా ఎదురుగా కుర్చీలో సుబ్బారావు

ప్లేటులో పూరీ ముక్కలుగా త్రుంచి తినసాగాను.

సుబ్బారావు ఓ ముక్కను తుంచి నోట్లోవేసుకు నములుతూ కూడా వాగడం మానలేదు.

వెధవ కనీస జ్ఞానంలేదు అతని నోటి తుప్పరలు నా చొక్కాను తడిపేస్తున్నాయని గుర్తించడే ?

ఇతని కంపెనీలో టిఫెన్ చేయడం దుర్లభం.

పూరీ ప్లేటుని మవునంగా అవతలకు నెట్టేసి, మంచినీరు త్రాగాను.

"అరే, అదేంటి గురూగారూ ! ఒక్క పూరీ కూడా పూర్తిగా తినలేదు మీరు అలా వదిలేసిన రెండోదాన్నే మళ్ళీ వడ్డించెయ్యగలరు వీళ్ళు" మందలిస్తున్నట్లు అని అంతలోనే నవ్వేసి, నా ప్లేటులో రెండో పూరీని తన ప్లేటులో వేసుకున్నాడు సుబ్బారావు.

"కొంపదీసి రవ్వదోసె కూడా తినరా ఏం ? ఆకల్లేకుండా ఎందుకొచ్చారసలు ? మనీ వేస్టు కాదూ ? సరేన్లెండి. మీరు తినకపోతే వట్టినే వదిలేస్తామా ఏం ? మేమంతా లేమూ !" సర్వర్ నా కోసం తెచ్చిన దోసె ప్లేటుని తనవైపు జరుపుకొంటూ ఆబగా తినసాగాడు.

నేను చూస్తూండగానే రెండు దోసెలూ గుటుక్కున మింగి, గ్లాసునీళ్ళతో గొంతు తడుపుకొని, కంఠం సవరించుకున్నాడు

"చూడండి సార్. అక్కడే ఉంది మనకీ, ఆ వామనరావు గాడికీ తేడా! మీరు ఆకలిలేకపోయినా కంపెనీ కోసం నేను పిలిచిందే తడవుగా వచ్చేసారు కదూ ! వాడో . కడుపులో ఆకలి కరకరమంటున్నా జేబులో డబ్బులు ఎక్కడ అయిపోతాయోనని క్యాంటీనుకి రాడు. అక్కడికీ నేనొన్నోసార్లు ఆఫర్ చేశాను. మనేం ఖర్చు పెట్టనక్కరలేదయ్యా. నేనే ఇప్పిస్తా అని. నేనిసారి ఇప్పిస్తే తను మరోసారి ఇప్పించాలిగా. అందుకని వద్దనేస్తూంటాడు పిసినారి వెధవ."

రహస్యం చెప్తున్నట్లు కొద్దిగా ముందుకు వంగాడు.

"మీరు జాయినై నాల్రోజులు కూడా కాలేదు కాబట్టి మీకు తెలియదు — ఆ వామనరావు ఎంత పిసినారి వెధవో ! బజార్లో కూరగాయలు కొనరట. ఇంట్లో ఉన్న గుప్పెడు స్థలంలోనే డిగ్నిటీ, పాడూ లేకుండా కూరగాయల మొక్కలు వేసుకున్నారట. చూడండి. మా ఇంట్లోనూ పెరడుంది. చక్కగా పూలమొక్కలు వేసింది మా ఆవిడ. కూరలదేముందండీ. మార్కెట్లో దొరకవూ? ఆ బుద్ధులే వేరండీ."

అతను కూరగాయలు కొంటేనేం ? కొనకపోతేనే ? ఇంట్లో పండించుకోవడం నేరమా ?

వధువుల కొరత !

పశ్చిమ జర్మనీలో బవేరియా రాష్ట్రం లోని రైతులకు కొత్త సమస్య వచ్చింది. అక్కడ స్త్రీల కొరత ఏర్పడింది. దాంతో అక్కడున్న ప్రతి అయిదుగురు రైతుల్లో ఒకరు బ్రహ్మచారిగానే ఉంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో పురుషుల జనాభా ఎక్కువగా ఉండటం దీనికి కారణం కావచ్చు. కానీ, అసలు సంగతి ఏమిటంటే రైతు కుటుంబాల లోని ఆడపిల్లలు కూడా రైతులను వివాహం చేసుకొనటానికి అంగీకరించటం లేదు రైతు భార్యగా తగిన ప్రాముఖ్యం లభించదనీ, అత్తగార్లు కోడళ్లను బానిసలుగా చూస్తారని అంటున్నారు. పెళ్ళి కావలసిన బ్రహ్మచారులు పెళ్ళిళ్ళ పేరయ్యల వంటి మ్యారేజి బ్యూరోలకు అధిక మొత్తాలలో ముడుపులు చెల్లిస్తున్నారు. ఇదొక రకంగా దోపిడీ అంటున్నారు వీరు.

మార్కెట్లో కొనుక్కోవడమే గొప్ప విషయమా ? మధ్యతరగతి అతిశయానికి నవ్వు వచ్చింది.

టోకెన్లు తీసుకుపోయి ట్రేలో పొగలు కక్కుతున్న టీలు తెచ్చాడు గుర్నాథం

"గుడ్ బాయ్. అభివృద్ధిలోకి వస్తావు" దీవెన పారేసి, నాకేసి తిరిగాడు సుబ్బారావు.

"మన ఆఫీసు మొత్తమ్మీద గుర్నాథం లాటి మనిషి లేడనుకోండి. చిన్నవాడైనా పెద్దల ఎడ ఎంత వినయమూ, విధేయతా! అన్నట్టు ఇందాక ఇతన్ని గురించి అన్నాననుకున్నారేమిటి ? మన జిడ్డుగాడు లేడూ ! వాడ్ని ఉద్దేశించి అంటున్నా ! మనం ఇలా అంటున్నట్లు తెలుసా గురుడికి, అయినా పట్టించుకోడే ? అబ్బెబ్బే ! బొత్తిగా చీమూ నెత్తురూ లేదండీ" తాపీగా తన అభిప్రాయాలు చెప్తున్నాడు.

నాకు సహనం పూర్తిగా అంతరించింది. వారం రోజుల్లో ఇనెస్పెక్షనని తెలిసినా ఎంత నిబ్బరం ?

వెళ్ళడానికి ఉద్యుక్తుడై నిలబడ్డాను

"కూర్చోండి గురూగారూ ! అంత తొందరేమిటి మీకు ? ఇంకా పావుగంట వుందిగా" నా చెయ్యి పట్టుకొని కూర్చోబెట్టబోయాడు

"క్షమించండి. బోల్డు వర్కు పెండింగులో ఉంది రేపు పొద్దున్న ఇనెస్పెక్షన్‌లో మాట " వదిలించుకొని అన్నాను రెండడుగులు ముందుకేసి

"ఓసి, మీదుంపతెగా ! అదా మీ డవుటు ఇనెస్పెక్షన్ అంటే అంత భయమెందుకండీ బాబూ? ఆ వచ్చే ఆఫీసరుకి మన ఫైళ్ళే చూసే ఓపికా, శ్రద్ధా కూడానా ? వాడి విలాసాలూ, వాడి దర్జా — అంతే ! మరీ అంతగా అడిగాడనుకోండి ఓ చిన్న నవ్వు పారేసి, నాల్గుసార్లు సార్‌సార్ అని వెంట తిరిగితే గుమ్మెపోడూ గురుడూ ! వెళ్తున్నప్పుడు సెండాఫ్ ఇచ్చేసి, ఓ పళ్ళబుట్ట మొహమ్మీదపడేస్తే మనమీద బ్రహ్మాండమైన రిపోర్టు వ్రాసి పడేస్తాడు. ." ఇంకా ఏదో మాట్లాడుతున్నాడు సుబ్బారావు.

అతని మాటలు సగంలో ఉండగానే గబగబా నా సెక్షనుకు వచ్చేశాను.

వామనరావు గోడకేసి కుర్చీ జరుపుకు టిఫిన్ తింటున్నాడు.

లోని కడుగిడుతున్న నన్ను చూసి, "అప్పుడే వచ్చేశారే. రండి సార్" అన్నాడు.

తప్పనిసరిగా అటు అడుగు వేశాను ఇంత వరకూ వాళ్ళదయ్యింది. ఇక ఇతగాడు వాళ్ళమీద ఎన్ని చాడీలు చెప్తాడో ?

పక్కనే కుర్చీలో కూర్చుని ఫైల్స్ తిరగెయ్యసాగాను.

"తీసుకోండి సార్" టిఫెన్ బాక్సు మూతలో రెండు ఇడ్లీలు, ఇంత కారప్పొడి, నెయ్యి వేసి నా వైపు జరిపి అన్నాడు.

"అబ్బే, జస్ట్ టిఫెన్ తీసుకున్నానుగా !" మొహమాటంగా అన్నాను.

"ఫర్వాలేదు సార్ ! ఎంతని ? రెండిడ్లీలు. కొద్దిగా రుచి చూడండి" బలవంతం చేశాడు.

అట్టే మొహమాట పడడం మంచిది కాదని తినడాని కుపక్రమించాను. కారప్పొడీ, నెయ్యీ

కాంబినేషన్‌తో ఇడ్లీలు చల్లారిపోయినా రుచిగా ఉన్నాయి.

అతనందించిన మంచినీళ్ళ గ్లాసందుకొంటూ అదే చెప్పాను,

"మరో నాలుగైనా తెచ్చానుకాదు!" నొచ్చుకున్నాడు వామనరావు.

మా సంభాషణ జరగబోయే ఇనెస్పెక్షన్‌కి పైకి మళ్ళింది.

ఇంతలో లోనికడుగుపెట్టారు సుబ్బారావూ, బృందమూ!

"హల్లో గురూగారూ, ఇక్కడ కూర్చుండిపోయారా? వామనరావు దగ్గర పని నేర్చుకుంటున్నారా?" వ్యంగ్యంగా నవ్వుతూ దగ్గరకొచ్చాడు సుబ్బారావు.

"వామనరావుగారూ! అప్సరలో మంచి ఇంగ్లీషు పిక్చరాడుతోంది. ఈవెనింగ్ వెడదామా? ఆఫ్‌కోర్సు. ఖర్చులు నావేలెండి."

"సినిమాలు చూడ్డం నా కలవాటులేదు సార్! అందులోనూ ఆ ఇంగ్లీషు సినిమాలు అర్థమవుతాయా? పోదా? సారీ సర్" ఫైలు తెరుస్తూ నిర్మొహమాటంగా చెప్పాడు వామనరావు

గురుడి సంగతి అర్థమయ్యింది కదూ అన్నట్టు నావైపు చూసాడు సుబ్బారావు

చూస్తుండగానే వారం రోజులు ఇట్టే గడిచిపోయాయి

ఇన్ని రోజులూ వామనరావు ఒక్క పైసా కూడా జేబులోంచి తీసి ఖర్చుచేయడం నేను చూడలేదు

"టీ, కిళ్లీ, సిగరెట్టు ఆఫ్టాల్ వక్కపొడి కూడా అలవాటు లేదు గురుడికి. డబ్బు ఖర్చవుతుందని అలవాటు చేసుకోలేదు కాబోలు"

రానురానూ నాకుకూడా వామనరావుపైన అసహ్యం పెరగసాగింది.

సుబ్బారావు చెప్పినట్టు "పెళ్ళాం బిడ్డలకి కూడా సరైన తిండి పెడుతున్నాడో లేదో? పోయేటప్పుడు మూట కట్టుకుపోతాడా డబ్బు?

ఇనెస్పెక్షన్ తుఫాన్ వెలసిన సందర్భంగా ఆదివారంనాడు చిన్న పిక్నిక్కు ఏర్పాటు చేద్దామనుకున్నాం సుబ్బారావూ, నేనూ!

ఆఫీస్ స్టాఫంతా ఉత్సాహంగా ఓకే చేసింది

మాటికో కోటికో...

ప్రోగ్రాం

యథావిధిగా వామనరావు సారీ చెప్పాడు.

నేనతన్ని ఒప్పిద్దామని ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇంట్లో ఏదో పనుందంటూ సాకులు చెప్పాడు

నాకు వామనరావుపైన అసహ్యం రెండింతలయ్యింది.

ఈ మనిషితోనా నేను మిత్రుత్వాన్ని కాంక్షించింది?

ఇతన్ని సమర్థిస్తున్నా అప్పుడప్పుడూ నేను సుబ్బారావుతో వాదించేది!

వామనరావు అభిమానాన్ని దెబ్బ తీయడానికే సంకల్పించుకొన్నాను

"మీరేం ఇవ్వనక్కరలేదు సార్! జస్ట్ ఫర్ కంపెనీ సేక్... కానీ ఖర్చవ్వదు మీకు" కావాలనే కర్కశంగా అన్నాను.

సున్నితమైన చోట దెబ్బ తగిలినట్లు విలవిలలాడేడు వామనరావు. మొహం ఎర్రనయ్యింది తమాయించుకొని చెప్పాడు

"థ్యాంక్స్ సార్. నిజంగా మీవంటి మిత్రులున్నందుకు సంతోషంగా ఉంది. అంత అవసరమైనప్పుడు తప్పక హెల్ప్ చేద్దురు గాని"

పిక్నిక్కులో మా అందరికీ వామనరావు కామన్ టాపిక్ అయ్యాడు అతని గురించి జరిగిన గోష్టిలో ప్రథమ పాత్ర వహించింది నేను.

* * *

ఇంకా పెళ్ళికాలేదు కాబట్టి నా స్వేచ్ఛకు సంకెళ్ళు పడలేదు నగరంలో రోజుకో వీధి కాలినడకన సర్వే చేయడం నా సరదా! అన్ని సందులూ గొందులూ చిరపరిచితాలయ్యాయి

ఆదివారం సాయంత్రం —

అప్పుడే కురిసి వెలిసిన చిరుజల్లు పదహారేళ్ళ కన్నెపిల్లలా ఆహ్లాదాన్ని కలిగిస్తోంది కాళ్ళు దారితీసిన వీధిలోకి నడిచాను.

ఎక్కడ నుంచో ఘంటసాల పుష్పవిలాపం సన్నగా శ్రావ్యంగా వినిపిస్తోంది.

"గోపాలకృష్ణగారూ" ఎవరో చప్పట్లు చరిచి పిలుస్తున్నారు

వెనక్కి తిరిగాను ఇంటి ముంగిట నిలబడి పిలుస్తున్నాడు వామనరావు. అతనితోపాటు లోనికడుగుపెట్టాను.

డ్రాయింగు రూము కాబోలు— నాలుగు గోద్రెజ్ ఛైర్స్, ఒక మడత కుర్చీ, సోఫా కం బెడ్ ఉన్నాయి

గుమ్మాలకి పువ్వుల కర్టెన్లు వేలాడుతున్నాయి

లోపలనుంచి పిల్లలు మాట్లాడుతున్న శబ్దం

ఎదురుగా టేబిల్‌పైన అందమైన ఫ్లవర్ వాజ్ పక్కనే టేప్‌రికార్డరు. ఒక్కక్షణం వామనరావు స్తోమతు అంచనా వేసుకొని విస్తుపోయాను పిసినారిగా ఉండే వామనరావు ఇన్ని వస్తువులు కొన్నాడా? ఆశ్చర్యమాశ్చర్యం ఖర్చుని వెరవలేదా?

"కూర్చోండి సార్" సోఫాలో కూర్చోపెట్టాడు

లోపలనుండి ఏడేళ్ళ అబ్బాయి వచ్చాడు

కాటన్ నిక్కరూ, టెరికాటన్ చొక్కా పిల్లాడు ఆపిల్ పండులా ఉన్నాడు

"నమస్తే చెప్పు నాన్నా!"

ఆ కుర్రవాడు నమస్కారం చేశాడు.

"రాజా! మా పెద్దవాడు. లిటిల్ ఫ్లవర్‌లో రెండు చదువుతున్నాడు" "అంకుల్ వచ్చారని చెప్పు అమ్మతో" నవ్వుతూ అన్నాడు రాజాలోనికెళ్ళాడు.

నేనెరిగిన వామనరావు కాదితడు ఎలా మాట్లాడాలో అర్థం కావడం లేదు ఉక్కపోస్తున్నట్లుంది శరీరానికి.

నా అవస్థ గమనించినట్లున్నాడు వామనరావు ఫ్యాన్ ఆన్ చేశాడు

"అలా నిశ్శబ్దంగా ఉండిపోయారేం? మాట్లాడండి సార్!"

ఏమని మాట్లాడను?

నాకు తెలిసిన వామనరావేనా అనిపిస్తోంది

ఇంతలో కర్టెన్ తొలగించుకొచ్చింది వామనరావు మిసెస్ చేతిలో పకోడీల ప్లేట్లతో

టీపాయ్‌పైన ప్లేట్లు పొందికగా సర్దింది

"ఈయనే సరితా రచయిత గోపాలకృష్ణగారు రోజూ పిలవమని ఫంపేస్తున్నావుగా! మంచి కలివిడి వ్యక్తనుకో" నవ్వుతూ చెప్పాడు.

ఆమె చేతులు జోడించింది. నేను కూడా నమస్కారం చేసాను.



"మా సరితకి పుస్తకాల పిచ్చి ఎక్కువేలేండి. కనబడిన పుస్తకాన్ని వదలదు. సరితా ..బేబీ ఏది?"

"లోపల టిఫెన్ తింటోంది మీరు తీసుకోండి అన్నయ్యగారూ" చెప్పింది

"నా గురించి ఎందుకు మీకు వృధా శ్రమ ? ఇవన్నీ ఎందుకిప్పుడు ?"

"మీ గురించి అనికాదు సార్ ! సాయంత్రాలు ఏదో చేస్తూ ఉంటుంది ఆవిడ. తీసుకోండి" తిండికి ఉపక్రమించాడు వామనరావు.

బోర్న్‌విటా తెచ్చి ఇచ్చింది సరిత.

ఆమె కూడా వచ్చి సంభాషణలో పాల్గొంది. ఆమె కలగొలుపుతనం నన్నెంతగానో ఆకట్టుకొంది.

ఒక రెండు గంటల్లోనే ఆ కుటుంబం ఎంతో దగ్గరయ్యింది నాకు

వామనరావుని అండర్ ఎస్టిమేట్ చేసినందుకు మనసు సిగ్గిల్లింది "వస్తానమ్మా" నిలబడ్డాను

"భోజనానికి ఉండరూ ! ఈ పూట మా ఇంట్లోనే" వామనరావు అభ్యర్థన.

"అవును అన్నయ్యగారూ. మాట్లాడుతూ ఉండండి ఒక్క నిముషం" మరో మాటకి ఛాన్సివ్వకుండా లోనికి వెళ్ళిపోయింది సరిత

ప్రతిసారీ మొహమాటపడ్డం ఎబ్బెట్టుగా ఉంటుందనిపించి వారించలేదు నేనూ, వామనరావు అంతర్జాతీయ రాజకీయాల్లో పడ్డాం

సరిత వచ్చి భోజనానికి పిలిచినంతవరకూ కబుర్లు సాగుతునే ఉన్నాయి.

మార్చుకోడానికి ఇస్త్రీ లుంగీ ఇచ్చాడు వామనరావు.

లోపల బాత్‌రూములో సబ్బు, తువాలు పెట్టాడు రాజా

ముఖం కడుక్కు వంటింటిలో అడుగు పెట్టాను

చిన్న అల్మైరా, ఫిల్టర్, గ్యాస్ స్టవ్, పాత్రల స్టాండుతో నీట్‌గా ఉంది

రెండు పీటలు వేసి, కంచాలు పెట్టి వడ్డన ప్రారంభించింది

బంగాళదుంపల వేపుడు, వంకాయ పులుసు పచ్చడి, కందిపొడుం, ఆవకాయ, పెసరపచ్చడి.

కొసరి కొసరి గొంతువరకూ ఆప్యాయంగా అమ్మలా తినిపించింది సరిత. తొలిసారిగా చెల్లెలు లేని లోటు తెలిసివచ్చింది

సరిత భోజనం కూడా పూర్తి అయిన తరువాత వెళ్ళొస్తానని బయలుదేరాను "అప్పుడప్పుడూ వస్తూండండి అన్నయ్యగారూ" చెప్పింది సరిత

నన్ను సాగనంపడానికి వెనకనే వామనరావు.

వీధి మలుపు తిరుగుతుంటే కిళ్లీ బడ్డీ కనిపించింది.

డజను అరటిపళ్ళు తీసుకొని వామనరావు కిచ్చాను చెల్లాయి కివ్వమంటూ.

డ్రింక్‌కి ఆర్డరివ్వబోతుంటే వద్దని వారించాడు వామనరావు డబ్బు దండగంటూ

కిళ్లీ ఆఫర్ చెయ్యబోతే తిరస్కరించాడు

మళ్ళా ఆఫీసులో వామనరావే కనిపిస్తున్నాడు నా కళ్లెదుట.

తమాయించుకోలేక అడిగేశాను.

"మీరేమీ అనుకోనంటే ఒక్క మాట వామన రావుగారూ! మీలో ద్వంద్వ ప్రవృత్తి నాకు అర్థం కావడంలేదు. మీరు పిసినారనీ, పైసా కూడా ఖర్చు పెట్టడానికి వెనుకాడతారనీ, ఇంట్లో కూడా హీనంగానే ఉంటారనీ. ఇలా ఎన్నెన్నో అనుకున్నాం మేము అఫ్‌కోర్సు నా ఊహలకి సిగ్గుపడుతున్నాననుకోండి. మీ నిజరూపం మీ ఇంటిలో తెలిసిపోయింది. ఖర్చుకు మీరు వెరవరని నాకు అర్థమయ్యింది. కానీ మరి ఆఫీసులో. . ఇదేమిటి?" అర్థోక్తితో ఆగిపోయాను.

భుజంమీద చెయ్యేసి, నిర్మలంగా నవ్వాడు వామనరావు

"మీకు తెలియదా మాష్టారూ! రచయితలు—ఊహించేఉంటారు నా నోట వినాలని సరదా! ఒక్క క్షణం ఆలోచించండి నేనుకూడా అందరిలాగే ఖర్చులు చేస్తే ఏ పరిస్థితిలో ఉండి ఉందునో ఆలోచించ లేరూ? పైన ఎవరేమనుకున్నా నాకు పట్టింపు లేదు. నా భార్యా పిల్లలూ ఎప్పుడూ యిబ్బంది అన్న మాట ఎరగకూడదు నా ఇల్లు చక్కగా ఉండాలి నావాళ్ళు సుఖంగా వుండాలి ఇంట్లో సుఖశాంతు లుంటే వృధా ఖర్చు లెందుకు చెయ్యడం చెప్పండి మనం ఖర్చుపెట్టేదేదో ఇంటికిందే పెడితే పోలా?"

నాకు ఒక్కసారిగా కళ్ళు విడినట్లయ్యింది

"అవును. వామనరావు చెప్పింది అక్షరాలా నిజం స్వసుఖం కాదు ప్రధానం. ఇంటిలో వారికి సదు పాయాలు కలగచేయాలి వారి గురించే పాటుపడాలి అందుకోసమే వామనరావు పొదుపు పాటిస్తున్నాడు. ఆ పొదుపు అతనికి మంచి ఫలితాలనే కలుగజేస్తోంది అనుకూలవతి అయిన భార్యా, ఆణిముత్యాల్లాంటి పిల్లలూ, ఇంటినిండా ఫర్నిచరూ . .

హ్యాట్సాఫ్ టూ వామనరావు

నా దృష్టిలో వామనరావు ఉన్నతంగా ఎదిగి పోయాడు

*   *   *

ఈ కథ ప్రారంభించేటప్పుడు ఈ ముగింపు సరిపోతుందనే అనుకున్నాను.

కథంతా మరోసారి చదివిన తరువాత వామన రావుని నేను సరిగ్గా చిత్రీకరించలేదనే అనిపించింది.

కథలో కేవలం పొదుపు మహత్యమే కనబడు తోందిగానీ వామనరావు విశిష్ట వ్యక్తిత్వం కనిపిం చడంలేదెక్కడా!

ఈ కథ పత్రికలకు పంపి వామనరావుకి అన్యాయం చెయ్యలేను

ఏ విధమైన ముగింపు ఇచ్చి వామనరావుకి న్యాయం చెయ్యాలా అని ఆలోచిస్తున్న తరుణంలో ఒక నెల మొదటి తారీఖు రోజు—

నెల రోజుల వెట్టిచాకిరీ జీతం అందుకొన్న నాడు మరచిపోతాం.

ఎవరి కుర్చీల్లో వాళ్ళం కూర్చొని జీతాలు లెక్కిస్తున్నాం

యథావిధిగా నా ఎదురు కుర్చీలో సుబ్బారావు లెక్కపెట్టుకుంటూ—

అతనికీ, నాకూ ఈమధ్య టెర్మ్స్ బాగాలేవు.

వామనరావుని అతడు చీటికీ మాటికీ ఏదో అంటూండడం, వామనరావుని వేనకేసుకొని నేను ఖండిస్తూండడంతో మా మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతోంది. ఆదీగాక సుబ్బారావు నాకు ఇవ్వవలసిన వందరూపాయలూ అడిగినందున మా మధ్య ముడి మరింతగా బిగుసుకొంది.

జీతం లెక్కపెట్టడం పూర్తిచేసి సుబ్బారావు కేసి ఓరకంట చూసాను.

పెన్ను తీసుకొని కాగితంమీద ఏవేవో అంకెలు వేస్తూ వాడిపోయిన ముఖంతో దిగులుగా ఉన్నాడు మానవుడు.

ఇంతలో సుడిగాలిలా దూసుకొచ్చాడు ఓ ఆజాను బాహువు

గళ్ళచొక్కా, కోరమీసం, ఎరుపుకళ్ళు—ఒకటో రకం లక్షణాలన్నీ ఉన్నాయి గబగబ సుబ్బారావు దగ్గరకుపోయి నిలబడ్డాడు

తడబడుతూ లేచాడు సుబ్బారావు

"ఏమయ్యా పెద్దమనిషీ! నాలుగునెలల నుంచి ముఖం చాటేస్తున్నావ్. ఇదిగో, అదిగో అని రోజులు గడుపుకొస్తున్నావు ఎగెయ్యడానికి మీ అబ్బగాడి సొమ్మనుకున్నావా?" ఉరుము ఉరిమినట్లు అన్నాడు.

అతని భుజమ్మీద చెయ్యేసాడు సుబ్బారావు

"పదండి సార్ ఇక్కడకాదు అలా క్యాంటీన్‌కి పోయి మాట్లాడుకొందాం" నవ్వడానికి విఫలయత్నం చేస్తూ అన్నాడు

"సరి సరిలే పరువుకోసం ఇంకా ఎందుకయ్యా ప్రాకులాట? నీ గురించి పదిమందికీ తెలియొద్దూ! చూడండి సార్ బ్రాకెట్లు ఆడేటప్పుడు, జూద మాడేటప్పుడు మేం గుర్తొస్తాం జీతాలందుకొనే టప్పుడు మా ముఖాలు గుర్తు రావు" నా వంక తిరిగి చెప్తున్నాడు

"ఈ నెల సర్దలేను లింగరాజా లోన్‌కప్లై చేసాను. వచ్చేనెల నీ సొమ్ము పువ్వుల్లోపెట్టి ఇచ్చేస్తాను. ఈ ఒక్కసారికీ ఊరుకోవయ్యా" చేతులు పట్టుకు బతిమాలుతున్నాడు సుబ్బారావు

"ప్రతినెలా ఇదే మాట చెప్తున్నావ్ మేమిలా ఊరుకొంటే మా వ్యాపారం చెట్టెక్కిపోదూ నెత్తికి చేతులొస్తాయి మాకు. రెండువేల రూపాయలూ పట్టుకెళ్ళేటప్పుడు నవ్వుతూ పట్టుకుపోయావుగా! తీర్చవయ్యా" సుబ్బారావు చొక్కాజేబులోని నోట్లు లాగేసాడు అతను.

"ప్లీజ్ లింగరాజా. ఈ ఒక్కనెలా నా పరువు కాపాడు. పాలవానికీ, పనిమనిషికీ ఇవ్వాలి. పిల్లాడికి ఫీజు కట్టాలి. ప్లీజ్" చేతులు జోడిస్తూ అన్నాడు సుబ్బారావు.

"దగుల్బాజీ వేషాలెయ్యక అప్పరసెంటర్లో సానిపాపల దగ్గరకెళ్ళేటప్పుడు ఇవన్నీ గుర్తుకు రాలా? ఎన్నాళ్ళు ఊరుకోమంటావు మమ్మల్ని ఇదిగో ఇప్పుడే చెప్తున్నా! ఈ అయిదొందలూ పట్టుకు పోతున్నా. వచ్చేనెలలో పూర్తి సొమ్ము జమ కట్టకపోతే మర్యాద దక్కదు" చిల్లర నోట్లని విసిరేసి, విసురుగా వెళ్ళిపోయాడు

జీవచ్ఛవంలా కుర్చీలో కూలబడి, చేతుల్లో ముఖాన్ని దాచుకున్నాడు సుబ్బారావు సుబ్బారావు అసలు రూపం ఇదన్నమాట

పేకాటకీ, బ్రాకెట్లకీ, ముండలకి తగలేస్తూ అప్పులు చేస్తున్నాడన్నమాట.

ఈ లెక్కన ఇంట్లో పెళ్ళాం, పిల్లలకి పస్తులే!

తనలో లోపాలు ఉంచుకొని పరాయివాళ్ళని వెక్కిరించే ఇడియెట్!

మేడిపండు!!

సుబ్బారావు పైన నాకు ఏ మాత్రమూ జాలి కలగడం లేదు.

అటువంటి వారికి కావలసిన శాస్తే ఇది.

సుబ్బారావు బృందం చుట్టు పక్కలెక్కడా కనిపించడం లేదు

బహుశా అప్పుడు గుతాడని కాబోలు ఒక్కొక్కరూ జారుకున్నారు

గోడ గడియారం టిక్ టిక్ మంటోంది

కుర్చీలో కూర్చొని ఫైలు తెరవబోయాను

దగ్గరగా అడుగుల చప్పుడు తల ఎత్తాను

సుబ్బారావు టేబిల్ దగ్గర నిలబడ్డాడు వామనరావు.

సుబ్బారావు ముఖం ఇంకా చేతుల్లోంచి బయటకు రాలేదు

ఇన్నాళ్ళూ సుబ్బారావు తన మీద విసిరిన విసుర్లకి తగిన సమాధానం చెప్తాడా వామనరావు? పొదుపులోని గొప్పతనాన్ని గురించి ఉపన్యసిస్తాడా?

కుతూహలంగా చూస్తున్నాను

చొక్కా జేబులోంచి మూడు పచ్చకాగితాలు తీసి, పేపర్ వెయిట్ క్రింద పెట్టాడు వామనరావు

"చూడండి సుబ్బారావుగారూ! ఎందుకంత దిగాలు పడిపోతున్నారు? మిమ్మల్ని ఆదుకోడానికి మేమంతా లేమూ? ప్లీజ్, బిబోల్డ్ ఈ డబ్బు చెల్లాయికివ్వండి ఆపైన అవసరమైతే చెప్పండి ఇస్తాను. ఆ మార్వాడికి నేను చెప్తాను నెలవారి తీరుద్దురుగాని" భుజమ్మీద తట్టి, తన సీటు వైపు నడిచాడు

ఆ క్షణంలో వామనరావు ముల్లోకాల్నూ ఆక్రమించిన వామనుడిలాగాగే కనబడ్డాడు నాకు అతని ముందు మరుగుజ్జులం మేమందరం

అవును. నిజం?

సుబ్బారావు మెల్లగా నిలబడ్డాడు

కంటినిండా కన్నీళ్ళు

ఒక్కో అడుగు వేసుకుంటూ వామనరావు దగ్గరకెళ్ళాడు

ఒక్కసారిగా అతన్ని కౌగలించుకొని వెక్కివెక్కి ఏడవసాగాడు సుబ్బారావు ★

చిరునామాలు: మనవి

పత్రికలోపడ్డ రచయితుల చిరునామాలు కావాలని రాయవద్దని మనవి. మీరు వారికి రాసే ఉత్తరాలు కేరాఫ్ ఎడిటర్, ఆంధ్ర సచిత్రవారపత్రిక, గాంధీనగరం విజయవాడ—3 అని రాసినట్లయితే—మా కార్యాలయం వాటిని "రీ డైరెక్టు" చేయడానికి ప్రయత్నిస్తుంది. కనుక రిప్లయి కార్డులు రాయవద్దని మనవి

— సం॥

ప్రశ్నావళి
కె. రామలక్ష్మి

కృష్ణవేణి — విజయవాడ

నవల్సులో నాయికా నాయకులని శిరస్సు నుంచి పాదాలదాకా వర్ణించి వర్ణించి అంతటితో ఆగక — వారి కారు, బంగళా బంగళా ఆవరణలో చెట్లు వాటి పూలు పరిమళాలు వాటి జాడలు వారు వాడే ప్రతి వస్తువూ చివరికి పెంచే కుక్కల్ని కూడా వర్ణిస్తూ — చిన్న కథను పెద్ద కథ చేస్తున్నారు. ఈ శ్రమ దేనికి ? పాఠకులని ఆకర్షించడానికేనా ? కథలు పెంచడానికా ?

★ ఈమధ్య ఓ నవలలో హీరో హీరోయినుల పంచరంగుల ఊహాయాత్రలో సెట్ సామాన్లు కూడా వర్ణించింది ఆర్ సంధ్యాదేవి. వారొకరినొకరు చూసుకోగానే — ఆకాశం మబ్బులు ఇంద్రధనుస్సు ఆ చివరా యీ చివరా నాయికీ నాయకులు — దర్శకుని పని సులువైపోలేదా ?! కెమెరామెన్ పని, కళాదర్శకుని పని అందరి పనీ — సులభం అవుతోంది కదా ? అందుకే — ఏ పుట్టలో ఏ పాము వుందో అన్నట్టు చదువుతున్నారు — ఆధునిక నవలలని — అందరూ. మీరిలా అపార్థం చేసుకుంటే ఎలా ? ఆధునిక రచయిత్రి నలుపు తెలుపు కలలు కనడం దండుగ — ఎలాగా కలే — రంగులలోనే కననీయండి !

వై. ఎస్. ఆర్. పి. — కారంచేడు

అన్నా చెల్లెళ్ల అనుబంధాన్ని కూడా గుర్తించక అపోహలు సృష్టించే యీ సంఘం మీద మీ అభిప్రాయం ?

★ మీరు చెప్పకపోతే సంఘానికి తెలియాలని రూలు లేదే ! కొన్ని రకాల ప్రవర్తనలనుపట్టి కొన్ని రకాలుగా అనుకుంటారు. అది అబద్దం అయితే ఇగ్నోర్ చేయండి మధ్యన యీ ఆడిపోసుకోవడం అనవసరం

బి. ఎస్. ఎస్. — కాశీపేట

నేటి సమాజంలో వర్ణాంతర వివాహములు ఎంతవరకు సమంజసం ?

★ కోరి చేసుకుంటే— అవి ఏ సమాజం లోనైనా సమంజసమే.

ప్రస్తుతం వస్తున్న తెలుగు సినిమాలపై మీ అభిప్రాయం ?

★ చెప్పడం కష్టం— బాగా ఆడితే సంతో షిస్తున్నారు. పోతే బాధపడుతున్నారుగాని నిర్మాతలు ఎందుచేత ? అని ప్రశ్నించుకోడం లేదు. అంచేత ఎక్కువమంది చూస్తే హిట్, తక్కువమంది చూస్తే ఫ్లాపూ అనుకోడమే.

జి. ఎల్. — ప్రేమనగరం

నీళ్లు స్త్రీలే మోస్తారెందుకు ? బలవంతులు కదా తేవచ్చుకదా ?

★ తెస్తారు ఏ మూతిదగ్గిరో, కొళాయి దగ్గిరో మీ ఆడాళ్లే నవ్విపోతారని భయం ! అయినా కావిళ్లతో నీళ్లు ఎందరో మోస్తారు చూడలేదా మీరు ?

టి. వి. — హైదరాబాదు

మగవాళ్లమీద ఇంత ద్వేషమున్న మిమ్మల్ని ఇంట్లో ఎలా భరిస్తున్నారో కదా ?

★ ఏముంది అగ్నిప్రమాదం రాకుండా గాస్ దగ్గిరకి వెళ్లనివ్వరు! కూర్చోపెట్ట తిండిపెట్టారు నే ఋసకొట్టినప్పుడల్లా ఏమేతో పడేస్తారు అంచేత— ప్రమాదాలు జరగడంలేదు (లేకపోతే ఏమిటండీ ! ఉన్నమాట చెప్తే— ద్వేషమూ లేని మాట చెప్తే అబద్ధమూ అంటే ఎలా ?!)

ఉషాస్పందన — కర్నూలు

ఇప్పటివరకూ మీ జవాబులలో స్త్రీకి ప్రాధాన్య మిస్తున్నారు. ఏమైనా అడిగితే స్త్రీ జీవితం అరిటాకు లాంటిది అంటూ సినిమా డైలాగులు చెపుతారు. మరి మగవారి జీవితం ఎలాంటిదని మీ అభిప్రాయం? పాపం మీకేం తెలుసు వారి కష్టాలు

★ అదేమిటి మగవాడైనట్టు చెప్పేస్తున్నావ్ ఉషా ?! నేను సినిమా డైలాగులు చెప్పలేదు చెప్పనుకూడా. ఇక అన్నిటికీ ఆడదానిపై ఆధారపడే మగవాడికి కష్టాలేముంటాయి ?!

టి. ఎన్. బి. — కదిరి

నాకు కథ రాయాలని వుంది. సలహా కావాలి కథకు ఏ పేపరు ఏ పెన్ను ఏ ఇంకు వాడాలి ? కథ ఎటువంటిదైనా అబ్జక్షన్ ఏమైనా వుందా ?

★ ఎవరికీ ? ఎందుకూ ?! . తమరు తమ కథని తమకు నచ్చిన కాగితం మీద తమకి ఇష్టమైన ఇంకుతో తమకి అచ్చొచ్చిన కలంతో హాయిగా రాసుకోండి . ఏదైనా వస్తే చదివేవాళ్లు చస్తారు! మీ కెందుకు వారి బాధ ? ★

నీలాకాశం

సీరియల్ — శ్యామల

నీరు వేగంగా వచ్చేస్తోంది వెనక్కి చూడటం ఆపేసి ముందుకి రాసాగారు చాలా మంది సుధాకర్ వెనక్కి వెళ్ళకుండా, ముందుకి రాకుండా అలాగే నిలబడి ఉన్నాడు

"సుధాకర్ వచ్చేసెయ్! అతన్ని రక్షించలేవు! నీవూ ప్రమాదంలో పడ్తావు, రా!" అని అరుద్దామనిపించింది ఇందిరకి కాని నోటి మాట పెగల్లేదు గొంతు తడారిపోయింది— పడి కొట్టుకుపోతున్న ఆ వ్యక్తిని, ఆగిపోయిన సుధాకర్‌ని చూస్తుంటే

సుధాకర్ నడుముదాకా నీళ్ళు వచ్చేసాయి చటుక్కున వంగొని అతని వైపు బలంగా ఈద సాగాడు అందరూ భయంతో లటే చూడసాగారు

పడిపోయిన అతను కష్టపడి ఈదుతూ వెనక్కి రావాలని ప్రయత్నిస్తున్నాడు కాని అతని శక్తి హరించుకుపోతున్నది

సుధాకర్ అతని వైపుకు ఈదుతూ వెళ్ళ సాగాడు

ఇద్దరూ దూరంగా ఇంకా దూరంగా వెళ్ళి పోతున్నారు కనబడటం లేదు

ఇందిరకు భయంతో శరీరం వణికిపోతున్నది

సరిగ్గా ఏం జరిగిందో, ఎలా జరిగిందో తెలియలేదు కాని, కొద్దినిమిషాలలో— ఒకచేత్తో ఆ వ్యక్తిని గట్టిగా పట్టుకొని, మరొక చేతితో చెట్టుకొమ్మ ఒకటి అంది పుచ్చుకున్నాడు సుధకర్ ఎలా సాధ్యమయిందో కాని తాను చెట్టెక్కి, అతన్ని కూడా ఎక్కించాడు గట్టిగా అతన్ని, కొమ్మలని కూడా పట్టుకొని కూర్చున్నాడు

(గత సంచిక తరువాయి)

ప్రసాద్‌కి, ఇంకా కొందరికి సుధాకర్ సాహసం చూసేసరికి ఉత్తేజం కలిగినట్లయింది కాబోలు, పడవ ఒకటి తీసుకొని, బాగా నేర్పరులయిన జాలరి వాళ్ళను వెంటబెట్టుకొని ఆ ఉధృతంలోనే ప్రయాణమయినారు బలంగా తెడ్లువేస్తూ, అలలపైన ఎలాగో బ్యాలెన్స్ చేస్తూ ఆచెట్టును చేరుకున్నారు అతి చాకచక్యంగా సుధాకర్‌ని, అతను రక్షించిన వ్యక్తిని క్రిందికి పడవలోనికి దింపి నీటి బయటకు తీసుకువచ్చారు దాదాపు స్పృహలేని స్థితిలో ఉన్నారు వారిద్దరూ చేతులమీద తీసుకొని వచ్చి గుడి మంటపంలో పడుకో బెట్టారు

ఇందిర పరిగెత్తింది "సుధాకర్! సుధాకర్!" అతన్ని ఊపుతూ పిలిచింది ఏడుపు వచ్చేసింది

వరద కబురువిన్న డాక్టర్ జాక్సన్ వెంటనే ప్రక్కఊరినించి వచ్చేశారు జీపులో సుధాకర్‌ని, మరొక అతనిని క్లినిక్‌కి తీసుకు వెళ్ళారు

ఆ రాత్రికి వాన తగ్గింది చెరువు నీరు వెనక్కి వెళ్ళింది.

సుధాకర్ రక్షించిన వ్యక్తిపేరు రామం ఆ ఊరి పంచాయితీ ఆఫీసులో ఉద్యోగి గుడిసెలలోని జనానికి సహాయపడటానికి వచ్చి తను ఆపదలో చిక్కుకున్నాడు కొద్దిసేపటికే స్పృహ వచ్చి, ప్రమాద పరిస్థితి దాటాడు

సుధాకర్‌కి విపరీతంగా జ్వరం ముంచుకు వచ్చింది డాక్టర్ జాక్సన్, నర్స్ అతన్ని కనిపెట్టుకొనే ఉన్నారు ఇంజెక్షన్స్ ఇస్తూ, మందులువేస్తూ వేయికళ్ళతో చూసుకుంటున్నారు అతను పూర్తిగా స్పృహ లేకుండానూ లేదు, అలాగని మెలకువగానూ లేదు ఏదేదో కలవరిస్తూ, రెస్ట్‌లెస్‌గా ఉన్నాడు పిలిస్తే పలకటం లేదు

ఇందిరకు భయంగా, కంగారుగా ఉన్నది నిమిషం అతని గదిలో ఉండటం, అతను అట్లా పడుకొని ఉంటే చూస్తూ కూర్చోలేననిపించి బయటకు రావటం, బయట అతనికి దూరంగా ఉండలేక తిరిగి లోపలికి వెళ్ళటం—ఏమీ తోచకుండా తిరుగుతున్నది పద్మ, ఆమె తల్లితండ్రులు, ప్రసాద్, అతని తల్లితండ్రులు అక్కడే ఉన్నారు ఎవరికీ ఇంటికి వెళ్ళాలని లేదు ఉష ఒక బెంచీమీద పడుకొని నిద్రపోయింది

రాత్రి గడుస్తున్నది పది పదకొండు పన్నెండు గంటలు కూడా అయిం* సుధాకర్‌కి తెలివి రాలేదు డాక్టర్ జాక్సన్ తను చేయగలిగినదంతా చేస్తున్నారు ఆయన సుధాకర్‌ని స్వంత కొడుకులాగా పెంచారు అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నా, డాక్టరుగా పైకి ఆందోళన కనబడనీయటం లేదు ఎంతో నిగ్రహం చూపిస్తూ, అతి సామాన్యంగానే అందరితో ధైర్యంగా మాట్లాడుతూ వైద్యం చేస్తున్నారు ప్రక్క ఊరిలోని హాస్పిటల్‌కి తీసుకువెళ్తే మంచిదేమోననే ఆలోచన కలిగినా, వర్షం వలన రోడ్లు అనువుగా లేవు ప్రయాణంలో ఈ కుదుపులు ఈ పరిస్థితిలో మరీ ప్రమాదం అందువలన ప్రసాద్‌ని ఆ హాస్పిటల్‌కి పంపించి ఆక్సిజన్ సిలిండర్ తెప్పించి సిద్ధంగా వుంచారు

ఇందిర హాల్లో అటు, ఇటు తిరుగుతున్నది ఎదురుగా గీతోపదేశం చేస్తున్న కృష్ణుని పటం సైతం ఏమీ సాంత్వననీయలేక పోతున్నది 'అమ్మా, నాన్న నన్ను వదిలి వెళ్ళిపోయినట్లే, నీవూ వెళ్ళి పోతున్నావా సుధాకర్' అనుకుంటే కళ్ళనీళ్ళు తిరుగుతున్నాయి 'సుధాకర్, నీవు బ్రతికి డాక్టరుగా ఎందరివో బాధలు తీర్చాలి ఎందరినో బ్రతికించాలి . ప్లీజ్, సుధా వెళ్ళిపోకు ' పదేపదే అనుకుంటున్నది మనసులో

వరలక్ష్మిగారు దేవుళ్ళకి మొక్కుకుంటున్నది

బయట చిక్కని చీకట్లు ఆ మేడనిండా లైట్లు అందరి మనసుల్లో ఆశాదీపాల రెపరెపలు

రాత్రి గడిచిపోతూనే ఉన్నది

రెండు గంటల సమయంలో— డాక్టర్ జాక్సన్ సుధాకర్ పడుకొని ఉన్న గదిలోనించి బయటకు వచ్చారు అందరూ ఆత్రుతగా ఆయన వైపు చూశారు


జరిగిన కథ — 16 సినిమా చూసి స్కూటర్‌మీద వస్తూ యాక్సిడెంట్‌లో మరణిస్తారు ఇందిర తల్లిదండ్రులు తన తమ్ముళ్ళ, చెల్లి భవిష్యత్తు తీర్చిదిద్దడానికి ఉద్యోగంలో చేరాలనుకుంటుంది ఇందిర డాక్టర్ జాక్సన్‌తో ఇందిరకు పరిచయం కల్గుతుంది తన దగ్గర టైపిస్ట్‌గా జేరమని జాక్సన్ ఇందిరను ఆహ్వానిస్తాడు పరీక్షలవగానే చెల్లిని తీసుకురమ్మని తమ్ముళ్ళకి చెప్పి తను ముందుగా వస్తుంది ఇందిర పట్నంలో పెరిగిన ఇందిరకు ఆ పల్లెటూరి వాతావరణం, అక్కడి మనుష్యుల మనస్తత్వాలు నచ్చుతాయి ఉషని తీసుక వచ్చి దించి వెళతాడు సురేష్. పల్లెటూర్లలోని మనుషుల మనస్తత్వాలు ఎలా వుంటాయో, మూఢనమ్మకాలు వాళ్లలో ఏ విధంగా పాతుకుపోయాయో తెలియజేయటానికి డాక్టర్ అరుణకు, ఇందిరకు గతంలో జరిగిన ఓ సంఘటన వివరిస్తాడు డా॥ జాక్సన్ ఇందిరకు పద్మ తన కథను వివరిస్తుంటుంది బావ ప్రసాద్‌తో తన పెళ్ళి ఇంకా రెండురోజులుండనగా అతని కాలికి ఫ్రాక్చరయి హాస్పటల్‌లో జేరతాడు పద్మ నష్టజాతకురాలని, ఆమె మూలంగానే తన కొడుక్కి ఈ విధంగా జరుగుతోందన్న మూఢనమ్మకంతో వారిద్దరి పెళ్ళి జరగకుండా చేస్తుంది ప్రసాద్ తల్లి. రమేష్ రాకకోసం ఎదురు చూస్తుంటారు ఇందిర, ఉష ఇందిరకు సుధాకర్ తన ప్రేమ కథ వివరిస్తుంటాడు కొన్ని కారణాలవల్ల సుందరి సుధాకర్‌ను వదులుకొంటుంది మధు తనని కాకుండా వేరే అమ్మాయిని పెళ్ళి చేసుకుంటున్నాడని తెలుసుకొన్న ఇందిర మనసు గాయపడుతుంది సుధాకర్ ఇందిరతో, 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నీకోసం ఎంత కాలమైనా వేచివుంటాను' అని చెప్తాడు ఈలోగా వూళ్ళోకి వరద రావడంతో ఇందిరతో కలసి సుధాకర్ సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తుంటాడు

"జ్వరం జారింది ఇంక ప్రమాదంలేదు."

"అమ్మయ్య!" గుండెలమీద చేయివేసుకుంది వరలక్ష్మిగారు అందరి ముఖాల్లోనూ రిలీఫ్ కనిపించింది

పెదవులు కంపిస్తూండగా "థాంక్యూ గాడ్, థాంక్యూ!" అనుకుంది ఇందిర అప్రయత్నంగా

చిన్నగా లేచి అతని గదివద్దకు వెళ్ళి, కర్టెన్ కొద్దిగా జరిపి చూసింది, మంచంమీద సుధాకర్ ప్రశాంతంగా నిద్రపోతున్నట్లే కనిపించాడు కొద్ది సేపటిక్రితం ఏదేదో కలవరిస్తూ, అసహనంగా అటు ఇటు కదులుతున్న వ్యక్తి ఇప్పుడు హాయిగా నిద్రలో ఉన్నాడు కుర్చీలో కూర్చొని ఉన్న నర్స్‌ని ఇవతలికి పిలిచింది ఇందిర ఆవిడ చిరునవ్వుతో బయటకు వచ్చి "ప్రమాద పరిస్థితి దాటిపోయింది ఇంకే భయమూలేదు" అన్నది



"మీరువెళ్ళి కొంతసేపు పడుకోండి. ఇక్కడ నేను కూర్చుంటాను" అన్నది ఇందిర.

"ఇంకొక అరగంట చూసి నేను వెళ్తాను అప్పుడు నీవు ఉందువుగాని ఇక్కడ కాస్త కాఫీ తెచ్చి పెట్టగలవా?"

"ష్యూర్!" రివ్వున పైకి పరిగెత్తింది ఇందిర హరి కనుకుపాట్లు పడుతున్నాడు. అతన్ని లేపకుండానే స్టవ్ వెలిగించి కాఫీ కలిపి గ్లాసులలో పోసి ట్రేలోపెట్టి కిందికి తీసుకువచ్చింది. ముందుగా డాక్టర్ జాక్సన్ గదిలోకి వెళ్ళింది. ఆయన ఒక్కరే కుర్చీలో కూర్చొని ఏదో ఆలోచిస్తున్నారు.

"థాంక్స్ ఇందిరా" అంటూ కాఫీగ్లాసు తీసుకొని "నీకు ఉదయం జ్వరం వచ్చింది కాదా, ఎలా ఉన్నావు?" అని అడిగారు.

ఇందిర నవ్వింది "నా జ్వరం విషయం మరిచేపోయాను, అంటే తగ్గిపోయిందన్న మాటేగా!"

"గుడ్!" ఆయనా నవ్వారు "రెండురోజుల్లో సుధ మామూలు మనిషవుతాడు, దిగులు పడకు!"

ఇందిర నర్స్‌కి కాఫీ అందించి, హాల్లోకి వచ్చే సరికి ప్రసాద్, అతనితల్లి తండ్రులు మాత్రమే ఉన్నారక్కడ ఇందిర వాళ్ళకు కాఫీ యిస్తుంటే ప్రసాద్ చెప్పాడు "పద్మ వాళ్ళంతా యింటికి వెళ్ళారు ఉష నిద్రపోయింది కదా, ఎత్తుకొని తీసుకు వెళ్ళారు"

ఇందిరకు కాస్సేపు ఒంటరిగా ఉందామనిపించింది తన గ్లాసు తీసుకొని ప్రక్కనే ఉన్న చిన్న గదిలోకి వెళ్ళి కూర్చుంది

"మొత్తానికి గండం గడిచింది" ప్రసాద్ తల్లి స్వరం వినిపించింది ప్రసాద్ స్నేహితుడిగా సుధాకర్ పట్ల ఆవిడకీ ఎంతో అభిమానం

"అసలు నీళ్ళలో నేను పడిపోయేవాడిని అమ్మా! అనుకోని విధంగా తట్టుకొని నిలబడ్డాను." ప్రసాద్ అన్నాడు.

"అదేమిటి?"

"నిజం నాన్నగారూ! చెరువు బాగా పొంగక ముందే గుడిసెలలో వాళ్ళందరినీ ఖాళీ చేయించి పంపించాము. మేము వచ్చేస్తుండగా వరద ఎక్కువయింది. నాకు కాలుజారింది. పడిపోబోతుంటే ఎవరిదో చేయి నన్ను పట్టుకొని నిలబెట్టింది."

"ఆ పుణ్యాత్ముడు ఎవరు?" కొడుకుకి తప్పిన ప్రమాదం గురించి వింటుంటే ఆవిడకు గుండె జలదరించినట్లే అయింది.

"నన్ను పట్టుకున్న ఆ చేతికి గాజులు ఉండటంతో ఆశ్చర్యంగా చూశాను. పద్మ నిలబడి ఉంది నా ప్రక్కనే, మోకాలు లోతు నీళ్ళలో!"

"పద్మా!?"

"అవునమ్మా! నేను విస్మయంగా ఏదో అనబోయేటంతలోనే నా చేయి పట్టుకొని నీరు దాటించి ఆ తర్వాత మాయమయింది ఇదంతా నా భ్రమే కావచ్చు మరేదైనా కావచ్చు కాని పద్మే నన్ను రక్షించిందమ్మా."

"నిజమే బాబూ!" ఆవిడ గొంతు కంపిస్తున్నది "మీ పెళ్ళి అయి ఉంటే, ఇది పద్మ మాంగల్యబలం అనేదాన్ని కాని ఇప్పుడు —"

"ఇప్పుడు కూడా పద్మ ప్రేమబలం అనుకో కూడదా లలితా?" ప్రసాద్ తండ్రి అన్నాడు "ఆ పిల్ల వలన నీ కొడుకుకి ఏవో చిన్నప్రమాదాలు సంభవించినాయని భయపడ్డావు ఇప్పుడేం జరిగిందో చూడు! ఆ పిల్ల రూపమే వీడిని ప్రాణాపాయంలో నించి బయటకు తీసుకువచ్చింది —"

"నిజమే" లలితమ్మగారి స్వరంలో పశ్చాత్తాపం స్పష్టంగా ధ్వనించింది.

ఇందిర సంభ్రమంగా వింటూ ఉండిపోయింది ప్రసాద్‌కి ఈ అనుభవం నిజంగా జరిగిందా? లేక తల్లికి కల మూఢనమ్మకాలు తెలిసిన వాడవటం వలన, ఆవిడ మనసు చెదిరి ఉన్న ఈ సమయంలోనే అనుమతి పొందాలని ఇలా కల్పించి చెప్తున్నాడా? ఏమయితేనేమి, వాళ్ళ పెళ్ళికి ఆవిడ అంగీకారం లభించింది. ఇందిరకు చాలా సంతోషం అనిపించింది. పరిగెత్తుకుంటూ యింటికి వెళ్ళి పద్మకు చెప్పాలనిపించింది. కాని ఈ వార్త తను చెప్పకూడదు. ప్రసాద్ చెప్తేనే అందం.

లేచి సుధాకర్ గదిలోకి వెళ్ళింది. తెల్లవారే వరకు ఇవ్వవలసిన మందుల వివరాలు ఇందిరకు చెప్పింది నర్స్. ఏ మాత్రం అవసరం వచ్చినా తనను కాని, డాక్టర్ జాక్సన్‌ను కాని పిలవమని



మద్రాసులోని ప్రముఖ తెలుగు సాంస్కృతిక సంస్థ 'కళాభారతి' ఆధ్వర్యంలో సంక్రాంతినాడు ప్రముఖ హాస్య నటుడు శ్రీ అల్లు రామలింగయ్యకి ఘన సన్మానం జరిగింది. ఆసందర్భంగా భరతనాట్య ప్రదర్శన యిచ్చిన కుమారి మాధవి (మెడికో)ని కూడా చిత్రంలో చూడవచ్చు.

చెప్పి, కాస్సేపు నడుము వాల్చటానికి ప్రక్కగదిలోకి వెళ్ళింది ఆవిడ.

అతని బెడ్ దగ్గరగా కుర్చీ జరుపుకొని, అతన్ని తదేకంగా చూడసాగింది ఇందిర. మందుల ప్రభావం వలన కాబోలు, మంచి నిద్రలో ఉన్నాడతను. ముఖం ప్రశాంతంగా ఉంది. రగ్గుని సరిగ్గా సర్ది కప్పింది. బయట వర్షం సన్నగా కురుస్తూనే ఉన్నది. చీరకొంగు భుజాల చుట్టూ కప్పుకొని కుర్చీలో తల వెనక్కు వాల్చి కూర్చుంది.

ఈ రోజు ఎంత విచిత్రంగా గడిచింది! ముందుగా పెదనాన్న వద్దనించి ఉత్తరం, అందులో అనుకోకుండ డబ్బు కలిసి వస్తున్నదని వార్త. మధుని పెళ్ళి చేసుకునేందుకు పరిస్థితులు అనుకూలించాయికదా, వెళ్ళి అతన్ని కలుసుకుందునా అని ఆలోచన. ఆ తర్వాత అతని పెళ్ళి శుభలేఖ చూడటం. గందరగోళంగా ఉన్న తన భావాలను, ఆలోచనలను సుధాకర్ వివరించి, విడమర్చి, తన మనస్సు తనకు అర్థమయేటట్లు చేయటం, ఆపైన, మధులాగా కాకుండా ఎన్నాళ్ళయినా తన కోసం ఎదురు చూస్తానని చెప్పి తనను ప్రేమిస్తున్నట్లు వెల్లడి చేయటం— ఇంక వరద, జనాల బాధలు, కొందరు యువకుల సేవానిరతి, అన్నిటికీ మించి

నీలాకాశం

సుధాకర్ మొండి ధైర్యం— చివరకు ప్రమాదం దాటటం— పద్మ పెళ్ళికి వాళ్ళ అత్తయ్య ఒప్పదల—

'సుధాకర్, నీవు చనిపోతావేమోనని భయపడ్డాను' అనుకుంటే గొంతు నిండుకొచ్చింది. 'అమ్మ, నాన్న అకస్మాత్తుగా వెళ్ళిపోయి నన్ను ఉన్నట్లుండి పెద్దదాన్ని చేసేశారు; మధు దూరంగా తప్పుకొని నా ప్రేమను అర్థరహితం చేశాడు; డాక్టర్ జాక్సన్ నిస్వార్థ జీవితం, ఆయన కరుణామయమైన హృదయం, నిశ్చల సేవా నిరతి నా మనస్సుని విశాలం చేశాయి; ఇక నీవు నీ దృఢమైన వ్యక్తిత్వంతో నన్ను బంధించావు... నీవు నన్ను ప్రేమించటం నా అదృష్టం సుధా! జీవితానికి ఓ అర్థాన్ని యిచ్చి, శూన్యంగా అనిపిస్తున్న నా జీవన వనాన్ని నందనవనంగా మారుస్తున్నావు' ఆనందంతో నాట్యమాడింది ఇందిర హృదయం.

సుధాకర్ కొద్దిగా కదిలాడు. చిన్నగా పిలిచాడు "ఇందూ..."

ఈ క్రొత్త పిలుపుకి ఇందిర మనసులో వెన్నెల విరిసినట్లే అయింది.

"సుధా. ఇక్కడే ఉన్నాను... ఏం కావాలి?" మృదువుగా అడిగింది.

కళ్ళుతెరిచి చూశాడు సుధాకర్. "అతను... ఎలా ఉన్నాడు?" నీరసంగా ఉంది స్వరం.

"నీవు రక్షించిన అతనేనా? బాగానే ఉన్నాడు. డోంట్వర్రీ... ఇదిగో ఈ టాబ్లెట్ వేసుకో"

అతను లేచి కూర్చోబోతుంటే వారించి తనే మాత్రవేసి నీళ్ళు త్రాగించింది.

ఎప్పుడూ చూడని వ్యక్తిని చూస్తున్నట్లు ఇందిరను చూస్తున్నాడు సుధాకర్. అతని పెదవుల పైన లీలగా చిరునవ్వు కదలాడుతున్నది.

డాక్టర్ జాక్సన్ వచ్చారు అక్కడికి. "మెలకువ వచ్చిందా సుధాకర్? వెరీగుడ్!" నాడి పట్టుకొని చూసి "జ్వరం లేదసలు. రెండు రోజుల్లో పూర్తిగా మామూలు మనిషవుతావు" అన్నారు.

సుధాకర్‌కి కనురెప్పలు బరువుగా అనిపిస్తున్నాయి. కళ్ళు మూసుకున్నాడు. మరు నిమిషంలో నిద్ర పోయాడు.

"మీరు వెళ్ళి పడుకోండి" అన్నది ఇందిర.

"డాక్టర్లకి నిద్రాహారాలు లేకుండా ఉండటం అలవాటే నమ్మా! నేను ఇక్కడ కూర్చుంటాను. నీవువెళ్ళి పడుకో"

"వద్దండీ! ఇక్కడే ఉంటాను"

నిశితంగా ఇందిరను చూశారు ఆయన. ఏదో అర్థం అయినట్లు తల పంకించి చిరునవ్వుతో వెళ్ళి పోయాడు.

ప్రసాద్‌వచ్చాడు. తన తల్లి తండ్రులు ఇంటికి వెళ్ళారని, తను ఇక్కడ కూర్చుంటానని, ఇందిరను వెళ్ళి పడుకోమని చెప్పాడు.


"వద్దండీ, నేను మేలుకొనే ఉంటాను. మీరు వెళ్ళి పడుకోండి, అలసటగా కనిపిస్తున్నారు" అన్నది ఇందిర.

ప్రసాద్ వెళ్ళి హాల్లోని బెంచి పైన పడుకున్నాడు.


సుధాకర్ ముఖంలోకి చూస్తూ ఏవో బంగారు కలల సామ్రాజ్యంలోకి ప్రవేశించినట్లు అనుభూతి పొందుతూ, కూర్చుంది ఇందిర.


తెల్లవారింది. వర్షం వెలిసింది. పద్మ, ఉష వచ్చారు. డాక్టరు జాక్సన్ వాళ్ళకు బయటనే ఎదురు వచ్చారు. సుధాకర్ క్షేమంగా ఉన్నాడని, తను వరద ప్రదేశానికి వెళ్ళి అక్కడ అంతా ఎలా ఉన్నారో చూసి వస్తానని చెప్పి వెళ్ళారు.

హాల్లో బెంచి పైన నిద్రపోతున్న ప్రసాద్‌ని చూసి నవ్వుకొని, సుధాకర్ గదిలోకి వెళ్ళారు.









అక్కడ సుధాకర్ హాయిగా నిద్రపోతున్నాడు కుర్చీలో కూర్చొనే మంచం పైకి ఒరిగిపోయి ఒళ్ళెరగకుండా నిద్రపోతున్నది ఇందిర

వాళ్ళను లేపాలనిపించలేదు పద్మకి. ఉష అక్కను లేపబోతుంటే వారించి, గది బయటకు వచ్చింది ప్రసాద్ అప్పుడే కళ్ళు తెరిచాడు ఎదురుగా స్వచ్ఛమైన పువ్వులాగా నవ్వుతూ పద్మ కనిపించింది

''పద్మా'' అన్నాడు సంభ్రమంగా

''ఏమిటలా చూస్తున్నావు ?'' అడిగింది పద్మ

''ముందు మీ యింటికి వెళ్దాం పద ! నేను ముఖం కడుక్కొని వచ్చేలోపల కాఫీ యివ్వు అప్పుడు ఓ మంచి వార్త చెప్తాను''

''ఏమిటది ? ఇప్పుడే చెప్పు !''

''కాస్సేపు సస్పెన్స్ ఉండవద్దూ ?'' అంటూ పద్మని తీసుకొని వెళ్ళిపోయాడు

ఉషకు ఏమీ తోచటంలేదు కాస్సేపు అటు, ఇటు తిరిగి అక్క వద్దకు వచ్చింది ''అక్కా, లే'' అని తట్టి పిలిచింది ఇందిరకి, సుధాకర్‌కి కూడా మెలకువ వచ్చింది.

ఇందిర సర్దుకొని లేచి కూర్చుంది సుధాకర్ ''గుడ్ మార్నింగ్ ఉషా'' అని పలకరించాడు

''మీకు జ్వరం తగ్గిపోయిందా ?'' అడిగింది ఉష వాళ్ళిద్దరినీ కబుర్లలో వదిలేసి ఇవతలకు వచ్చింది ఇందిర

* * *

టౌను నించి వాలంటీర్లు, నర్సులు, డాక్టర్లు మున్నగు వారంతా వచ్చారు, వరద బాధితులకు సహాయపడే నిమిత్తం డాక్టర్ జాక్సన్ వాళ్ళతో బిజీగా ఉండిపోయారు మధ్యాహ్నం భోజనం తర్వాత కొద్దిపాటి విశ్రాంతి కోసం మేడమీదికి వెళ్ళి కూర్చున్నపుడు, ఆయన వద్దకు వెళ్ళింది ఇందిర

పెదనాన్న తనకు వ్రాసిన ఉత్తరం గురించి చెప్పి ''ఇంక రమేష్, సురేష్ భవిష్యత్తుల గురించి దిగులు పడవలసిన అవసరం లేదండీ ! వాళ్ళ చదువులు చక్కగా సాగిపోతాయి'' అంది

ఆయన చాలా సంతోషించాడు ''మీ పేరెంట్స్ పోయిన క్రొత్తలోనే ఈ ఆస్తి వచ్చి ఉంటే, నీ పెళ్ళి కూడా అయిపోయి ఉండేది కదూ ?'' నిశితంగా ఇందిర ముఖంలోకి చూస్తూ అడిగాడు.

ఓ నిమిషం మౌనంగా ఉండిపోయింది ఇందిర తర్వాత ''అంతా మన మంచికే అనుకుంటున్నాను. నేను, సుధాకర్ పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాము'' అంది మెల్లిగా తమ నిర్ణయాన్ని తెలిపి, దీవెనలు పొందవలసింది ముందుగా ఈయన దగ్గరే — అనిపించింది

ఆయన ఆశ్చర్యపోయినట్లు కనిపించలేదు కాని, చాలా ఆనందించినట్లు కనిపించారు ''ఈ విధంగా అవుతుందనే ఆలోచన నా మనసులో ఎందుకో చాలా రోజుల క్రితమే కలిగిందమ్మా ! గాడ్ బ్లెస్ యూ బోత్ !'' అన్నారు.

''సుధాకర్‌కి ఎం డి చదవాలని ఉంది తిరిగి కాలేజీలు తెరిచే సమయానికి హైదరాబాదుకి వచ్చి జాయిన్ అవుతాడనుకుంటాను. అప్పటికీ మీ పుస్తకం టైప్ చేయటం కూడా అయిపోతుంది ఉష ఆరోగ్యం ఇప్పుడే ఎంతో బాగుపడింది మేమంతా వెళ్ళిపోవచ్చును కాని ఎందుకనో నాకు ఇక్కడే ఉండాలనిపిస్తున్నది !''

ఆయన నవ్వారు ''నీవు కూడా టీచర్ ట్రెయినింగ్ కాని, నర్స్ ట్రెయినింగ్ కాని— నీకు దేనిలో ఆసక్తి కలిగితే అది చదువమ్మా ! తిరిగి సుధాకర్‌తోపాటు ఇక్కడికే వచ్చి నీకు వీలయిన మార్గంలో ఈ పల్లె ప్రజలకు సేవచేయవచ్చును''

అనవసర భయం

విద్యార్థులు లెక్కలు చేయటానికి కేలిక్యులేటర్లు ఉపయోగించటం అలవాటు చేసుకుంటే, అవి లేని సమయాల్లో లెక్కలు చేయటం ఒక సమస్య కాగలదని పశ్చిమ జర్మనీలో తలిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు కానీ నార్త్ రైన్ వెస్ట్‌ఫాలియా రాష్ట్ర విద్యా మంత్రిత్వ శాఖవారు ఇది కేవలం అనవసర భయం అని అన్నారు ఈ మంత్రిత్వ శాఖవారు ఏటా నాలుగు వేలమంది విద్యార్థులు చొప్పున మూడు సంవత్సరాలపాటు మొత్తం పన్నెండు వేల మందిని పరీక్షించారు ఇంటి దగ్గర కేలిక్యులేటరు ఉపయోగించే విద్యార్థి స్కూల్లో కూడా లెక్కల్లో ముందు నిలుస్తున్నాడని తీర్మానించారు అయితే కేలిక్యులేటర్లు 15 సంవత్సరములు పైబడిన వారికి మాత్రమే సమంజసమైనవన్న అభిప్రాయాన్ని కూడా వీరు ప్రకటించారు.

ఈ సలహాతో ఇందిర కళ్ళు మెరిశాయి

''అలాగే చేస్తాను. నిన్న ఈ సమయంలో మానసికంగా ఎంతో కృంగిపోయి ఉన్నాను ఈరోజు గాలిలో తేలిపోతున్నట్లే ఉంది ! ఇంతలో ఎంత మార్పు ?'' తనలో తను అనుకుంటున్నట్లు అన్నది

కిటికీలోనించి బయటకు చూశారు డాక్టర్ జాక్సన్ వర్షం పూర్తిగా వెలిసింది మబ్బుల చాటు నుండి బయటకు వచ్చిన సూర్యుడు, వాతావరణాన్ని వింత కాంతులతో నింపాడు నిర్మలంగా ఉన్న నీలాకాశాన్ని చూస్తూ అన్నారు, '' నిన్న ఈ సమయానికి ఆకాశం ఎలా ఉన్నదో గుర్తుందా ఇందిరా ? నల్లని మబ్బులతో నిండిపోయి, కుండ పోతగా వర్షం కురిపిస్తున్నది, అవునా? మరి ఇప్పుడు చూడు హాయిగా, ప్రశాంతంగా లేత సూర్యకాంతిలో మెరిసిపోతూ ఉన్నది ! రాత్రిళ్ళు ఒక్కోమారు ఆకాశం నిండు చందమామతో, మిలమిల మెరిసే నక్షత్రాలతో ఎంత అందంగా ఉంటుంది! మరి ఇంకొక మారు నల్లగా— కన్ను పొడుచుకున్నా కానకుండా— భయం కలిగించేటట్లు ఉంటుంది సూర్యోదయ సమయంలో గులాబీరంగు పులుముకొని, ఆరితేరిన చిత్రకారుడు కుంచెతో నేర్పుగా తీర్చిదిద్దిన అపూర్వమైన చిత్రపటం లాగా ఉంటే, మధ్యాహ్నం వేళ వేడిగా, వాడిగా తలెత్తి సూటిగానయినా చూడనీయకుండా ఉంటుంది! ఎన్ని విచిత్ర రూపాలు ఈ ఆకాశానికి! ఇంతాచేస్తే అసలు ఆకాశం అంటే ఏమిటి? కేవలం శూన్యం ! జీవితమూ అంతే ఇందిరా ఒక్కొక్కమారు సమస్యలతో, కష్టాలతో నిండిఉన్నా, ఇంకొక మారు హాయిగా, ఆనందంగా ఉంటుంది చివరికి మిగిలేది ఏమిటని చూస్తే నిజానికి ఏమీలేదు! అంతా కేవలం మాయ— నీలాకాశం వలెనే సుఖ, దుఃఖ సమన్వితమైనదే జీవిత ''

దూరాన రేడియోలో పాట వినవస్తున్నది—

''జగమే మాయ, బ్రతుకే మాయ
వేదాలలో సారమింతేనయా

. . .

బాధే సౌఖ్యమనే భావన రానీవోయి
ఆ ఎరుకే నిత్యానందమోయి
బ్రహ్మానందమోయీ ''

(అయిపోయింది)

ఈ రేయి గడిస్తే చాలు

"అక్కా! కథ చెప్పవూ ?" అఖిల గుండెలమీద చెయ్యి వేసి కుదుపుతూ అడిగింది — ఆమె చిన్నారి చెల్లెలు కళ్యాణి.

అఖిల అటు తిరిగి పడుకుంది

భుజం పట్టుకు లాగుతూ 'చెప్పవూ' ముద్దుగా మళ్ళీ అడిగింది

అఖిల మౌనంగా వుండి పోయింది

కాసేపు చూసి అక్క పక్కలో వొదిగి పండుకుంది కళ్యాణి.

చంద్రుడు లేని ఆకాశం వొంక చూస్తూ 'ఎప్పుడు తెల్లవారుతుందో' అనుకుంది అఖిల ఆ ప్రశ్న అప్పటికే ఎన్నోసార్లు అనుకుంది తను

అడుసుమల్లి మల్లికార్జున



అమకునే కొద్దీ కాలం మరింత భారంగా గడుస్తున్నట్టుంది.

కొన్ని నిర్ణయాలు తీసుకునేప్పుడు మనం ఆలస్యం చేస్తే— తర్వాత కాలమే నిర్ణయిస్తుంది. అప్పుడు మన ప్రమేయం లేశమైనా వుండదు.

అఖిల విషయంలో కూడా సరిగ్గా అట్లాగే జరిగిందని చెప్పవచ్చు. లేకుంటే అఖిల ఆ నిర్ణయానికి అంత తొందరగా వచ్చి వుండేది కాదేమో!

లేకుంటే శేఖర్ ఎవరు ?

తనెవరు ?

తన తమ్ముడికి పెళ్ళిచూపులేమిటి ?

ఒక దానితో ఒకటి ఏ మాత్రం పొంతన లేక పోయినా — ఆఖరికి తన తమ్ముడి పెళ్ళిచూపులే తన జీవితగమ్యానికి మార్గం చూపించినట్టైంది.

లేకుంటే తను — శేఖర్ ... తలచుకుంటేనే ఆశ్చర్యంగా వుంది. కానీ రేపటితో తను అమ్మని, చెల్లిని ... అందర్నీ వొదిలి వెళ్ళిపోతుంది.

ఆ ఆలోచన రాగానే అఖిల కళ్ళు చెమ్మగిల్లాయి.

బొట్టులేని తన నుదుటి భాగంలా వున్న చంద్రుడులేని ఆకాశాన్ని చూస్తూ వుండిపోయింది అఖిల.

అక్కడక్కడా ఒక నక్షత్రం మెరుపులా మెరిసి పోతోంది.

*　　*　　*

పెళ్ళై ఏడాది కాకముందే భర్తను పోగొట్టుకుని పుట్టింటికి వొచ్చింది అఖిల. అఖిల వాళ్ళ నాన్నగారు ఏరికోరి మంచి సంబంధమే చూసి పెళ్ళిచేశారు

కానీ అనుకోని విధంగా కారు యాక్సిడెంట్‌లో అఖిల భర్త చనిపోయాడు. వూహించని పరిణామం. ఎవ్వరమైనా చేసేదేముంది ?

అఖిల మాత్రం ఏం చేస్తుంది ?

తంతు అంతా జరిగాక పుట్టింటికి చేరిన ఏడాదివరకు అఖిల నిర్వికారంగా వుండిపోయింది. వేళకి భోజనంలేదు నిద్రలేదు. ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది

అఖిలను దక్కించుకోవడం గగనమైపోయింది వాళ్ళ తలిదండ్రులకు చిన్నగా కోలుకున్న అఖిల యాంత్రికంగా జీవిస్తూ వచ్చింది.

పొద్దున్నే లేచి దేవుడి పటాల వద్ద కూచొని ఎప్పుడో లేచేది ఏదో అంత తిని చెల్లెలికి తలదువ్వి బడికి పంపించేది మళ్ళీ దేవుడి మందిరంలోకి వెళ్ళి పోయేది మధ్యాన్నం అక్కడే నిద్రపొయ్యేది

మళ్ళీ బడినుంచి తన చెల్లెలు వొస్తేనే కాసేపు దానితో పొద్దుపుచ్చేది

అట్లా నిర్వికారంగా, నిర్లిప్తతతో జీవితం గడిపే అఖిల జీవితంలోకి శేఖర్ ప్రవేశించేడు

అది కూడా చాలా చిత్రంగానే జరిగింది.

శేఖర్‌వాళ్ళది యెదురు ఇల్లు. తన అమ్మవాళ్ళు అఖిల దౌర్భాగ్యాన్ని, మంచితనాన్ని కలబోసి కధలు కధలుగా చెప్పకోటం విన్న శేఖర్ మనసులో తనకు తెలీకుండానే అఖిలమీద జాలి కలిగింది. అది క్రమేపీ ఆరాధనగా మారింది

ప్రతిరోజూ శేఖర్ వాకిట నిలబడి చూసేవాడు అఖిల యెప్పుడూ అతనికి కనిపించేది కాదు. పొరపాటున ఎప్పుడైనా చూస్తే ఆమె తల వొంచుకులనో, చీరనో చూడగలిగేవాడు అంతేగాని అఖిలను పూర్తిగా చూసింది లేదు

కానీ కుతూహలం కొద్దీ శేఖర్ ప్రతిరోజూ ఆమెను చూడటానిగ్గాను యెదురు చూసేవాడు.

అనుకోకుండా ఒకసారి అతనికి అదృష్టం కలిసి వొచ్చింది. ప్రతిరోజూ అఖిల పువ్వులు కోసేది దేవుడికి. వాళ్ళింట్లో వున్న నందివర్ధనం చెట్టు కిందకి వుండటంవలన — రోజా పువ్వులు కోస్తున్నా బయటవాళ్ళెవ్వరికీ తను కనిపించేది కాదు.

ఆ రోజు పువ్వులు చెట్టు పై కొమ్మలకి వున్నాయి. చిన్న స్టూలు తెచ్చుకుని దానిమీద నిలబడి పూలు కోస్తూవుంది. అప్పుడు చూసేడు శేఖర్ — ఆకుపచ్చటి ఆకుల మధ్య పచ్చగా తళతళా మెరిసి పోతున్న అఖిలను.

అఖిల మామూలుగా అందగత్తె. దానికితోడు ముఖంలో ప్రశాంతత.

పెళ్ళికాని ఎవ్వరో కన్నెపిల్ల అనుకున్నాడు శేఖర్. కానీ శూన్యమైన నుదుటి భాగం చూసేక 'ఈమేనా ?' అనిపించింది.

ఆ అందం —

ఆ ప్రశాంతత — చూసేక నమస్కరించా లనిపించింది శేఖర్‌కి. ఆశ్చర్యంతో అట్లాగే చూస్తూ వుండిపొయ్యాడు.

అందిన పువ్వులన్నీ కోసేక మామూలుగా అటు చూసింది.

శేఖర్‌ని చూసి ఒక్క క్షణం — మళ్ళీ చూసి — దిగిపోయింది.

అఖిలకీ ఆశ్చర్యమేసింది.

ఎవరతను ?

అట్లా చూస్తున్నాడు ?

ఎప్పుడో బాగా పరిచయమైన వ్యక్తిని మళ్ళీ చాలా కాలం తర్వాత అనుకోకుండా చూస్తే — ఎట్లా చూస్తారో — అట్లాంటి చూపు అది.

నిజమే! శేఖర్ అఖిల వొంక చూస్తున్నంత సేపూ — గొప్ప తేజస్సుతో వెలిగిపోతూ కనిపించేడు.

అదంతా అతని ఆశ్చర్యమే.

అఖిల అట్లా అనుకోలేదు.

మళ్ళీ ఒకసారి అదే స్థితిలో అతన్ని చూసింది. అంతవరకు ఆ సంగతి మరచిపోయిన అఖిల మొదటి సారిగా అతన్ని గురించి ఆలోచించసాగింది

ఏ అభిప్రాయమూ మనసులో చోటుచేసుకోక ముందే—రోజూ అతన్ని చూడటం అలవాటుగా మారి పోయింది. కాలం గడిచేకొద్దీ—ఒకరిని చూసి ఒకరు చిన్నగా నవ్వుకునే స్థితికి వొచ్చారు

అఖిలకు మనసులో భయం. కానీ ఎవ్వరూ ఏమాత్రం వూహించని విధానం అది కంటిస్సైగతో, లేతనవ్వుతో పలకరించుకోటం. అందుకే అదోలాంటి ధైర్యం

ప్రశాంతంగా వున్న అఖిల మానస సరోవరంలో శేఖర్ చిన్న అలజడి రేపాడు ఆమె దైనందిన జీవితంలో చిన్నమార్పులు వొచ్చాయి ఎప్పుడూలేనిది కాసింత హుషారుగా కనిపించసాగింది. ఆ పరిణామం ఆమె తల్లిదండ్రులకు కొంత సంతృప్తిని కలిగించిందనే చెప్పాలి.

చిన్నతనంనుంచి అఖిలది చాలా సున్నితమైన మనస్తత్వం. అందరి గారాబం ఆమెకు సంపూర్తిగా లభించేది. ఆమె భర్త చనిపోయాడని తెలిశాక— అఖిల యెంత దుఃఖించిందో వాళ్ళ అమ్మా, నాన్న గారు కూడా అంతకంటే యెక్కువ క్లేశాన్ని అనుభవించారు.

పుట్టింటికి వొచ్చింది మొదలు కళ్ళలో దీపాలు పెట్టుకుని ఆమెను గమనించారు — ఏదైనా అఘాయిత్యానికి పాలుపడుతుందేమోనని ఆ యేడాది కాలంలో ఆమెను దక్కించుకోడానికి ఎంత ప్రయాస పడ్డారో చెప్పలేం. అందుకే అఖిలలో వొస్తున్న మార్పు వాళ్ళనెంతో తృప్తిపరచింది.

కారణం తెలిస్తే ఏట్లావుండేదో! ఏమో! కానీ, ప్రస్తుతం మాత్రం గడచిపోయిన విషాద సంఘటనను తాత్కాలికంగా మరిచిపోయి ఇంటిల్లిపాది అంతో యింతో సంతోషంగా వున్నారు.

కుటుంబ పరిస్థితి తృప్తికరంగా వుందని భావించిన అఖిల తండ్రి పరంధామయ్యగారు వాసుకి సంబంధాలు చూడసాగారు

పరంధామయ్యగారికి అఖిల తర్వాత మగసంతానం వాసు. వాసు తర్వాత చిన్నపాప కళ్యాణి అఖిలకు వాసుకి ఒక్క యేడాది తేడా. తర్వాత చాలా కాలానికి కళ్యాణి పుట్టింది

వాసుకి బ్యాంక్‌లో ఉద్యోగం కుర్రాడు పచ్చగా, ముద్దుగా వుంటాడు. చాలా సంబంధాలు వొచ్చాయి గానీ అప్పడే పెళ్ళిచెయ్యటం ఇష్టంలేక పరంధామయ్య గారే తిప్పిపంపారు.

ఇంతలో అఖిల జీవితం అట్లా అయింది. ఏ క్షణానికి ఏమి జరుగుతుందో ఎవ్వరు చెప్పగలరు — అనే భావం మనసులో పడింది. అందుకే ఆలస్యం చెయ్యకుండా వాసుకి సంబంధాలు వెతకసాగాడు

ఒక సంబంధం అన్నివిధాలా నచ్చింది అమ్మాయి కడు యోగ్యురాలు మంచి సాంప్రదాయం. అన్నీ కుదురుచ్చుకుని వొచ్చాడు

ఓ సుముహూర్తాన నెల్లూరు నుంచి పెళ్ళివారు దిగారు— పెళ్ళి చూపులకి. వాళ్ళూ అన్ని విషయాలలో సుముఖత చూపించారు కానీ ఇంట్లో విధవ ఆడపడచు వుందన్న ఒకే ఒక్క కారణాన వెళ్ళి పుత్తరం రాస్తామని చక్కాపొయ్యారు ఉత్తరం వ్రాయలేదు.

'ఆ సంబంధం తప్పిపోవటమే మంచిది' అని అన్నది అఖిల తల్లి సుభద్రమ్మ 'ఇంకా నయం అమ్మా, నాన్న కూడా వున్నారని అనలేదు ఏం ? విధవ ఆడపడచు వీళ్ళనేం చేసిందట దాని ఖర్మకాలి యిట్లా అయిందిగాని లేకుంటే వీళ్ళకంటే మారాజులా వుండేది అసలు ఆ బోడి సంబంధం మాకే నచ్చలేదని ఘాటుగా ఒక పుత్తరం ముక్క రాసి పడెయ్యండి' అంది.

పరంధామయ్యగారు మౌనంగా వుండిపొయ్యారు అఖిల అంటే ఆయనకు ప్రాణం. మళ్ళీ ఒకసారి అఖిల జీవితము, భవిష్యత్తు గుర్తు వొచ్చి ఆయన మనసు వికలమైపోయింది

అఖిలకు ఆ విషయం తెలీకుండా వుండటానికి శతవిధాల ప్రయత్నించేరు కానీ అఖిలకు తెలిసి పోయింది.

నిజమే. తనేం చేసింది? తనేం చేస్తుంది? భర్త లేక వేరు దిక్కులేక పుట్టింటికి చేరిన అభాగ్యురాలు.

తన దురదృష్టం ఇక్కడ కూడా వ్యాపించింది. తన మంచితనం, మెతకతనం వాళ్ళకెట్లా తెలుస్తుంది? యే తల్లిదండ్రులైనా బిడ్డల సౌఖ్యమే చూస్తారు కదా! వాళ్ళు, భార్యాభర్తలు పచ్చగా వుంటే తను ఓర్వలేదనా వాళ్ళ అభిప్రాయం.

ఎంత దారుణం? తన జీవితమే కాదు. తను వుండి వీళ్ళందరి జీవితాలకి కూడా శాంతి లేకుండా చేస్తుంది. చచ్చిపోదామంటే భయం.

ఆ రాత్రంతా అఖిల నిద్రపోలేదు. తడిసిన కళ్ళతో అట్లాగే వుండిపోయింది. మళ్ళీ అఖిల పరిస్థితి పూర్వంలా తయారైంది. శేఖర్ విషయం కూడా పూర్తిగా మరిచిపోయింది.

ఒకరోజు సాయంకాలం ఇంట్లో ఎవ్వరూలేరు. అఖిల వొక్కతే ఇంటిలోపల యెక్కడో వుంది. ఎవరో పిలిచినట్టై వెలుపలికి వచ్చింది.

ఎదురుగా శేఖర్.

ఏం చెయ్యాలో చప్పున తోచలేదు అఖిలకి. తడబడుతూ 'కూచోండి' అంది.

శేఖర్ కూచోలేదు.

'క్షమించండి . ' అంటూ ఒక తెల్లకాగితం కుర్చీలోపెట్టి మౌనంగా వెళ్ళిపోయాడు.

బిత్తరపోయింది అఖిల. యెంత చొరవ? ఏమనుకుంటున్నాడు తను? యెంత ధైర్యం ?! అసలు తప్పు అంతా తనది. కోపంతో ఆమె ముఖం ఎర్రనైంది.

ఉత్తరం తీసుకుని చింపబోయింది. మరు క్షణమే అభిప్రాయం మార్చుకుని వొణికే చేతులతో తలుపు గడియవేసి మంచంమీద కూచొని ఉత్తరం చదవసాగింది.

ఉత్తరం సాంతం చదివాక అఖిల మనసు కుదుటపడింది. అది ప్రేమలేఖ కాదు. చాలా మామూలుగా, సభ్యతగా తన అభిప్రాయాన్ని సూటిగా వ్రాశాడు. తనకి అభ్యంతరం లేకుంటే వివాహం చేసుకుంటానన్నాడు. ఇది ఏ మాత్రం జాలి కాదని, చాలాకాలం ఆలోచించి ఈ నిర్ణయానికి వొచ్చానని వ్రాశాడు. తన అభిప్రాయం తప్పుగా తోస్తే క్షమించమని, మరెప్పుడూ జీవితంలో తన వైపు కన్నెత్తికూడా చూడనని ముగించాడు.

అట్లాగే మంచంమీద పడుకుని ఆలోచించ సాగింది అఖిల. ఎవరు అతను? అకారణంగా తనపై అమృతజల్లులు కురిపిస్తున్నాడు. అంత త్వరగా అంగీకరించలేదు అట్లా అని దూరంగా నెట్టివెయ్య లేదు. ఏం చెయ్యాలి? ఎంత ఆలోచించినా చివరకు ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోయింది.

తను కోరకుండానే తనకంటూ ఒక వ్యక్తి వున్నాడని నమ్మకంగా తెలిశాక ఆమెకు కొంత ధైర్యం కలగసాగింది. ప్రస్తుతానికి స్థిరంగా ఏ అభిప్రాయానికీ రాకుండానే ఆలోచనలను ఆపుచేసింది.

కొద్ది రోజులు మామూలుగా గడిచిపోయాయి.

ఆ రోజు — అఖిల దొడ్లో మంచమ్మీద పడుకుని వుంది. ఇంట్లో నుంచి అమ్మా నాన్న మాటలు వినిపించసాగాయి.

'ఈ సంబంధమైనా కుదిరితే బావుణ్ను' అది తల్లి గొంతు.

ఈ రేయి గడిస్తే చాలు

'నిజమే. చాలా మంచి సంబంధం. ఒక్కతే అమ్మాయి. తప్పకుండా కుదిరితీరుతుంది' పరంధామయ్యగారు అంటున్నారు.

నాన్నగారు నాకు ఏదో సంబంధం చూసి నట్టుంది — అనుకుంది అఖిల.

'మనం అనుకుంటే సరిపోతుందా? వాళ్ళకు అన్నీ నచ్చొద్దూ. ముందు సంబంధం మాత్రం కుదురుతుందని అనుకోలేదూ మనం.'

'నోర్ముయ్. అమ్మాయి ఇంకా నిద్రపోయినట్టు లేదు.'

'ఇప్పుడేమన్నాను నేను. నాకు మాత్రం అది అంటే ప్రేమ లేదూ. ఏదో దాని ఖర్మ కాలి.. '

'ఛి...ఛీ ..' పరంధామయ్యగారు భోజనం మధ్యలో లేచి వెళ్ళిపొయ్యారు.

అంతా వింటున్న అఖిల మౌనంగా రోదిస్తూ దిండులో తల దాచుకుంది.

"భగవంతుడా! నన్నెందుకు పుట్టించావు? లోకంలో యెందరెందరో అకారణంగా చనిపోతున్నారే. దేనికీ పనికిరాని నేను వ్యర్థంగా ఎందుకు బ్రతుకు తున్నట్టు? నాలాంటి నిర్భాగ్యులకి చావు నెందుకు ప్రసాదించవు?"

ఇంతలో అడుగుల చప్పుడు విని గట్టిగా కళ్ళు మూసుకుంది అఖిల.

పరంధామయ్యగారు వొచ్చి కూతురు నిద్ర పోతుందని అనుకొని ఆమె తలపై ఆప్యాయంగా చెయ్యివేసి నిమిరి, ఒక నిట్టూర్పు విడిచి వెళ్ళి పోయారు.

ఆ రాత్రంతా అఖిల తన భవిష్యత్తును గురించి ఆలోచిస్తూ నిద్రపోలేదు. ఏం చెయ్యాలి తను? ముసలిదై చచ్చిపోయేదాకా ఇట్లా పుట్టింటిలోనే ఒంటరిగా బ్రతుకుతూ వుండిపోవలసిందేనా?

ఆ ఆలోచనతో ఆమె గుండె దడదడలాడింది.

అమ్మో! ఇంకేమైనా వుందా? తనువుంటేనే నాను పెళ్ళికి అడ్డుగా వుందే! ఇహ వెళ్ళిపోతే — తల్లిదండ్రుల పరిస్థితి, కుటుంబ మర్యాదా? కళ్యాణి భవిష్యత్తు...అంతా గందరగోళంగా ఆమెకు కన్పించ సాగింది.

సంకేతాలు

ఒక రచన చదివాక
మరింకేం చదవకుండా
కళ్ళు మూసకొని కాస్తంత
యోచనలో పడిపోగలిగితే
అంతకన్నా మంచి సాహిత్యం
మరొహటి లేదు.

ఒక సంగీతం విన్నాక
మరింకేం వినకుండా
రేడియో కట్టేసి కాస్తంత
నిశ్శబ్ద తరంగాల్ని వరించగల్గితే
అంతకన్నా మంచి సంగీతం
మరొహటి వుండబోదు.

— మురాశర్మ

అఖిల కన్నీళ్ళతో ఆ రాత్రి సాగిపోయింది

తెల్లవారింది. యాంత్రికంగా పనులుచేస్తూ, రాత్రి తెగని ఆలోచనలమధ్యనే కొట్టుమిట్టాడుతూ వుంది అఖిల.

అన్నివిధాలా ఆలోచించి ఆఖరకు ఒకనిర్ణయానికి వొచ్చింది. రేపు నాసుని చూట్టానికి పెళ్ళివా రొస్తారు. ఈ సంబంధం కూడా తనమూలంగానే ఆగిపోతే — శేఖర్‌తో కలిసి పోవటం అట్లాగాక ఈ పెళ్ళికుదిరితే భవిష్యత్తును కాలానికి వొదిలేసి శేఖర్‌ని మరచిపోవటం. చాలా ధైర్యం తెచ్చుకుని స్థిరంగా ఆ నిర్ణయానికి వొచ్చింది అఖిల

నిజమే తనమూలంగా ఈ సంబంధమూ తప్పిపోతే—ఎంత ప్రేమాభిమానాలున్న తల్లిదండ్రుల కైనా రవంతైనా బాధ కలగకపోతుందా అది చూసి తను బ్రతుకగలదా? అందుకే అట్లా జరిగితే తను తన భవిష్యత్తు చూసుకోటం ఉత్తమం.

ఈ నాగరికతా ప్రపంచంలో వున్నవాళ్ళే — ఇంట్లో విధవ ఆడపడచు ఉందన్న వాళ్ళే — రేపు లేచిపోతే ఏమీ అనకండావుంటారా? వుండరు. మూఢాచారాలు. వికృతమైన మనస్తత్వాలు, ఈ సమాజం వున్నంతవరకు వుంటూనే వుంటాయి.

వీటిని ఎవరూ మార్చలేరు ధైర్యంచేసి తెగించటమే పరిష్కారం అట్లాగాక భగవంతుని దయవల్ల ఈ మంచి సంబంధం కుదిరితే — అంతే చాలు. తన జీవితం ఇట్లాగే గడిచిపోతుంది

ఎందుకనో ఈ సంబంధమూ తప్పిపోతుందనీ, తన జీవితం శేఖర్‌తో ముడిపడుతుందనీ అఖిల మనసులో గట్టి నమ్మకం. ఏది ఏమైనా తన భవిష్యత్తు రాబోయే పెళ్ళివారి చేతిలోపెట్టి తన ప్రమేయం ఏమీ లేనట్టు రేపటి కోసం ఎదురు చూస్తూ వుంది అఖిల.

ఈ రాత్రి గడిచిపోతే తన జీవిత నిర్ణయం తెలిసిపోతుంది. పక్కలో వొదిగి పడుకునివున్న కళ్యాణి వంక ఆప్యాయంగా చూసి నుదుటిమీద ముద్దు పెట్టుకుంది.

చప్పున అఖిల కళ్ళలో నీళ్ళు తిరిగాయి ఇంక ఎవరు దానికి కథలు చెప్తారు? రేపు ఒకవేళ తను వూహించిన విధంగానే జరిగితే — అమ్మా, నాన్న ఏమనుకుంటారు? నాను అసహ్యించుకోడూ?

ఏమో! ఏమి జరుగుతుందో. ఈ రాత్రి గడిస్తే కదా! శేఖర్‌లాంటి మంచి వ్యక్తి తోడులో తను జీవితాంతం హాయిగా కాలం గడపగలదు. తనకా నమ్మకం వుంది. కానీ మళ్ళీ ఇంటి గడప తొక్కగలదా? ఎల్లకాలమూ వాళ్ళ కోప తాపాలు అట్లాగే వుంటాయా?

ఎన్ని ఆలోచనలు మనసును కమ్ముకున్నా, నిర్ణయించుకున్న అభిప్రాయం మాత్రం మార్చుకో దలుచుకోలేదు.

మళ్ళీ ఒకసారి కళ్యాణిని ముద్దు పెట్టుకుంది.


కంటి కొనకుల్లో నిలిచిన కన్నీటితో అట్లాగే ఆలోచిస్తూ వుంది అఖిల.

ఎక్కడో కోడి కూసినట్టైంది.

ఉలిక్కిపడింది అఖిల.

శూన్యమైన ఆకాశం వంక చూస్తోంది.

ఎక్కడో ఒక్క నక్షత్రం మెరుపులా మెరిసింది ★


సెబాష్ రామూ మేచ్‌ని గెలిపించావు—చొక్కా మురికైతే ఏంపోయిందని!
"నా చొక్కాదే గెలుపు
—మళ్ళీ ఎంత తెల్లబడిందో!"
హై పవర్ సర్ఫ్
అమిత తెల్లగా ఉతుకుతుంది...అమిత తెల్లగా, కనువిందుగా!
సెబాష్ సర్ఫ్! అమ్మకి యిందులో పాలుంది—
నిజానికి మురికిని తీసిపారేసే ఛాంపియన్
హై పవర్ సర్ఫ్ అమ్మకి తోడు. సర్ఫ్‌లో, మరింత
చురుకుగా పనిచేసే పదార్థాలుండటం వల్ల,
అది మురికినంతటినీ తీసేసి అమిత తెల్లగా
ఉతుకుతుంది. ఇంత చేసినా మరి సర్ఫ్
మా బట్టల్ని శ్రద్ధగా చూసుకుంటుంది,
మా చేతుల్ని సున్నితంగా చూసుకుంటుంది.
ఏ గృహిణినైనా అడగండి— ఉండటానికైతే
వందలకొద్దీ పౌడర్లున్నాయిగాని తను నమ్మేది
ఒక్క సర్ఫ్ మాత్రమేనని.
High Power
Surf
washes whitest
...and it shows!
తెల్ల బట్టలకి సెబాష్ తెలుపు, రంగు బట్టలకి సెబాష్ గెలుపు
LINTAS:SU:253:23:6TE
హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

కార్టూన్‌లు పంపేవారికి మనవి

కార్టూన్‌లతోపాటు స్వంత చిరునామాగల స్టాంపులు అతికించిన కవరు పెట్టి సంపాదకుడు, ఆంధ్ర సచిత్రవారపత్రిక, గాంధీనగరం, విజయవాడ—3. అన్న చిరునామాకి టపాలో పంపాలి. వీటి పరిశీలనకు కనీసం 6 నుంచి 8 వారాలు పట్టవచ్చును. ఈలోగా, వేరుగా కాని, టపాలోగాని వీటిపై ఉత్తరప్రత్యుత్తరాలకు తావు ఉండదు. కార్టూన్‌లు 'టపా' లో పోయినా, దారితప్పిపోయినా సంపాదకునిబాధ్యత వుండదు. ప్రత్యేక సంచికలకు కార్టూన్‌లు పంపేవారు కవరుమీద ఆ సంచిక పేరు ఉదహరించాలి. ఈకార్టూన్‌లకి కూడా పై నిబంధనలు వర్తిస్తాయి.

—సం.



ధర్మ పథం

బులుసు వేంకట రమణయ్య

దైతేయులు, ఆదితేయులు

కశ్యప ప్రజాపతి భార్యలిద్దరిలో ఒకతె దితి. మరొక భార్య అదితి దితికి కలిగిన కుమారులు దైతేయులు లేక దైత్యులు. అదితి పుత్రులు ఆదితేయులు. దైత్యులు మొరటుస్వభావం కలవారు వారు సాత్వికులు కారు రజస్తమో గుణాలే వారికి ముఖ్యం. ఆదితేయులు సత్వగుణ ప్రధానులు. విరుద్ధ స్వభావాలు ఉన్నవారికి పరస్పర విరోధం ఏర్పడడంలో వింతలేదు. రాజ్యకాంక్ష కూడా కారణం కావచ్చు. జన సామాన్యం శిష్టులను అభినందించడం, దుష్టులను నిందించడం స్వభావం. వాళ్ళ దుష్కృత్యాలనుబట్టి వాళ్ళ రూపాన్ని వికారంగా కల్పించడం పరిపాటి. సాత్త్వికులు అందంగా ఉన్నట్టు వర్ణించడం, దుష్టుల స్వరూపం చాలా వికారంగా ఉన్నట్టు అతిశయోక్తులతో చెప్పడం జరుగుతూ ఉంటుంది. వాస్తవానికి అసురులందరూ వికార స్వరూపులు కారు. దైత్యులను వికార రూపులుగా వర్ణించేవారు, వారి భార్యలను, పుత్రికా సంతతిని అందంగా ఉన్నట్లే వర్ణిస్తారు కాని, వికారస్వరూపలని చెప్పడంలేదు. రావణుని భార్య మండోదరిని హనుమంతుడు సీతాదేవియేమో అని భ్రాంతి పడడానికి ఇదేకారణం. ఉత్తమ స్వభావం గల యువతులు దైత్యవంశానికి సంబంధించినా అందకత్తెలుగానే వర్ణించబడి ఉన్నారు.

మహాభక్తుడైన ప్రహ్లాదుడు అసురుడైనా అందంగానే వర్ణించబడ్డాడు కాని, వికార రూపం కలవాడని చెప్పలేదు ఎవ్వరూ. పులోముని పుత్రిక అయిన శచీదేవి ఇంద్రుని భార్య, బాణాసురుని పుత్రిక ఉష శ్రీకృష్ణుని మనుమడైన అనిరుద్ధునికి భార్య వారు అందకత్తెలే కాని వికార రాక్షస స్వరూపులు కారు.

మనం క్రూరస్వభావంగల వాళ్ళను రాక్షసులని నిందిస్తాము. క్రూరమైన పనులు చేసే స్త్రీని చూచి "రాక్షసి" అంటాము. దీని అభిప్రాయం ఏమిటి ? వాళ్ళు కఠిన హృదయులనేకదా! స్వభావాన్ని బట్టే అసురులకు ఆ పేరు వచ్చింది. కాని స్వరూపాన్నిబట్టి, కాదుకదా! ఒక తండ్రి బిడ్డలు-తల్లులు వేరయినా ఇంచుమించుగా సమానంగా ఉంటారేగాని ఒకతల్లి బిడ్డలందరూ వికారరూపంకలిగీ, ఇంకొక తల్లి బిడ్డలు అందరూ ఎంతో చక్కదనం కలిగీ ఉండరు కదా! వికారరూపం కొందరికి ఉండవచ్చును, అది అసురులకూ, దేవతలకూ, మానవులకూ, ఇతరులైన గంధర్వాదులకూ సాధారణమైనదే కాని, ఒక జాతికి ప్రత్యేకమైనదికాదు. దేవత్వ, రాక్షసత్వాలు స్వభావానికి సంబంధించినవేకాని రూపానికి సంబంధించినవి కావు. ●

ఈ ఊరే!'' అంటూ తనకు తెలిసిన విషయాన్ని స్పష్టంగా చెప్పాడు వేణు

ఎవరో పిలిస్తే వేణు వెళ్ళిపోయాడు.

శంకరం మనసు నిండా అరుణ నిండి పోయింది

* * *

కళ్ళు మూసినా తెరిచినా సరే శంకరానికి అరుణ ప్రతిబింబమే గోచరించేది ఆమె నెలాగైనా తన జీవిత భాగస్వామిని చేసుకోవాలనిపించేది అందుకే రోజూ అరుణ ఉండే వీధిలోకివెళ్ళి ఆమెని చూసి వస్తూండే వాడు

ఈ మధ్య శంకరం అదోలా ఉండటం గమనించిన పార్వతమ్మ— ''ఏంరా! అలా ఉన్నావ్!'' అని అడిగింది.

''అమ్మా! ఎన్నాళ్ళనుంచో నేను ఒక విషయాన్ని మీకు చెపుదామని అనుకుంటున్నాను... నేను అరుణను ప్రేమించాను... ఆ అమ్మాయినే పెళ్లిచేసుకోవాలని నిశ్చయించుకున్నాను నా మనసు వేరొకరికి అర్పించలేను పెద్దవాళ్ళుకదా మీరు వెళ్లి మాట్లాడి రండి''' అన్నాడు భారంగా

లోపం

[10వ పేజీ తరువాయి]

కణతలు రుద్దుకుంటూ శంకరం.

''ఒరే! నీకేమైనా బుద్ధి, జ్ఞానం ఉన్నాయా! ఆ అమ్మాయి మూగది...''

తల్లి మాటలకు నిర్ఘాంతపోయాడు శంకరం.

అరుణ మూగదా? భగవంతుడు ఎంత నిర్దయుడు. ?

అందమున్న వాళ్లకు అంతర్గతంగా ఏదో లోపాన్ని సృష్టిస్తాడు...? అయినా తను ప్రేమించిన అమ్మాయినే— పెళ్లి చేసుకునే టప్పుడు— ఆమెలో ఏ లోపం ఉంటేనేం?

''అమ్మా! అది దేవుడు సృష్టించిన లోపం! నా దృష్టిలో అది లోపంకాదు. నా కిష్టం కనుక నేను అరుణనే చేసుకుంటాను...'' అన్నాడు శంకరం దృఢ నిశ్చయంగా.

హతాశురాలైంది పార్వతమ్మ!!

తన గడప త్రొక్కబోయే కోడలు మూగదా! ఎంత అపదిష్టం... 'శివ శివా! ఎంతటి విపత్కర పరిస్థితిని సృష్టించావు.??'

ఈ ఘోరాన్ని ఎలాగైనా ఆపాలి?


యింతలో భర్తవస్తే ఆ విషయాన్ని చెప్పింది.

శంకరం పై విశ్వనాథంగారు మండి పడ్డారు.

కాని తండ్రి మాటల్ని పట్టించుకోకుండా ''నాన్నా! అరుణ అందమైనది. చదువుకున్నది... నేనామెను ప్రేమించాను. అయితే ఆమెకు దేవుడు తీరని శాపాన్ని యిచ్చాడు. ప్రతీవారికీ ఏదో లోపం ఉండటం సహజం. కాని నేను ఆమె లోపాన్ని తెలిసే చేసుకుంటున్నాను. అటువంటప్పుడు మీరెందుకలా అడ్డుపెట్టాలని చూస్తారు. ఎవరెదురొచ్చినా సరే ఈ పెళ్లి ఆగదు'' అంటూ చరచరా వీధిలోకి వెళ్ళిపోయాడు శంకరం.

* * *

''బాబూ! నూటికో, కోటికో నీలాంటి ఆదర్శ పురుషులుంటారు. లోపాన్ని స్వయంగా చూసి చేసుకుంటున్న నిన్నెలా అభినందించాలో తెలీడం లేదు. అరుణ ఆకలైనా అడగలేని



లోపం

అందాలబొమ్మ... దాన్ని ఎలా చూసుకుంటావో .. అంతా నీదే భారం...'' అని కళ్ళు తుడుచుకున్నారు అరుణ తండ్రి అవధాన్లుగారు

అరుణ మౌనంగా వింటు నిలుచుంది.

''ఏమండీ! మీ అమ్మాయి నన్ను మొదటి చూపులోనే ఆకర్షించింది. అందులోనూ ఒకే కులం కావటం మంచిదే అయింది. మూగదైనా మంచితనం ఉందని నాకు తెలుసు. కాని వివాహానికి మా తలిదండ్రులు అడ్డుపడుతున్నారు మీకు అభ్యంతరం లేకపోతే అరుణను రిజిస్టరు మ్యేరేజి చేసుకుంటాను. మీరే సాక్షులుగా ఉంటారు...'' అని తన అభిప్రాయాన్ని విడమరచి చెప్పాడు శంకరం .

''బాబూ! మీవాళ్ళ కు యిష్టం లేకుండా పెళ్ళి చేయడం అంత మంచిది కాదేమో !'' సంశయించారు అవధాను గారు

''పర్వాలేదండీ! మీకెందుకు భయం... అంతగా కాకపోతే వేరే కాపురం పెడ్తాం..'' అని సమాధాన పరిచాడు శంకరం... ...

ఆ రోజే మ్యేరేజీ కోసం రిజిస్ట్రార్ ఆఫీసులో అప్లై చేసాడు.

* * *

నెల్లాళ్ళకు అరుణతో శంకరానికి వివాహం జరిగిపోయింది

''ఒరే! ఆగక్కడ... నా యింట్లో అడుగుపెట్టే అధికారం నీకులేదు... మేం ఈ పెళ్ళికి ఇష్టపడలేదని చెప్పి నువ్విలా చేస్తావా? కన్నవాళ్ళ చచ్చారనుకున్నావా? సిగ్గులేదురా నీకు!! ఒక మూగపిల్లని వద్దంటున్నా వినిపించుకోకుండా చేసుకుని యింతకు తెగిస్తావా??'' అంటూ వీరావేశంలో ఊగిపోయారు విశ్వనాథంగారు.

అరుణ నేల చూపులు చూస్తూ నిలుచుంది.

శంకరం ఏ మాత్రం బెదరలేదు.

''నాన్నా! ఎందుకలా అరుస్తారు? యిప్పుడు నేనేం తప్పుచేసానని. నాకిష్టమైన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాను. అది మీ కిష్టం లేదని నేను నా యిష్టాన్ని చంపేసుకోవాలా? చెప్పండి? అరుణ మూగతనాన్ని పెద్దలోపంగా ఎంచి యిలా మాటాడుతున్నారు కాని చెల్లాయి లోపాన్ని గురించి మీకు తెలిసినా మీరు దాన్ని బావగారికి తెలియకుండా కప్పిపుచ్చి ద్రోహం చెయ్యలేదా?

అప్పుడు మీకు లోపం కనిపించలేదా! యిప్పుడు ఎందుకలా అరుణ లోపాన్ని ఎత్తి చూపిస్తున్నారు. కూతురికో న్యాయం, కోడలకో న్యాయం! చాలా బాగుంది నాన్నా! మీలాంటి వాళ్ళు తమ లోపాన్ని కప్పిపుచ్చుకుని ఎదుటి వాళ్ల లోపాన్ని ఎత్తి చూపిస్తున్నారు!!

లో ప ం

నాన్నా! స్వార్థంనిండిన సమాజం యిది. కాని ఆదర్శం అనేది యింకా చచ్చిపోలేదు... మీరు ఒకే కోణంలోంచి చూసే తత్వాన్ని విడిచిపెట్టి నిదానంగా ఆ లో చిం చం డి.

అప్పుడే నేను చేసింది మంచి పనో కాదో మీకే అర్థం అవుతుంది... ఇంతకన్నా చెప్పవలసింది లేదు...'' అంటూ ధైర్యంగాలోనికి అడుగుపెట్టిన శంకరం, అరుణల వంక చూస్తూ స్థాణువుల్లా ఉండిపోయారు. విశ్వనాథం దంపతులు.

హైదరాబాదు నోట్‌బుక్

ఆగాఖాన్‌కు ఘనస్వాగతం :

ప్రపంచమంతటా ఉన్న రెండుకోట్ల ఇస్మెయిలి షియా తెగవారి గురువు ప్రిన్స్ కరీం ఆగాఖాన్ సతీసమేతంగా జనవరి 18న ఇక్కడికి వచ్చినప్పుడు బేగంపేట విమానాశ్రయంలో వారికి ఘనస్వాగతం లభించింది. విద్యాశాఖామంత్రి శ్రీ ఆనంద గజపతిరాజు, విధానపరిషత్తు అధ్యక్షులు శ్రీముకస్సీర్‌షా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ బి. ఎన్. రామన్, ఇస్మెయిలి తెగ ప్రముఖులు వారికి పుష్పమాలలువేసి స్వాగతం చెప్పారు. శ్రీ ఆగాఖాన్ వెంట ఆయన సోదరుడు శ్రీ అమీన్ మొహమ్మద్ వచ్చారు. ఆగాఖాన్ విమానాశ్రయం నుంచి సరాసరి ఫుట్‌బాల్ స్టేడియంకు వచ్చి, అక్కడ సమావేశమైన తన మతానుయాయులను ఆశీర్వదించారు. రాష్ట్ర గవర్నర్ శ్రీ అబ్రహాం శ్రీ ఆగాఖాన్ దంపతుల గౌరవార్థం రాజభవన్‌లో విందు చేశారు. తర్వాత ఆగాఖాన్ దంపతులు విమానంలో నాగపూర్ వెళ్ళారు. శ్రీ కరీంఆగాఖాన్ ఇస్మెయిల్ తెగ పీఠాధిపతి అయి 25 సంవత్సరాలయింది. ఈ సందర్భంగా ఆయన ప్రపంచమంతటా ఉన్న తన అనుయాయులకు రజతోత్సవ దర్శనం (దీదార్) ప్రసాదిస్తున్నారు. శ్రీ కరీం ఆగాఖాన్ నాల్గవ ఆగాఖాన్,49వ ఇమాం. చైనా, రష్యాలతో సహా 25 దేశాలలో ఉన్న రెండు కోట్ల షియా ఇమామీ ఇస్మెయిలీ ముస్లింలకు గురువు. శ్రీ కరీంఆగాఖాన్ 1957లో ఈ పీఠం అధిష్టించారు. ఇస్మెయిలీలు ఈ సంవత్సరం ఈ పీఠాధిరోహణ రజతోత్సవంజరుపుతున్నారు. తమఇమామయిన ఈ ఆగాఖాన్ హజరత్ మొహమ్మద్ ఫాతిమా, ఆమె భర్త హజరత్‌అలీ వంశం వారని ఇస్మెయిలీలు విశ్వసిస్తున్నారు. హజరత్ అలీ వీరి మొదటి ఇమాం శ్రీ కరీం ఆగాఖాన్ 1936అక్టోబరు 13న జన్మించారు. ఈయన తండ్రి ప్రిన్స్ అలీసోలోమన్‌ఖాన్. శ్రీ కరీంకు అన్న ఉన్నారు. కాని తాత సర్‌సుల్తాన్ అహమద్‌షా ఆగాఖాన్ శ్రీ కరీంనే తన పీఠానికి వారసుడుగా నిర్ణయించి, 79 వ ఏట 1957 జులై 11 న మరణించారు. నవయువకుడు, నూతన దృక్పథంతో తన షియా ఇమామి ఇస్మెయిలీముస్లిం తెగకు మేలు కలిగిస్తారని తాత భావించారు. శ్రీ కరీం తన బాల్యం నైరోబీ,కెన్యాలలో గడిపి, పిదప స్విట్‌జెర్లాండు లోని వేరోనీ స్కూలులో విద్యాభ్యాసం చేశారు. తర్వాత ఆయన అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఇస్మెయిలీ చరిత్రలో బి. ఎ. ఆనర్స్ పట్టం పుచ్చుకున్నారు. 1969లోఆయన బేగం షాలిమానుపెండ్లాడారు.బేగంషాలిమా న్యూఢిల్లీలో ఆంగ్లదంపతుల పుత్రిక. పూర్వపు పేరు సారా క్రోకర్‌పూల్. వారికి ముగ్గురుపిల్లలు. శ్రీ ఆగాఖానుకు ఎలిజబెత్‌రాణి 1957లో 'హిజ్‌హైనెస్' అనే బిరుదును, ఇరాన్ రాజుషా రాయల్‌హైనెస్ అనే బిరుదును ఇచ్చారు. భారత దేశంలోని ఇస్మెయిలీలు భారతీయులుగానే ప్రవర్తించాలని ఇప్పటి ఆగాఖాన్, ఇంతకు ముందు ఆగాఖానులు ఉపదేశించారు. తదనుగుణంగా భారతదేశంలోని ఇస్మెయిలీలు కులమత వర్ణ విచక్షణ లేకుండా సంఘ సంక్షేమ కార్యక్రమం కొనసాగిస్తున్నారు. సంఘసేవ కోసం శ్రీ కరీం ఆగాఖాన్ 1967లో ఆగాఖాన్ ఫౌండేషన్‌ను స్థాపించారు. దీని ప్రధాన కార్యాలయంజెనీవా(స్విట్‌జర్‌లాండ్)భారత్,బంగ్లాదేశ్, పాకిస్థాన్, కెన్యా, కెనడా, యునైటెడ్ స్టేట్స్, ఇంగ్లాండు మున్నగు పెక్కు దేశాలలో ఈ సంస్థ శాఖలున్నాయి. ఈ సంస్థ ఆయాదేశాల ప్రభుత్వ సహకారంతో విద్యారోగ్య గృహ నిర్మాణాదికార్యకలాపాలను నిర్వహిస్తుంది. దీనిని ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం ప్రభుత్వేతర సంస్థగా గుర్తించింది. భారతదేశానికి మునుపటి ఆగాఖాన్‌లతో సన్నిహిత సంబంధం ఉంది. మొదటి ఆగాఖాన్ హసూన్ అలీషా 1800 లో ఇరాన్‌లో జన్మించారు. కొంతకాలం ఆయన కెర్మాన్ అనే రాష్ట్రానికి గవర్నర్ జనరల్‌గా ఉన్నారు. కాని ఇరాన్ పాలకుల ఆగ్రహం వల్ల ఆయన భారతదేశానికి వలస వచ్చారు. బొంబాయిలో స్థిరపడ్డారు. ఆయన తర్వాత ఆయనజ్యేష్ఠ పుత్రుడురెండవ ఆగాఖానయ్యారు.కాని తర్వాత ఆయన నాలుగేళ్ళే జీవించారు. ఆయనతమ్ముడు సర్‌సుల్తాన్ అహమ్మద్, మూడవ ఆగాఖాన్ అయ్యారు. అప్పటి వైస్రాయి లార్డ్ కర్జన్ ఆయనను తన లెజిస్లేటర్ కవున్సిలుకు నామినేట్ చేశారు. 1906లోఆయనవైస్రాయి వద్దకు ముస్లింల పక్షాన రాయబారం వెళ్ళారు, అనంతరం ఆయన అఖిలభారత ముస్లింలీగ్‌ను స్థాపించి కొన్నేళ్లపాటు అధ్యక్షులుగా ఉన్నారు. 1930—32, 33లలో లండన్‌లో జరిగిన రవుండ్‌టేబిల్‌కాన్ఫరెన్సులలో ప్రతినిధిగాఉన్నారు. పిదప లీగ్ఆఫ్‌నేషన్స్‌కు అధ్యక్షులయ్యారు. ఈయనకు గుర్రప్పందాలంటే చాల ప్రీతి. ఆయన వారసుడైన ఇప్పటి నాల్గవ ఆగాఖాన్ శ్రీ కరీం ఆయన సతీమణి సంఘ సంక్షేమ కార్యక్రమాలలో చాల శ్రద్ధాసక్తులు గలవారు.

నాలుగుస్తంభాలు :

తారకరాముని ప్రభుత్వం ప్రజా నిర్ణయంతో ఏర్పడింది. ప్రత్యర్థులు దీనిని పడగొట్టడానికి ప్రతిక్షణం ప్రయత్నిస్తారు. ఏ చిన్న లోపమయినా కొండంతలుచేసి జనానికి చూపుతారు. నిజపక్షంవారే కొందరు తిరిగిపోయి ప్రత్యర్థి పక్షం చేరవచ్చు. కాకతీయ రాజ్యం పతనమైన తర్వాత దేశ సమీకరణ పరిరక్షణలకు అప్పటి ప్రముఖులు బెండపూడి అన్నయ మంత్రినికోరినప్పుడు, తాను వృద్ధుణ్ణయ్యానని కాపయ్య నాయకుణ్ని నాయకుడుగా ఎన్నుకోమన్నారు ఆయన. కాపయ నాయకుని నాయకత్వంలో తెలుగుజాతి వైభవ పునరుద్ధరణ జరిగినప్పుడు రాచకొండ, దేవరకొండ రాజులు అతనిని వెన్నుపోటు పొడిచారు. అలాటి ప్రమాదం జరుగకుండా తెలుగుదేశం నాయకులు జాగ్రతపడాలి. తెలుగుదేశం ప్రభుత్వం స్థిరంగా ఐదేళ్లు వుండడానికి నాలుగు పనులు చేస్తేచాలు. అవి నాలుగు స్తంభాలుగా వుంటూ తెలుగుదేశం, ప్రభుత్వానికి స్థిరాధారాలుగా వుంటాయి. వాటిలో మొదటిది : ఎన్నికల వాగ్దానం ప్రకారం రెండు రూపాయిలకు కిలోబియ్యం, సరఫరా చేయాలి. ఇదేమీ కష్టంకాదు. మిల్లర్లకే బియ్యం సరఫరా పని అప్పజెప్పితే, మధ్యవర్తుల ప్రమేయం లేక సక్రమంగా బియ్యం అందుతుంది. ప్రజాసామాన్యానికి. రెండవది : విద్య. కేవలం వృత్తి కళాశాలల ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం చాలదు. ప్రాథమిక విద్యకే వేయిరూపాయిలు విరాళమిచ్చి, 60 రూపాయిలు నెలసరిఫీజు చెల్లించడం ఎంతఘోరం. విద్యను పూర్తిగా ప్రభుత్వపరం చేయాలి. అప్పటికి గాని ప్రజలందరికీ సరైన శిక్షణ లభించదు. మూడవది : లంచగొండితనం. లంచగొండితనం విశ్వవ్యాపనంలో ప్రపంచమంతటా వుంది. దానిని రూపుమాపడం సాధ్యంకాదు. కాని కొంత వరకు తగ్గించవచ్చు. ఇప్పుడు ఇంతగా పెరగడానికి పై వారి నుంచి ఇది కిందికి ప్రవర్తించడం కారణం. పార్టీ నిధి పేరుతో మంత్రిగారు తను కిందవారికి వారు తమ కిందివారికి ఇలాలంచానికి పైవారేబాటలు తీర్చాయి. నీతి నిజాయితీ, క్రమశిక్షణ గల వారిని నిర్వహణాధికారులుగా నియమించి, పార్టీ ఫండని, ఇంతతెండని, వారిని ఇబ్బంది పెట్టకుండా వుండాలి. నాల్గవది : గ్రామ స్థాయిలో కార్యకర్తల బలం. జనతాపార్టీ ప్రభుత్వం కాండంలో పెరిగి వేళ్ళు కుళ్ళిన చెట్టులాగ కూలింది. ఏ పార్టీకైనా కాకటివేళ్లు బలంగా వుండాలి. అందువల్ల తెలుగు దేశానికి గ్రామ స్థాయిలో బలం అవసరం. అదిన్నీ ప్రజాస్వామ్య పద్ధతిలో. మరొక సలహా. జంట నగరాలకు రోజూ కొన్నివేలమంది ఇతర ప్రాంతాల నుండి వస్తుంటారు. వారికి సాధారణమైన ధరకు భోజనం లభిస్తే ఎంతో సౌకర్యం. మద్రాసులో నేటికీ రెండు రూపాయకుల మంచి భోజనం లభిస్తుంది.జంటనగరాలలోనుఅలాటి ఏర్పాటుచేయాలి. పూర్వం పలువురు మంత్రులకు పలు హోటళ్ళలో వాటాలు వుండడంవల్లహోటళ్ల ధరలు తగ్గించడానికి పాటుపడేవారు కారనే వదంతి ప్రజలలో వుండేది. ఇప్పుడు అలాటి పరిస్థితిలేదనుకుంటాను.

ఉపశ్రుతి :

ఏంసార్, ఎవరికి వోటు వేశారు? అని ప్రశ్నించాను, పరిచితులయిన ఒక న్యాయమూర్తిని. ఆయన ఆలోచనతో నావైపు చూస్తూ—ఇదివరకు నేను వోడిపోయిన పార్టీలకే వేశాను వోటు. కాంగ్రెస్ ఎలాగూ గెలిచే పార్టీగదా అని దానికే వేశాను ఈసారి. పాపం అది వోడిపోయింది—అన్నారు.

—తిరుమల రామచంద్ర

అవీ ఇవీ అన్నీ

ఉమ్మెత్తల అవార్డు

వనపర్తి సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కవితా సంపుటాల పోటీలో 1982కి శ్రీ రాదేయ రచన 'దివ్యదృష్టి' ఉమ్మెత్తల అవార్డు అందుకున్నట్లు నిర్వాహకులు తెలియజేస్తున్నారు.

1983లో నిర్వహించే కవితా సంపుటాలపోటీకి 1979 నుంచి 83 జనవరి వరకూ ప్రచురణ అయిన తమ గ్రంథాలని రెండేసి ప్రతులు చొప్పున మార్చి 31కి అందేలా అధ్యక్షుడు, సాహిత్యవేదిక, బ్రాహ్మణవీధి, వనపర్తి—509103 కి పంపవలసిందిగానిర్వాహకులు రచయితలని కోరుతున్నారు. ఉత్తమ గ్రంథానికి ఉమ్మెత్తలఅవార్డు రు 166లు నగదు బహుమతి అందజేయబడుతుంది ప్రచురణకర్తలు కూడా గ్రంథాలని పంపవచ్చు కానీ బహుమతి రచయిత (త్రి)కి యివ్వబడుతుందని వారు తెలియజేశారు.

నాట్యభారతి రజతోత్సవాలు

నాట్యభారతి తన రజతోత్సవాలలో నాటక ప్రదర్శనలతోపాటు సాహిత్య సభలను మేళవించి మరో చక్కటి ప్రయోగం చేసింది. ఈ రజతోత్సవాల సందర్భంగా సమర్పించిన నవ్యనాటకం "అయోమయోపాఖ్యానం" సుప్రసిద్ధ నాటకవేత్త, శ్రీఅత్తిలి కృష్ణారావుగారు మరోమంచి ప్రయోగానికి నాంది పలికారీ నాటకంతో. ఆశ్చర్యపరిచేమరోవార్త ఏమిటంటే ఈ నాట్యభారతి నాటకాలకు ప్రేక్షకులు టిక్కెట్టు కొనుక్కొని మరీ వచ్చారు.

నాటిక; ఏకపాత్రాభినయ; పాటల పోటీలు

సత్తెనపల్లి ప్రగతి కళామండలి (రిజిష్టర్డు) 35వ వార్షికోత్సవ సందర్భమున 10వ నాటక కళాపరిషత్తును 1983 ఏప్రిల్ చివరి వారములో రాష్ట్రస్థాయిలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కళామండలి అధ్యక్షులు శ్రీ పత్రి జగన్నాథరావు తెలియ జెస్తున్నారు.

ఈ సందర్భములో నాటక, ఏకపాత్రాభినయ, పాటల పోటీలు నిర్వహించబడతాయి. విజేతలకు శాశ్విత షీల్డులతో పాటు ఉత్తమ నాటిక ప్రదర్శనకు ర 750 ద్వితీయ ప్రదర్శనకు రు.500 ఏకపాత్రాభినయమునకు రు.116 ఉత్తమ గాయకునకు రు. 116లు నగదు బహుమతులను ఇస్తున్నట్లు తెలియజేశారు. ధరఖాస్తులు పంపువారు 1983 ఫిబ్రవరి 25వ తేదీలోగా శ్రీ కరివీరయ్య, కార్యదర్శి, ప్రగతి కళామండలి, సత్తెనపల్లి (గుంటూరు) జిల్లాకి పంపాలి ★

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna.

safari

నావలాగ ప్రయాణపు ఊహల్లోకి తీసుకెళ్ళే సూట్‌కేస్ ఇదే!



ఎందుకంటే దీని పేరూ, తరహాయే వేరు, ఓ ప్రత్యేకత గల సూట్‌కేస్. దీని పేరు చెప్పంగానే గుర్తిస్తారు మరి మీరు. దృఢంగా, తేలికగా, మన్నేలా. తీసుకువెళ్ళి తీసుకురావడంలో, క్రిందపెట్టి ఎత్తడంలో ఎంతో వీలుగా మీరూ, ప్రయాణం, ప్రయాణం, సఫారీ, ఒకే కథలోని పాత్రలు నిజానికి.



safari
LUGGAGE

ప్రయాణంలో మీకు తోడునీడగా